సూర్య
18వ వసంతంలోకి ...
visit us @ http://epaper.suryaa.com
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
గురువారం | 2 అక్టోబర్ 2025 | హైదరాబాద్
సంపుటి 18 | సంచిక 341
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi




అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : దక్షిణాయణం - వర్ష ఋతువు, శుక్ల పక్షం అశ్వయుజ మాసం విజయదశమి మ.2.41 వరకు, ఉత్తరాషాఢ ఉ.6.11 వరకు, వర్జ్యం ఉ.10.17 నుంచి 11.56 వరకు
రాహుకాలం మ.1.30 నుంచి 3.00 వరకు దుర్ముహూర్తం ఉ.9.52 నుంచి 10.39 వరకు తిరిగి మ.2.37 నుంచి 3.25 వరకు

## కష్టపడ్డవారికే కాంగ్రెస్

# జడ్పీటీసీ టికెట్లు

- సీఎం రేవంత్ కీలక ప్రకటన!
- స్థానిక ఎన్నికల్లో ఎలాగైనా విజయం కోసం పావులు కదుపుతోంది
- జిల్లా పరిషత్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక దృష్టి
- ఒక్కో స్థానానికి ముగ్గురితో ప్రాథమిక జాబితాను సిద్ధం చేయాలని నిర్ణయం



రాష్ట్రంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఎలాగైన విజయం సాధించాలని అడుగులు కదుపుతోంది. అందులో భాగంగా జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక కోసం ప్రత్యేక దృష్టి పెట్టింది. జడ్పీటీసీలుగా పోటీ చేసేందుకు పెద్ద సంఖ్యలో ఆశావహులు ముందుకు వస్తున్న నేపథ్యంలో... ఒక్కో స్థానానికి ముగ్గురితో ప్రాథమికంగా ఒక జాబితాను సిద్ధం చేయాలని నిర్ణయించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు తయారు చేసే జాబితాను టీపీసీసీకి పంపనున్నారు. అలా వచ్చిన జాబితాలను పరిశీలించి జడ్పీటీసీ అభ్యర్థిని టీపీసీసీ ఫైనల్ చేయనుంది.

వివరాలు-8లో

## దసరా శుభాకాంక్షలు



పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు సూర్య దసరా శుభాకాంక్షలు. దసరా పర్వదినం సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున శుక్రవారం (03-10-2025) నాటి సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం (04-10-2025)

- సూర్య యాజమాన్యం

















"నీ చర్యల వల్ల ఎలాంటి ఫలితాలు వస్తాయో నీకు ఎప్పటికీ తెలియకపోవచ్చు. కానీ నువ్వు ఏమీ చేయకపోతే ఫలితం ఉండదు."

- మహాత్మా గాంధీ



"రక్తమాంసాలతో ఇలాంటి వ్యక్తి ఈ భూమిపై నడిచాడని రాబోయే తరాలు నమ్మకపోవచ్చు."

- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్



"మహాత్మా గాంధీ వచ్చి భారతదేశంలోని లక్షలాది మంది నిరుపేదల తలుపు వద్ద నిలిచాడు... వారి హృదయాలను తాకాడు."

- రవీంద్రనాథ్ ఠాగూర్



స్థానిక సంస్థల ఎన్నికలను

# సమర్థంగా నిర్వహిస్తాం

● శాఖలోని ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతాం ● డీజీపీ శివధర్‌రెడ్డి





తెలంగాణ బ్యూరో\ప్రతినిధిః రాష్ట్రంలో పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరగా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరతామని నూతన డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. నూతన డీజీపీగా ఆయన లక్డీకపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. మాకు బలమైన జట్టు ఉంది. క్షేత్రస్థాయిలో సాంకేతికతను వినియోగించుకుంటాం. పోరాట మార్గం వీడేందుకు సిద్ధమని ఇటీవల నక్సల్స్ నేత లేఖ రాశారు. జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని వారిని కోరుతున్నాం. మావోయిస్టుల సిద్ధాంతాలు ఆచరణలో విఫలమయ్యాయని భావిస్తున్నాం. లొంగిపోయిన వారికి అన్ని రకాలుగా అండగా ఉంటాం. రాష్ట్రంలో పోలీసుస్టేషన్ల సంఖ్య కంటే పోలీసుల్లో నైపుణ్యాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. పోలీసు శాఖ ప్రత్యేక విభాగాల్లోని ఖాళీలను నిపుణులతో భర్తీ చేస్తాం" అని డీజీపీ తెలిపారు.

## రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

మంత్రి పొన్నం ప్రభాకర్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : చెడుపై మంచి సాధించిన విజయంగా దసరా (విజయదశమి ) జరుపుకుంటారని రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ శమీ పూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలయ్ బలాయ్ తీసుకొని, పెద్దల ఆశీర్వాదం తీసుకొని శుభసూచకంగా భావించే పాలపిట్ట ను దర్శించుకోవడం మన సంస్కృతి సంప్రదాయాల్లో భాగమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ విజయదశమి అందరూ కుటుంబ సభ్యులతో సుఖ సంతోషాలతో జరుపుకోవాలని మంచి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. ఈ విజయదశమి నుండి ప్రతి ఒక్కరి జీవితంలో మరిన్ని విజయాలు సాధించేలా ఆశీర్వాదం ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ అమ్మవారిని ప్రార్థించారు.

## ఐర్లాండ్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

● కోలాటం, దాండియా ఆటలతో కోలాహలం ● బతుకమ్మను పేర్చి తీసుకువచ్చిన ఆడపడుచులకు బహుమతులు ● తెలంగాణ ఎన్నారైల హంగామా



హైదరాబాద్ : ఐర్లాండ్‌లోని తెలంగాణ ఎన్నారైల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డబ్లిన్ నగరంలో 50 మంది వాలంటీర్స్ కలిసి ఈ బతుకమ్మ పండుగని ఘనంగా నిర్వహించినట్టు తెలిపారు. గత 13 ఏళ్లుగా ఈ బతుకమ్మ వేడుకలను వాలంటీర్లు దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సుమారు 40 మంది వాలంటీర్లు, 50 మంది దాతలు ముందుకొచ్చి బతుకమ్మ వేడుకలు నిర్వహణకు ప్రతి ఏటా సహాయ సహకారాలు అందిస్తున్నారు.

కోలాటం, దాండియా ఆటలతో కోలాహలం : డబ్లిన్ నగరంలో ప్రాంతాలకు అతీతంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు సుమారు 750 మంది హాజరయ్యారు. యువతులు, మహిళలు బతుకమ్మ, కోలాటం, దాండియా ఆటలను ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆడారు. మహిళలు చిన్నారులకు బతుకమ్మ పండుగ గురించి వివరించారు. మొదటగా దుర్గా మాత పూజతో కార్యక్రమం మొదలుపెట్టారు. పిల్లలకు మ్యాజిక్ షో ఏర్పాటు : బతుకమ్మ, దాండియా ఆటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఐర్లాండ్లో ఉండే తెలుగు పిల్లలకు తెలియచేయాలని లక్ష్యంతో తెలంగాణ ఎన్నారైల ప్రతి సంవత్సరం బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్న పిల్లలకు మ్యాజిక్ షో ఏర్పాటు చేశారు. బతుకమ్మలు తీసుకువచ్చిన ఆడపడుచులకు నిర్వాహకులు రకరకాల బహుమతులు ప్రదానం చేశారు. అక్కడికి వచ్చిన అతిథులకు ప్రసాదం, సాయంత్రం తేనీరు, స్నాక్స్ రుచికరమైన వంటలు వడ్డించారు.

## మూడు రోజులు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక



తెలంగాణ బ్యూరో\ప్రతినిధిః తెలుగు రాష్ట్రాలను వరుణుడు ఏమాత్రం వదిలిపెట్టడంలేదు. మొన్నటి వాయుగుండం ఎఫెక్ట్ మరువక ముందే.. మరో అల్పపీడనం భయపెడుతోంది. వాయుగుండంగా మారి అవకాశం ఉండడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మరో నాలుగు రోజులపాటు వర్షాలు తప్పవంటోంది వాతావరణశాఖ. అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఏపీ, తెలంగాణలో గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితులు.. ఆ కాలం.. ఈ కాలం అనే తేడా లేకుండా గ్యాప్ లేకుండా వర్షాలు కుమ్మేస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో కుండపోతను మించి ముంచేస్తున్నాయి. మున్నటికిమొన్న బంగాళాఖాతంలోని వాయుగుండం ప్రభావంతో రెండు, మూడు రోజులపాటు తెరిపివ్వకుండా భారీ వర్షాలు కురిశాయి. ఇప్పుడు మరోసారి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. అవర్తనం ప్రభావంతో, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. వాయువ్య దిశగా కదిలి పశ్చిమమధ్య, అనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో గురువారం (సెప్టెంబర్ 2) నాటికి వాయుగుండంగా బలపడుతుందని తెలిపింది. శుక్రవారం ఉదయానికి దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో.. ఏపీకి వారం రోజుల పాటు వర్ష సూచన జారీ చేసింది వాతావరణ శాఖ. ప్రధానంగా.. పార్వతీపురం మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, నెల్లూరు, తిరుపతి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వీటితోపాటు.. ఏలూరు, కృష్ణా జిల్లాల్లోనూ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందంటోంది వాతావరణశాఖ.

# తెలంగాణకు కొత్తగా నాలుగు కేంద్రీయ విద్యాలయాలు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి





హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కొత్తగా మరో నాలుగు కేంద్రీయ విద్యాలయాలను కేటాయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఉన్న 35 కేంద్రీయ విద్యాలయాలకు తోడుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం (యాస్పిరేషనల్ డిస్ట్రిక్ట్), ములుగు జిల్లా కేంద్రం (గిరిజన ప్రాంతం), జగిత్యాల జిల్లా - జగిత్యాల రూరల్ మండలం చెల్గల, వనపర్తి జిల్లా - నాగవరం శివారులో ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ఈ నాలుగు విద్యాలయాలు మారుమూల ప్రాంతాల్లో.. నాణ్యమైన ప్రాథమిక, సెకండరీ విద్యను అందించడంలో కీలకం కానున్నాయని కిషన్ రెడ్డి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు చెప్పారు.

గత రెండేళ్లలోనే కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో నాణ్యమైన సెకండరీ విద్యను అందించేందుకు రూ.400 కోట్లతో 832 పీఎం-శ్రీ స్కూల్స్‌ను మంజూరు చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు.

దేశవ్యాప్తంగా పీఎం శ్రీ స్కూల్స్ కోసం ఎక్కువ కేటాయింపులు అందుకున్న రాష్ట్రం తెలంగాణనే కావడం విశేషమన్నారు. సమగ్రశిక్షా అభియాన్ కింద గత రెండేళ్లలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.2వేల కోట్లు కేటాయించిందని వివరించారు. దాదాపు రూ.వెయ్యి కోట్లతో ములుగు జిల్లాలో సమ్మక్క, సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని కూడా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు.

## రెండు పార్టీలకూ ఓట్లు అడిగే అర్హత లేదు

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



కరీంనగర్: కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పార్టీలకు ఓట్లు అడిగే అర్హత లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడంతోపాటు 2028 లో తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయన చెప్పారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్రం రూ.40 వేల కోట్ల విలువైన ఎరువులను రాయితీపై ఇస్తుందని, ఎరువుల కొరతను అడ్డుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం.. కేంద్రంపై నెట్టడం సరికాదన్నారు. బీసీ రిజర్వేషన్లకు తాము కట్టుబడి ఉన్నట్లు చెప్పారు.

# బీసీలు సిద్ధం కండి

● స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటాలి ● బీసీలు ఎన్నో పోరాటాలు, ఉద్యమాల ఫలితమే 42 శాతం రిజర్వేషన్లు ● ప్రభుత్వం స్పందించి జారీ చేసిన జీవో నెంబర్ 9 ● రాజీలేని పోరాటం చేసిన దాన్ని కాపాడుకుందాం.. విజయ ఢంకా మోగిద్దాం ● 18 బీసీ సంఘాల సమావేశంలో బీసీ నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య



తెలంగాణ బ్యూరో\ప్రతినిధి: స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి బీసీ అభ్యర్థులు సిద్ధంగా కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. బుధవారం బి.సి భవన్ లో 18 బి.సి సంఘాల సమావేశం ఆర్.కృష్ణయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమీక్షా సమావేశంలో సుదీర్ఘంగా 42 శాతం రిజర్వేషన్లు రక్షించుకోవడానికి వ్యూహంపై చర్చించారు. బీసీలు ఎన్నో పోరాటాలు ఉద్యమాలు చేసిన తర్వాత 42 శాతం రిజర్వేషన్లు సాధించాం. ప్రభుత్వం స్పందించి జీవో నెంబర్ 9 జారీ చేశారు. దీని ప్రకారం ఎన్నికలు జరపడానికి రాజీలేని పోరాటం చేసి దీన్ని కాపాడుకుందాం. ఈ 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత, న్యాయబద్ధత, రాజ్యాంగబద్ధత ఉంది. చాలామంది కొందరు రిజర్వేషన్లను గిట్టని దీనికి 50 శాతం సీలింగ్ ఉందని చెప్పి ప్రజలలో ప్రచారం చేస్తున్నారు. లేకలేక బీసీ ప్రజలకు న్యాయమైన వాటా వస్తుందంటే కొందరు కోర్టుకు పోయి అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నారు. దీన్ని గట్టిగా ప్రతిఘటించవలసిన అవసరం ఉంది. అగ్రకులాలు 50 శాతం సీలింగ్ లేదు. ఒక బి.సి.లకే సీలింగ్ అని ప్రశ్నించారు. సమాజంలో ఏ వర్గం వారు కూడా బీసీ రిజర్వేషన్లు వ్యతిరేకించరాదని విజ్ఞప్తి చేస్తున్నాం. బీసీలు అగ్రకులాలు వందల సంవత్సరాలుగా కలిసి జీవిస్తున్నాం. ఒక సంప్రదాయంతో సోదర భావంతో బ్రతుకుతున్నాం. బీసీలు పోరాడి పోరాడి సాధించుకున్న రిజర్వేషన్ ను వ్యతిరేకిస్తే తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. గతంలో 1990లో మండల కమిషన్ ఉద్యమం సందర్భంగా రిజర్వేషన్లను వ్యతిరేకించిన వారికి ఏ గతి పట్టిందో ఒకసారి చరిత్ర చూసుకోవాలి. రిజర్వేషన్లను వ్యతిరేకించే వారిని తరిమి తరిమి కొట్టారు. గ్రామాలలో కూడా రిజర్వేషన్లను వ్యతిరేకించే వారిని తరిమి గ్రామాల నుండి వెళ్లగొట్టారు. అనవసరంగా రిజర్వేషన్లను వ్యతిరేకించి గ్రామాలలో శాంతియుత వాతావరణం చెడగొట్టొద్దు అన్నారు. ఇప్పుడు స్థానిక సంస్థలలో బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధ, చట్టబద్ధత, న్యాయబద్ధత ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243- -6 ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. అలాగే అసెంబ్లీలో బీసీ బిల్లు చట్టం చేశారు. జనాభా లెక్కలు తీసే న్యాయ బద్ధం చేశారు. గతంలో సుప్రీంకోర్టు అనేకసార్లు తీర్పులలో జనాభా లెక్కలు ఉంటే దాని ప్రకారం రిజర్వేషన్లను పెంచవచ్చని తీర్పు చెప్పారు. అన్ని కోణాలలో పెంపుదలకు మద్దతు ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-%ఆ%6 ప్రకారం స్థానిక సంస్థలలోని బీసీ రిజర్వేషన్లను పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగ అధికారం ఇచ్చింది కావున అసెంబ్లీ చట్టం చేశారు జీవో తీసి వెంటనే ఎన్నికలు జరపవచ్చు ఏమైనా న్యాయపరమైన సమస్యలు వస్తే సుప్రీంకోర్టుకు ఏ కోర్టుకు ఎవరైనా వెళ్లిన బీసీల, కేసులు గెలిచే అవకాశం ఉంది ఎందుకంటే జనాభా లెక్కలు ఉన్నవి అసెంబ్లీ చట్టం చేశారు అలాగే సుప్రీంకోర్టు అగ్ర కులకు 10శాతం రిజర్వేషన్లు పెట్టినప్పుడు కేసులో 50% సీలింగ్ ఎత్తివేసింది. పైగా ఇందిరా సాహ్నీ కేసులో ఎంపరికల్ డాటా ఉంటే 50% సీలింగ్ ను అధిగమించవచ్చునని సుప్రీంకోర్టు అభిప్రాయం కూడా ఉన్నది. ఇప్పుడు అన్ని కోణాల్లో చూస్తే కేసు గెలిచే అవకాశం ఉంది. చట్ట ప్రకారము, న్యాయప్రకారము రాజ్యాంగపరమైన అవరోధాలు లేవు కావున సుప్రీంకోర్టులో కేసు గెలుస్తుంది. ఎందుకంటే రిజర్వేషన్లు పెంచడానికి న్యాయపరమైన చట్టపరమైన రాజ్యాంగపరమైన అవరోధాలు ఏమీ లేవు కేసు బలంగాఉంది. రిజర్వేషన్లు పెంచడానికి కులాల వారీగా లెక్కలు తీశారు. అసెంబ్లీలో చట్టం చేశారు. ముఖ్యంగా అగ్రకులాల సోదరులు కొందరు రిజర్వేషన్ వ్యతిరేకులు దీనిని పాజిటివ్ గా ఆలోచించి మద్దతు ఇవ్వాలి. ఇది ప్రజాస్వామ్య దేశం. ఏ సామాజిక వర్గానికి వారి, వారి జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ రంగాలలో వాటా ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీ వారి జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో వాటా ఉంది. కానీ బీసీలకు ఇంతకాలం లేదు. ఇప్పుడు బీసీల జనాభా 56శాతం ఉంటే 42శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. జనాభా కంటే తక్కువ ఇచ్చారు. అగ్రకులాల జనాభా 6శాతం ఉంటే 10శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. జనాభాకు మించి రిజర్వేషన్లు ఇచ్చారు. బీసీలకు ఇంకా అన్యాయం జరుగుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. దీనిని కూడా ఓర్చుక పోతే సహించేది లేదని హెచ్చరించారు. అగ్రకులాలకు రిజర్వేషన్లు ఇస్తే బీసీలు వ్యతిరేకించలేదు. అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చినపుడు 50 శాతం సీలింగ్ గుర్తుకు రాలేదా? బి.సి రిజర్వేషన్లు ఇచ్చేటప్పుడు 50 శాతం సీలింగ్ గుర్తుకు రాలేదా? ఈ సమావేశంలో గుజ్జ కృష్ణ, సి. రాజేందర్, కోల జనార్దన్, బర్క కృష్ణ, కొట్ల శ్రీనివాస్, జిల్లపల్లి అంజి మనికంఠ, రాజు నేత, అనంతయ్య, మోదీ రాందేవ్, గొరిగె మల్లేష్ యాదవ్, నిమ్మల వీరన్న, జి. కృష్ణ యాదవ్, కూనూరు నర్సింహ గౌడ్, ముత్యం వెంకన్న గౌడ్ టి.ఆర్ చంద్ర నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో సోయి లేని ప్రభుత్వం నడుస్తోంది

● బతుకమ్మ నిమజ్జనంలో సీఎం పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమే ● గిన్నిస్ రికార్డ్ కోసం బతుకమ్మను వాడుకోవడం ఎందుకు ● కేవలం పది వేల మంది మహిళలతో బతుకమ్మ నిర్వహించి అవమాన పరిచారు ● తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



తెలంగాణ బ్యూరో\ప్రతినిధి: బతుకమ్మ వేడుకల సందర్భంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఏంతమంది నుంచి లండన్ వరకు బతుకమ్మను తీసుకెళ్లిన అనుభవం ఉందని గుర్తుచేసిన ఆమె, ప్రస్తుతం తెలంగాణలో సోయి లేని ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. బతుకమ్మ నిమజ్జనంలో సీఎం పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమేనని పేర్కొన్న కవిత, అయితే గిన్నిస్ రికార్డ్ కోసం బతుకమ్మను వాడుకోవడం ఎందుకని ప్రశ్నించారు. కేవలం పది వేల మంది మహిళలతో బతుకమ్మ నిర్వహించి అవమాన పరిచారని ఆరోపించారు. వచ్చే సంవత్సరం లక్ష మంది మహిళలతో బతుకమ్మ జరిపి గిన్నిస్ రికార్డులో స్థానం సంపాదిస్తామని కవిత ప్రకటించారు. బీసీ కులగణన చేపట్టినప్పుడు తప్పు అన్నారు, కానీ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ జీవో ఇచ్చిన వెంటనే కేసులు వేశారని కవిత విమర్శించారు. రేవంత్ రెడ్డి సన్నిహితులే ఈ కేసులు వేశారని ఆమె ఆరోపించారు. బీజేపీ నేత ఈటెల రాజేందర్‌పై కూడా కవిత ఘాటు కామెంట్స్ చేశారు. "ఎవరూ పోటీ చేయొద్దంటూ బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు. ఈటెల వ్యాఖ్యలు వ్యక్తిగతమేనా? లేక బీజేపీ పార్టీ స్టాండేనా?" అని ప్రశ్నించారు. మహారాష్ట్రలో ఎన్నికలు రద్దవుతాయని ఈటెల చెప్పడం కోర్టులను ప్రభావితం చేసే ప్రయత్నమేనని ఆమె విమర్శించారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును పాస్ చేసినప్పటికీ, వర్గీకరణ వారీగా రిజర్వేషన్లు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని కవిత వ్యాఖ్యానించారు. ఈ నెల 8న కోర్టు తీర్పు వచ్చిన తర్వాత మా కార్యాచరణను ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయా లేదో ఇంకా క్లారిటీ లేదని, పోటీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ పనులను ప్రభుత్వం చేపట్టడం స్వాగతించదగ్గదని పేర్కొన్నారు. బీసీ హక్కుల కోసం బీఆర్ఎస్ ఉద్యమం చేస్తే మంచిదని సూచించారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ కసరత్తు

● అభ్యర్థి ఎంపికపై ఫోకస్ పెట్టిన కాంగ్రెస్ పార్టీ ● సీఎంతో మహేశ్ కుమార్ గౌడ్, పొన్నం ప్రభాకర్ భేటీ



తెలంగాణ బ్యూరో\ప్రతినిధి: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించిన కసరత్తును కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌తో పాటు జూబ్లీహిల్స్ ఎన్నిక షెడ్యూల్ కూడా వస్తుందని కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థి ఎంపికపై ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే బుధవారం ఉదయం సీఎం రేవంత్ రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ భేటీ అయ్యారు. ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికల అభ్యర్థులతో పాటు జూబ్లీహిల్స్ అభ్యర్థిపై చర్చ జరిగింది. ఈ నెల 6న ఏఐసీసీలో స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో స్క్రీనింగ్ కమిటీ సమావేశంకు ముందే అభ్యర్థుల ఎంపికను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, తుమ్మల నాగేశ్వర రావు జిల్లా ఇన్‌ఛార్జిలుగా ఉన్నారు. టికెట్ ఆశిస్తున్న అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జిలకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అలానే గెలుపు కోసం అనుసరించే ప్రణాళికలను కూడా సిద్ధం చేయాలని సూచించారు. ఇక్కడ బీసీ అభ్యర్థిని రంగంలోకి దింపుతారా? లేదా ఓసీకి అవకాశం ఇస్తారా? అన్నది ఇంకా క్లారిటీ లేదు. బీసీ కోటాలో అంజన్ కుమార్ యాదవ్, నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్ రేసులో ఉన్నారు. రెడ్డి కోటాలో సీఎన్ రెడ్డి, రంజిత్ రెడ్డిలు ఉన్నారు.

## పల్లెబాట పట్టిన పట్నం వాసులు

● సొంతూళ్లకు పయనమవుతున్న హైదరాబాద్ నగర వాసులు ● జనాలతో కిక్కిరిసిపోతున్న బస్టాండ్లు ● దసరాకి 7,754 వేల ప్రత్యేక బస్సులు ● తాత్కాలిక బస్టాండ్లు కూడా ఏర్పాటు





తెలంగాణ బ్యూరో\ప్రతినిధిః 2025 దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్ నగర వాసులు సొంతూళ్లకు పయనమవుతున్నారు. ప్రస్తుతం బస్టాండ్‌లు అన్ని జనాలతో కిక్కిరిసిపోయాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. దసరాకి ప్రత్యేకంగా 7754 బస్సులను ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసింది. జేబీఎస్, ఎంజీబీఎస్‌తో పాటు ఆరాంఘర్, ఎల్బీ నగర్, ఉప్పల్ వంటి రద్దీ ప్రాంతాల్లో తాత్కాలిక బస్ స్టాండ్‌లను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. గతంలో పండగలకు జనాలు ఆర్టీసీ బస్సుల్లో కిక్కిరిసిన రద్దీలో వెళ్లి వచ్చేది. ఇప్పుడు పండగలకు అధిక సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేయడంతో.. ప్రయాణికులు ప్రశాంతంగా జర్నీ చేస్తున్నారు. బస్సులు చాలా ఉండడంతో చాల మంది ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక 2013 జీవో ప్రకారమే పండగలకు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నామని ఆర్టీసీ అధికారులు చెప్పారు. రిటర్న్ జర్నీ ఖాళీగా రావాల్సి వస్తుండటంతో.. చాలా మినిమం చార్జీలు వసూలు చేస్తున్నామని తెలిపారు. రేపే దసరా కాబట్టి ఇప్పటికే సగానికి పైగా సిటీ ఖాళీ అయ్యింది.. రాత్రికి మొత్తం ఖాళీ అయ్యే అవకాశం ఉంది.

## ప్రతీదీ రాజకీయమేనా..?

ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



తెలంగాణ బ్యూరో\ప్రతినిధిః బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతి రాజకీయం చేయొద్దని కాంగ్రెస్ పార్టీకి చెందిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. మీ పాల్లలో ఒక్క ఎమ్మెల్యే.. ఏ రోజైనా తనకు సంబంధించిన ఇష్యూ పైన మాట్లాడారా? అని ఆయన కేటీఆర్ ను సూటిగా ప్రశ్నించారు. ప్రజలకు కావాల్సిన అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఏరోజైనా స్వేచ్ఛగా మాట్లాడారా? అని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పార్టీలో, మా ప్రభుత్వంలో స్వేచ్ఛ ఎక్కువ అని చెప్పిన నిరుధ్ రెడ్డి.. 'మా ప్రభుత్వానికి ప్రజలపై చిత్తశుద్ధి ఉంది. మీ పాలన.. నిరంకుశత్వ పాలన. మీది రౌడీయిజం పాలన. అది చూడలేకనే ప్రజలు మిమ్మల్ని.. మీ పార్టీని బొంద పెట్టారు. నేను పోరాటం చేసేది రైతుల కోసం, నా జడ్చర్ల నియోజకవర్గం ప్రజల కోసం. మీ ఎమ్మెల్యేలు రౌడీయిజం చేసిన ఫ్యాక్టరీల్లో వాటాలు అడిగారు. వసూళ్లు చేశారు. అని మీరు గమనించాలి' అని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. తాను చెరువుల్లో చేపలు చనిపోవాలన్నాయని మురిదాలు కోసం ఫైట్ చేస్తున్నాను.. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ఫ్యాక్టరీల్లో పొల్యూషన్ వచ్చినా వాళ్లకు కమీషన్ వస్తే చాలని, ఎప్పుడు కూడా ఈ సమస్య పై మాట్లాడలేదని మీరు గుర్తించాలని అనిరుధ్ రెడ్డి.. కేటీఆర్ ను ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు.

## ఎన్డీఎస్ఎఫ్ కూటమి చైర్మన్‌గా వడ్లమూరి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఎన్ ఎఫ్ఎండీఎస్ఎఫ్ కూటమి చైర్మన్ గా జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి మూడో సారి జాతీయ చైర్మన్ గా వడ్లమూరి. కృష్ణ స్వరూప్ ని ఏక గ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని నూతన చైర్మన్ కృష్ణ స్వరూప్ తెలిపారు. ఇటీవల హైదరాబాద్ లో జరిగిన మహాసభ లో వివిధ పార్టీ లు ప్రజా ఉద్యమ సంస్థల కు చెందిన ప్రతినిధులు తో నూతన కమిటీ ని ఎన్నుకోవడం జరిగింది. వర్కింగ్ చైర్మన్ లు గా డాక్టర్ : వి. ఎల్. రాజు. జి. ఎన్ రావు.ఎస్. బి. అశోక్ చక్రవర్తి.. ప్రధాన కార్యదర్శులు గా పి. రాజలింగం. ఎస్. అశోక్ కుమార్.షేక్ బాషా ఉప -అధ్యక్షులుగా పుల్లారి. వెంకటరాజేశ్వరరావు. రోజలీలా..గంధం. శంకర్ జాతీయ అధికార ప్రతినిధులు గా కొల్ల. సుధాకర్.. గోపాల. శ్రీనివాస్ లీగల్ సెల్ కన్వీనర్ గా కె. శరత్ కుమార్. కార్యవర్గం సభ్యులు గా ఎస్. అంజనేయులు. ఉప్పు. రాంబాబు.ఆదిత్య చిన్నా.సుశీల్ కుమార్ పిండి లను ఎన్నుకోవడం జరిగింది. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు.. మరియు 11 అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఫ్రంట్ తరుపున ఉమ్మడి గా పోటీ చేయాలని. జనవరి 26 న భారత్ గవర్నర్ రాజ్ భవన్ కార్యక్రమం లను నిర్వహించాలని మహా సభ ఏక గ్రీవమ్ గా తీర్మానం చేయడం జరిగిందని చైర్మన్ వడ్లమూరి. కృష్ణ స్వరూప్ తెలిపారు.



"మీకు ఏమి జరుగుతుందో కాదు, దానికి మీరు ఎలా స్పందిస్తారనేది ముఖ్యం."
- ఎపిక్టెటస్



"కొన్నిసార్లు ప్రశ్నలు సంక్లిష్టంగా ఉంటాయి మరియు సమాధానాలు సరళంగా ఉంటాయి."
- డాక్టర్ స్యూస్



"విజయం సాధారణంగా దాని కోసం వెతకడానికి చాలా బిజీగా ఉన్నవారికే వస్తుంది."
- హెన్రీ డేవిడ్ థోరియా



# హైదరాబాద్‌లో పెరిగిన క్రైమ్



- నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో సంచలనం
- హత్యలు, అత్యాచారాలు, రోడ్డు ప్రమాదాలు, ఫోర్జరీ మోసాలు పెరిగాయ్
- నేరాలు, ఘోరాలు గతంతో పోలిస్తే పెరిగినట్లు నివేదిక

హైదరాబాద్‌ : తెలంగాణలో క్రైమ్ రికార్డ్ గణనీయంగా పెరిగింది. హత్యలు, అత్యాచారాలు మాత్రమే కాదు. రోడ్డు ప్రమాదాలు, ఫోర్జరీ మోసాలు సైతం పెద్ద మొత్తంలో పెరిగినట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో తన నివేదికలో వెల్లడించింది. రాష్ట్రంలో నేరాలు, ఘోరాలు గతంతో పోలిస్తే పెరిగినట్లు బ్యూరో నివేదిక స్పష్టం చేసింది. దేశంలోని 16 ప్రధాన నగరాలతో పోలిస్తే రాష్ట్ర రాజధాని హైదరాబాద్లో ఫోర్జరీ, ఛీటింగ్ కేసులు ఎక్కువ సంఖ్యలో నమోదు అయ్యాయి. హైదరాబాద్ లో ఫోర్జరీ, ఛీటింగ్ కేసులు 4,090 నమోదు కాగా, సుమారు 4,203 మంది బాధితులు ఈ కేసుల్లో మోసపోయినట్లు ఎఫ్ఐఆర్ లు తెలుపుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 2021-23లో 1,83,644 క్రిమినల్ కేసులు నమోదైనట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఈ మేరకు దేశవ్యాప్తంగా జరిగిన నేరాల వార్షిక నివేదిక వివరాలను నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో తన 71వ ఎడిషన్ లో వెల్లడించింది. దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న నేరాల వివరాలను ఎన్సీఆర్బీ తన అధికారిక వెబ్సైట్ . లో అందుబాటులో ఉంచింది.

**రోడ్డు ప్రమాదాలూ పెరిగాయి** కేవలం నేరాలు మాత్రమే కాక 2023లో రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు కూడా గణనీయంగా పెరిగాయి. రాష్ట్రంలో అత్యధికంగా 7,760 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా వాటిలో అత్యధికంగా 88.7శాతం మంది అతివేగంతోనే చనిపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి లక్షమందిలో 35మంది కంటే ఎక్కువ మంది ప్రమాదాల్లో చనిపోయినట్లు రికార్డులు చెబుతున్నాయి. 2022లో జరిగిన ప్రమాదాలు 7,559లు కాగా 23లో 7,760 ప్రమాదాలతో రోడ్డు ప్రమాద మరణాలు 1.33శాతం పెరిగాయి. దేశవ్యాప్తంగా 4,50,026 ప్రమాదాలు చోటు చేసుకోగా, ఈ ప్రమాదాల్లో రాష్ట్రంలో దాదాపు 5 శాతం రోడ్డు ప్రమాదాలు సంభవించినట్లు నివేదిక వెల్లడించింది.

**మహిళ కేసుల్లో 6 శాతం పెరుగుదల :** 2022 ఏడాదితో పోలిస్తే 2023లో తెలంగాణలో మహిళలపై నేరాలు ఆరు శాతం పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో మహిళలపై 23,679 నేరాలు నమోదయ్యాయి. 2022లో 22,065 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది మరో ఆరు శాతం కేసులు పెరిగాయి. అందులో ఆత్మహత్యకు ప్రేరేపించిన ఘటనలపై అధిక కేసులు నమోదు అయ్యాయి. మూడేళ్ల కాలంలో రాష్ట్రంలో క్రైమ్ రేట్ విపరీతంగా పెరిగినట్లు నివేదిక స్పష్టం చేసింది. 2021%-%23 మధ్యకాలంలో 25వేల కేసులు అత్యధికంగా నమోదయినట్లు తెలుస్తోంది. వాటిలో హింసాత్మక నేరాలు, సైబర్ నేరాలు, ఆర్థిక నేరాల తదితర కేసులు ఉన్నాయి. ఇక అట్రాసిటీ కేసుల విషయంలో కొంత తగ్గుముఖం పట్టాయి. అదే సమయంలో సైబర్ నేరాలు బాగా పెరిగాయి. సుమారు 8వేల సైబర్ కేసులు అధికంగా నమోదయ్యాయి. ఆర్థిక నేరాలకు సంబంధించి ఆరు వేలకు పైగా కేసులు రికార్డయ్యాయి. అట్రాసిటీ కేసులు స్వల్పంగా తగ్గాయి. కానీ వాటిలో షెడ్యూల్ ట్రైబల్ అట్రాసిటీ పెరిగినట్లు నివేదిక తేల్చి చెప్పింది.

### మళ్లీ సమ్మె దిశగా ప్రైవేట్ కళాశాలలు

# 12 వరకు ప్రభుత్వానికి డెడ్‌లైన్

- ప్రభుత్వం ఫీజ్ రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడమే కారణం
- 13 నుంచి సమ్మెకు వెళ్లాలని నిర్ణయం
- విద్యార్థులతో కలిసి ఛలో హైదరాబాద్ చేపడతామని హెచ్చరిక

హైదరాబాద్ : ప్రభుత్వం ఫీజ్ రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల మళ్లీ సమ్మె బాట పట్టనున్నాయి. ఇవాళ అత్యవసర సమావేశం నిర్వహించిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ వైఖరిపై మీడియా సమావేశం ఏర్పాటు చేశాయి.విద్యార్థులతో కలిసి ఛలో హైదరాబాద్ చేపడతాం : ఎఫ్ఏటీహెచ్ఐ ఛైర్మన్ రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి విద్యారంగం ఆఖరి ప్రాధాన్యతగా ఉందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వ విడుదల చేయలేదని, గత నెల 21, 22 తేదీల్లో రూ.600 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చినా బకాయిలు చెల్లించలేదని, రూ.200 కోట్లు నిధులు మాత్రమే విడుదల చేశారని తెలిపారు. దీపావళి పండగలోపు రూ.1,200 కోట్లు ఇస్తామన్నారని, ఎలా ఇస్తారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఈ నెల 12లోపు బకాయిలు చెల్లించకుంటే 13 నుంచి సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. ఇవాళ్టి నుంచి సీఎంవో కార్యాలయంతో తప్ప మరెవరితో చర్చించమని, అవసరం అయితే విద్యార్థులతో కలిసి ఛలో హైదరాబాద్ చేపడతామని ఆయన హెచ్చరించారు.

"తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగం ఆఖరి ప్రాధాన్యతగా ఉంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వ విడుదల చేయలేదు. గత నెల 21, 22 తేదీల్లో రూ.600 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చినా బకాయిలు చెల్లించలేదు. రూ.200 కోట్లు నిధులు మాత్రమే విడుదల చేశారు. దీపావళిలోపు రూ.1,200 కోట్లు ఇస్తామని అన్నారు ఎలా ఇస్తారో చెప్పాలి. ఈ నెల 12లోపు బకాయిలు చెల్లించకుంటే 13 నుంచి సమ్మెకు వెళ్తాం. ఇవాళ్టి నుంచి సీఎంవో కార్యాలయంతో తప్ప మరెవరితో చర్చించం. అవసరం అయితే విద్యార్థులతో కలిసి ఛలో హైదరాబాద్ చేపడతాం." రమేశ్, ఎఫ్ఏటీహెచ్ఐ ఛైర్మన్ చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం కాలేజీ యాజమాన్యాలతో చర్చలు : రాష్ట్ర ప్రభుత్వం కాలేజీలకు విడుదల చేయవలసిన బకాయిల మొత్తం రూ.1,200 కోట్లకు పైగా ఉందని గతంలో ఎఫ్ఏటీహెచ్ఐ పేర్కొంది. బకాయిలు చెల్లించాలని కోరుతూ సెప్టెంబర్ 15 తరగతుల బంద్కు ప్రకటించాయి. ఈ ప్రతిపాదనకు రాష్ట్రంలోని కొన్ని కాలేజీలు మద్దతు పలికాయి. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం, కాలేజీ యాజమాన్యాలతో చర్చలు జరిపింది.

ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటన : ఆ సమయంలో తెలంగాణలోని




వృత్తి విద్యా కళాశాలల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. దీపావళిలోగా రూ.1200 కోట్ల బకాయిలు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఫీజురీయింబర్స్‌మెంట్ అంశంపై మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులతో జరిపిన చర్చలు విజయవంతమైనట్లు అప్పుడు ప్రకటించాయి. చర్చలు సఫలం కావడంతో తరగతుల బంద్‌ను ఉపసంహరించుకున్నట్లు వృత్తి విద్యా కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి. కానీ బకాయిలు పూర్తిగా రాకపోవడంతో మళ్లీ యాజమాన్యాలు ఆందోళనకు సిద్ధమయ్యాయి.

## జూబ్లీహిల్స్ అభ్యర్థిపై కాంగ్రెస్ ఫోకస్

- ఎంపికలో చోటు చేసుకుంటున్న బిగ్ ట్విస్ట్‌లు
- సీఎం రేవంత్‌తో పీసీసీ చీఫ్ కీలక భేటీతో సర్వత్రా ఆసక్తి
- అభ్యర్థుల పేర్లను సూచిస్తూ నివేదిక ఇవ్వాలని మంత్రులకు పురమాయింపు



హైదరాబాద్‌: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థి ఖరారుపై కాంగ్రెస్ పార్టీ ఫోకస్ పెట్టింది. మరో వారంలోగా అభ్యర్థిని ప్రకటించాలన్న లక్ష్యంతో కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నేడు సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. అభ్యర్థి ఎంపికపై చర్చించారు.ఇన్చార్జులుగా ఉన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి తదితరులతో చర్చించి నివేదిక ఇవ్వాలని పీసీసీ చీఫ్ కు రేవంత్ సూచించినట్లు తెలుస్తోంది. నివేదికలో అభ్యర్థుల పేర్లు, వారి బలాబలాలతో కూడిన పూర్తి వివరాలు ఉండాలని చెప్పినట్లు తెలుస్తోంది. గెలుపే లక్ష్యంగా అభ్యర్థిని ఖరారు చేయాలని స్పష్టం చేసినట్లు సమాచారం. అయితే బీసీ అభ్యర్థిని ఎంపిక చేయాలని సీఎం రేవంత్ తో పాటు హైకమాండ్ ఆలోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లను పెంచడంతో ఇప్పటికే కాంగ్రెస్ సక్సెస్ అయ్యిందని.. ఇప్పుడు జూబ్లీహిల్స్ లో కూడా బీసీ అభ్యర్థి ని బరిలోకి దించితే కలిసి వస్తుందని పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. జూబ్లీహిల్స్ టికెట్ రేసులో ప్రధానంగా మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, నవీన్ యాదవ్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఉన్నారు. మాజీ మంత్రి కంజర్ల లక్ష్మీనారాయణ కోడలు అయిన కంజర్ల విజయలక్ష్మి కూడా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. తమ కుటుంబానికి ఉన్న మంచి పేరు, తాను నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు కలిసి వస్తున్నాయని చెబుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ మహిళా అభ్యర్థికి టికెట్ ఇవ్వడంతో.. కాంగ్రెస్ కూడా మహిళా అభ్యర్థికే అవకాశం ఇవ్వాలని ఆమె కోరుతున్నారు.

మరో వైపు.. టికెట్ తనకు గ్యారెంటీ అని అంజన్ కుమార్ యాదవ్ ధీమాగా ఉన్నారు. ఈ ప్రాంతం నుంచి ఎంపీగా పదేళ్ల పాటు పని చేసిన అనుభవం, తాను చేసిన అభివృద్ధి పనులను పరిశీలించి హైకమాండ్ తన పేరును ఫైనల్ చేస్తుందని ఆయన చెబుతున్నారు. హైదరాబాద్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగానూ పని చేసిన తనకు కేడర్ తో మంచి సంబంధాలు ఉన్నాయని అంటున్నారు. కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అయితే.. ఇప్పటికే ప్రచారం కూడా ప్రారంభించారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇప్పటికే కార్పొరేటర్ గా ప్రజలతో ఉన్న తనకు అవకాశం ఇస్తే గెలుపు గ్యారెంటీ అని అయన చెబుతున్నారు. అయితే.. ఓసీ కావడం ఆయనకు మైనస్ గా మారింది. దీంతో నవీన్ యాదవ్, అంజన్ కుమార్ యాదవ్ మధ్యనే పోటీ ప్రధానంగా ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

# రేవంత్ సర్కారులో డీఏ అంటే.. డోంట్ ఆస్క్

- ఐదు డీఏలను పెండింగ్‌లో పెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే
- నెలకు రూ. 750 కోట్ల ఏరియల్స్ క్లియర్ చేస్తామన్న హామీ ఏమైంది
- మాజీ మంత్రి బిఆర్ఎస్ నేత హరీష్ రావు విసుర్లు



సిద్దిపేట: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంచి తీపి కబురు చెబితే.. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉద్యోగులకు దసరాకు చేదు నింపిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. కావాలనే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల్ని చిన్నచూపు చూస్తుందని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువ డీఏ ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు ఓల్డ్ డీఏ ఇస్తామన్నారు.. ఆరు నెలల్లోగా పీఆర్సీ ఇస్తామన్నారన్నారు. ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు.

అధికారంలోకి రాగానే ఓల్డ్ పెన్షన్ స్కీమ్..

ఐదు డీఏలను పెండింగ్‌లో పెట్టిన ఘనత దేశంలో ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని హరీష్ రావు ఎద్దేవా చేశారు. నెలకు రూ. 750 కోట్ల ఏరియల్స్ క్లియర్ చేస్తామని చెప్పిన మాటలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. పోలీసులకు రావాల్సిన అలవెన్స్ కూడా రావడం లేదని, కనీసం పెట్రోల్ అలవెన్స్ ఇవ్వడం లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో పోలీసులకు కొత్త వెహికల్స్ ఇచ్చారని గుర్తు చేశారు. రూ. 12 వేల హోం గార్డ్స్ జీతాన్ని రూ.29 వేలకు కేసీఆర్ పెంచితే, సీఎం రేవంత్ 75 రూపాయలు పెంచారని విమర్శించారు. పోలీసుల సరెండర్ లీవ్స్ బడ్జెట్ కూడా రావడం లేదని పేర్కొన్నారు. ఇప్పుడున్న సీపీఎస్ స్థానంలో తాము అధికారంలోకి రాగానే ఓల్డ్ పెన్షన్ స్కీమ్ తెస్తామని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు.

రేవంత్ రెడ్డి మోసం చేయని వర్గం లేదు..

రెండేళ్లు గడించింది ఎక్కడ ఓపీఎస్ అని హరీష్ రావు నిలదీశారు. ఉద్యోగుల జీతాలు నుంచి రూ.5500 కోట్లు కాంట్రిబ్యూషన్ పెన్షన్ డబ్బులు దారి మళ్లించారని ఆరోపించారు. రాష్ట్రంలో లక్షపైగా ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలలుగా జీతాలు రావడం లేదని తెలిపారు. చివరికి రేషన్ డీలర్లు కూడా 3వ తేదీ నుంచి బంద్ చేస్తామంటున్నారని పేర్కొన్నారు. ఆరోగ్య శ్రీ రావడం లేదని బంద్ పెడతామన్నారు డాక్టర్లు. సీఎం రేవంత్ రెడ్డి మోసం చేయని వర్గం లేదు రాష్ట్రంలో అని మండిపడ్డారు. కమిషన్లు మాత్రం దంచి వసూల్ చేసుకుంటున్నారని ఆరోపించారు. కమిషన్ల వసూళ్లలో రిబేట్ లేదు, కాన్సిషన్ ఏ మాత్రం లేదని వ్యాఖ్యానించారు.

డీఏ అంటే డోంట్ ఆస్క్ అన్నట్టుగా మారింది..

ఉద్యోగ సంఘాల నాయకులను ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని హరీష్ రావు చెప్పుకొచ్చారు. అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ ప్రభుత్వానికి పోయే కాలం దగ్గర పడ్డదన్నారు. డీఏ అంటే డియర్నెస్ అలవెన్స్.. కానీ రేవంత్ సర్కారులో డోంట్ ఆస్క్ అన్నట్టుగా మారిందని పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను ఐదు డీఏలను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్ పీఆర్సీలను ప్రకటించాలన్నారు. సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ తీసుకురావాలని హరీష్ రావు పేర్కొన్నారు.

'ఉద్యోగులకు హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలి. కేంద్రం గోధుమల మద్దతు ధర పెంచింది. కేంద్రం దక్షిణ భారతదేశం పట్ల వివక్ష చూపుతుంది. గోధుమల మద్దతు ధర రూ.165 పెంచి రూ.2585గా నిర్ణయించారు. వరికి రూ.69 పెంచి రూ.2369 మద్దతు ధర చేశారు. ఉత్తర భారత దేశ రైతుకో నీతి, దక్షిణ దేశ రైతులకు మరో నీతా. గోధుమలకు సమానంగా వరి మద్దతు ధర పెంచాలి. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా రాష్ట్రానికి అన్యాయం జరుగుతోంది. దేశంలో అత్యధికంగా వరి పంట సాగు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ. బీజేపీ ప్రభుత్వ పక్షపాత వైఖరితో వ్యవహరిస్తుంది' అని హరీష్ రావు ధ్వజమెత్తారు.

## జూబ్లీహిల్స్ ఓటర్ల తుదిజాబితా విడుదల

### మొత్తం ఓటర్ల సంఖ్య 3,98,982



హైదరాబాద్ : మాగంటి గోపినాథ్ మృతితో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలో నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించింది. మొత్తం ఓటర్ల సంఖ్య 3,98,982 మందిగా ఎన్నికల సంఘం పేర్కొంది. సెప్టెంబరు 17 రాత్రి వరకు కొత్తగా ఓటు నమోదుకు 6,563 దరఖాస్తులు, తొలగింపు కోసం 361, సవరణ కోసం 2,298 దరఖాస్తులు వచ్చినట్లు ఈసీ తెలిపింది.సవరించిన జాబితా ప్రకారం 2,07,367 మంది పురుషులు, 1,91,590 మంది మహిళలు, 25 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నట్లు పేర్కొంది. నియోజకవర్గంలో లింగ నిష్పత్తి ప్రతి వెయ్యిమంది పురుషులకు 924 మహిళలుగా ఉన్నారని పేర్కొంది. ఓటర్లలో1891 మంది దివ్యాంగులు, 95 మంది విదేశీయులు ఉన్నారు. సెప్టెంబరు 2న విడుదలైన ప్రాథమిక జాబితా ప్రకారం 3,92,669 ఓటర్లు ఉన్నారు. సవరణల అనంతరం 6,976 మంది ఓటర్లను కొత్తగా చేర్చారు. 663 మందిని తుది జాబితా నుంచి తొలగించారు. కొత్తగా చేరిన వారిలో పురుషులు 3,415, మహిళలు 3,561 ఉన్నారు. తొలగించిన ఓట్లలో పురుషులు 336 మంది, మహిళలు 327 మంది ఉన్నారు. నియోజకవర్గంలో ఉప ఎన్నిక నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేశామని, 139 కేంద్రాల్లో 407 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. బీఓల్ఓలు 407 మంది, సూపర్‌వైజర్లు 38 మందిని ఇప్పటికే నియమించినట్లు అధికారులు తెలిపారు.

# బ్యారేజీల రిపేరు షురూ



- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు రిపేర్లు
- పునరుద్ధరణ కోసం టెండర్లు పిలిచిన ప్రభుత్వం
- 15 వరకు వరకు గడువు విధింపు
- అంతర్జాతీయ సంస్థల నుంచి డిజైన్ల తయారీ కోరిన ఈవోఐ

హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు రిపేర్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటి పునరుద్ధరణ డిజైన్ల కోసం ప్రభుత్వం టెండర్లు పిలిచింది. దీనికోసం ఈ నెల 15 వరకు గడువు విధించింది. డిజైన్ల తయారీకి అంతర్జాతీయ సంస్థల నుంచి ఈవోఐ కోరింది. కాగా బ్యారేజీలను మరమ్మతు చేయాలని జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ(ఎన్‌డీఎస్ఏ) తన రిపోర్టులో పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ నివేదిక ఆధారంగా పనులు మొదలు పెట్టాలని ప్రభుత్వం సంకల్పించింది. వరదల తర్వాత భూభౌతిక పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. డిజైన్ కన్సల్టెంట్ ఎంపిక ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. అదే సమయంలో తుమ్మిడిహట్టి వద్ద కూడా బ్యారేజీ నిర్మిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు అవసరమైన కొత్త డిజైన్లను రూపొందించేందుకు అంతర్జాతీయ స్థాయి సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) కోరుతూ ప్రభుత్వం నిన్న జాతీయ స్థాయిలో నోటిఫికేషన్ విడుదల చేసింది. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు ఈవోఐ పిలవాలని నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా గత నెల 19న ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తర్వాత కేవలం రెండు వారాల్లోగా డిజైన్ కన్సల్టెంట్‌ను ఎంపిక చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించడంతో ఈ ప్రక్రియ మరింత వేగం పుంజుకుంది.

జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ఏ) సిఫార్సుల మేరకు ఈ పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు. దీని ప్రకారం, వానాకాలానికి ముందు, ఆ తర్వాత బ్యారేజీల వద్ద భూభౌతిక, భూసాంకేతిక పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికే వర్షా కాలానికి ముందు చేపట్టాల్సిన పరీక్షలను అధికారులు పూర్తి చేశారు.అయితే, ప్రస్తుతం వరదల కారణంగా వర్షా కాలం తర్వాత చేయాల్సిన పరీక్షలకు ఆటంకం ఏర్పడింది. ముఖ్యంగా మేడిగడ్డ బ్యారేజీకి డిసెంబర్ లేదా జనవరి వరకు, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు నవంబర్ వరకు వరద ప్రవాహం కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, సమయం వృథా కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రణాళికతో ముందుకెళ్తోంది. టెక్నికల్, ఫైనాన్షియల్ బిడ్ల ప్రక్రియ పూర్తయ్యేలోగా మిగిలిన పరీక్షలను పూర్తి చేయాలని భావిస్తోంది. తద్వారా అర్హత సాధించిన సంస్థలను సైతం ఈ పరీక్షల ప్రక్రియలో భాగస్వాములను చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం.

# రోజుకు 2.25 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి రవాణా చేయాలి



- 14 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించాలి
- కంపెనీ విస్తరణ ప్రణాళికలపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలి
- పని సంస్కృతి మెరుగు పరిచేందుకు అందరూ కృషి చేయాలి
- ఏరియా జీఎంలకు సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశం

హైద్రాబాద్ బ్యూరో ప్రతినిధి: సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడానికి రోజుకు 2.25 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ శ్రీ ఎన్.బలరామ్ ఆదేశించారు. రోజుకు 14 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించాలన్నారు. బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన అన్ని ఏరియాల జీఎంలతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.

గత మూడు నెలలుగా కురిసిన భారీ వర్షాల వల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరు నెల కాలంలో 91 శాతం ఉత్పత్తి లక్ష్యాలను, 93 శాతం రవాణా లక్ష్యాలను మాత్రమే సాధించామని, మిగిలిన ఆరు నెలల్లో ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాల వల్ల కలిగిన నష్టాలను భర్తీ చేసుకోవడానికి వీలుగా ఇకపై ఉత్పత్తి లక్ష్యాలను పెంచినట్లు వెల్లడించారు. అలాగే గత రెండు నెలల కాలంలో సింగరేణి సంస్థ మనుగడకు, ఉజ్వల భవిష్యత్ కు దోహదపడే పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. ముఖ్యంగా కీలక ఖనిజాల అన్వేషణ రంగంలోనూ కంపెనీ అడుగు పెట్టిందని గుర్తుచేశారు. బొగ్గు బ్లాక్ల, ఇతర ఖనిజాల వేలంలోనూ పాల్గొనేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని పేర్కొన్నారు.

అదే సమయంలో సింగరేణి అంతర్జాతీయ కార్యాలయం నిర్మాణం కోసం ఫ్యూచర్ సిటీలో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. సింగరేణి బహుముఖ విస్తరణకు వెళ్తున్న నేపథ్యంలో ఉద్యోగులందరికీ కంపెనీ ఆర్థిక స్థితిగతులు, విస్తరణ ప్రణాళికలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు.

ప్రతీ ఒక్క ఉద్యోగిలోనూ పని సంస్కృతిని మరింత మెరుగుపరిచేందుకు ప్రతీ ఒక్కరూ ప్రయత్నించాలని, కంపెనీ మనుగడ కోసం ప్రతీ ఉద్యోగి ప్రతీ షిఫ్ట్ లో 8 గంటలు పనిచేయాలన్నారు. సింగరేణి అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి వీలుగా మానవ వనరుల సమర్థ వినియోగం అత్యవసరం అన్నారు.

రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయాలని స్పష్టం చేశారు. ఉత్పత్తి, ఉత్పాదకత పెంచినప్పుడే బొగ్గు రంగంలో మన మనుగడ ఉంటుందని స్పష్టం చేశారు. ఇకపై ఏరియాల వారీగానూ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమావేశంలో డైరెక్టర్లు శ్రీ ఎల్వీ సూర్యనారాయణ, శ్రీ కె.వెంకటేశ్వర్లు, శ్రీ గౌతమ్ పొట్రు, శ్రీ తిరుమల రావు, హైదరాబాద్ నుంచి ఈడీ కోల్ మూమెంట్ శ్రీ బి.వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్, మార్కెటింగ్) శ్రీ టి.శ్రీనివాస్ పాల్గొనగా.. అన్ని ఏరియాల జీఎంలు, కార్పోరేట్ జీఎంలు హాజరయ్యారు.

### ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై

## రెండో రోజు సుదీర్ఘ విచారణ




హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ రెండో రోజు ముగిసింది. బుధవారం ఉదయం ప్రారంభమైన విచారణ రాత్రి 7గంటల వరకు కొనసాగింది. ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, కాలే యాదయ్యను పిటిషనర్ల తరపు న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి చేశారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలకు సంబంధించి సుదీర్ఘ విచారణ కొనసాగడంతో.. మరో ఇద్దరు ఎమ్మెల్యేల విచారణ దసరా తర్వాత చేపట్టాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయించారు. ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిలను ఈ నెల 4న పిటిషనర్ల తరపు న్యాయవాదులు క్రాస్ ఎగ్జామిన్ చేయనున్నారు.

## భారత్ మేలుకో!

భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా, ఒక అగ్రగామి శక్తిగా ఎదగాలంటే, 'ఆత్మనిర్భర భారత్' (స్వయం సమృద్ధి) అనే లక్ష్యాన్ని కేవలం ఒక నినాదంగా కాకుండా, ప్రతి రంగానికి వర్తించే జాతీయ విధానంగా అమలు చేయాలి. కొన్ని కీలకమైన రక్షణ, సాంకేతిక మరియు ఆర్థిక అంశాలలో విదేశాలపై ఆధారపడటం వలన, మన దేశ సార్వభౌమాధికారం మరియు ఆర్థిక స్థిరత్వం ప్రమాదంలో పడుతున్నాయి. ముఖ్యంగా, ఆధునిక సాంకేతిక ప్రపంచంలో, అరుదైన భూ ఖనిజాలు లేకుండా ఏదీ ముందుకు సాగదు. స్మార్ట్‌ఫోన్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల మోటార్లు, అత్యాధునిక ఫైటర్ జెట్‌లు వంటి అత్యంత కీలకమైన ఉత్పత్తులలో ఈ ఖనిజాలు తప్పనిసరి. ప్రస్తుతం, వీటి సరఫరా మరియు శుద్ధిలో చైనా ప్రపంచంలోనే ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది. ఈ కీలక ఖనిజాల కోసం మనం ఒకే దేశంపై అతిగా ఆధారపడటం వలన, భవిష్యత్తులో రాజకీయ ఉద్రిక్తతలు తలెత్తి, సరఫరా నిలిచిపోతే, మన హైటెక్ తయారీ పరిశ్రమ తీవ్రంగా నష్టపోతుంది. అందుకే, దేశంలో ఉన్న ఈ ఖనిజ నిల్వలను గుర్తించి, వాటిని వెలికితీసే మరియు శుద్ధి చేసే సాంకేతికతలో భారీగా పెట్టుబడులు పెట్టడం తక్షణావసరం.
సాంకేతికతకు సంబంధించి గుండెకాయ లాంటి సెమీకండక్టర్లు మరియు ఇతర హార్డ్‌వేర్ కాంపోనెంట్ల విషయంలో స్వయం సమృద్ధి సాధించడం అనేది భారతదేశానికి వ్యూహాత్మక అవసరం. కరోనా మహమ్మారి సమయంలో వచ్చిన ప్రపంచవ్యాప్త చిప్ కొరత వలన మన ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ పరిశ్రమలు ఎంతగా కుంటుపడ్డాయో మనం చూశాం. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం, ప్రపంచంలోని కొద్దిమంది తయారీదారులపై ఆధారపడటాన్ని తగ్గించి, మన దేశంలోనే చిప్ తయారీ కర్మాగారాలను స్థాపించడం. దీని కోసం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలతో పాటు, ప్రపంచ స్థాయి సాంకేతిక భాగస్వామ్యాలను వేగంగా కుదుర్చుకోవాలి. దీనికి అనుబంధంగా, నేటి కృత్రిమ మేధస్సు మరియు క్లౌడ్ కంప్యూటింగ్‌కు ఆయువుపట్టు అయిన గ్రాఫిక్ ప్రాసెసర్ యూనిట్లు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. విదేశీ కంపెనీల జీపీయూలపైనే మన దేశ పరిశోధకులు ఆధారపడితే, భవిష్యత్తు సాంకేతిక ఆధిపత్యం వారి చేతుల్లోనే ఉంటుంది. అందుకే, దేశీయంగా మన ఇంజినీర్లు మరియు స్టార్టప్‌లతో కలిసి సొంతంగా ప్రాసెసర్లు మరియు జీపీయూలను డిజైన్ చేసి, ఉత్పత్తి చేసేలా ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. ఈ తయారీకి అవసరమైన నైపుణ్యం గల మానవ వనరులను కూడా పెద్ద ఎత్తున తయారు చేయాలి.
జాతీయ భద్రతకు సంబంధించిన రంగం రక్షణ. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుధ దిగుమతిదారులలో ఒకటిగా ఉండటం, దేశ సార్వభౌమాధికారానికి పెద్ద సవాలు. యుద్ధం వంటి అత్యవసర పరిస్థితుల్లో, ఆయుధాల సరఫరా చేసే విదేశం ఏదైనా రాజకీయ ఒత్తిడి తెచ్చి, సరఫరాను నిలిపివేస్తే, అది దేశ భద్రతకు పెను ప్రమాదం. అందుకే, యుద్ధ విమానాలు, క్షిపణి వ్యవస్థలు, డ్రోన్‌ల వంటి అత్యంత కీలకమైన రక్షణ పరికరాల తయారీని పూర్తిగా స్వదేశీకరణ చేయాలి. 'మేక్ ఇన్ ఇండియా' పథకం కింద, రక్షణ పరిశోధన మరియు అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించి, ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని పెంచాలి. విదేశాల నుండి కొనుగోలు చేసే ఆయుధాలలో టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ తప్పనిసరి చేయాలి. ఈ విధంగా, దేశీయ రక్షణ పరిశ్రమను బలోపేతం చేయడం ద్వారా, మనం ఒక శక్తివంతమైన మరియు స్వతంత్రమైన దేశంగా నిలబడగలం.
సాంకేతిక సార్వభౌమత్వాన్ని వేగంగా సాధించడానికి, చైనా అనుసరించిన కఠినమైన విధానాలను భారత్ ఒక పాఠ్యాంశంగా తీసుకోవాలి. చైనా తమ దేశంలో గూగుల్, ఫేస్‌బుక్ వంటి అమెరికన్ ఇంటర్నెట్ దిగ్గజాలను పూర్తిగా నిషేధించి, దానికి బదులుగా సొంత దేశీయ వేదికలను (వీచాట్ వంటివి) బలోపేతం చేసింది. ఈ కఠినమైన చర్య ద్వారా చైనా తమ పౌరుల డేటా సార్వభౌమత్వాన్ని నిలుపుకోగలిగింది. అదే విధంగా, భారతదేశం కూడా తమ ప్రభుత్వ వ్యవస్థలు, ఆర్థిక లావాదేవీలు మరియు కీలకమైన కమ్యూనికేషన్ల కోసం విదేశీ సంస్థలపై ఆధారపడటాన్ని మానుకోవాలి. దేశీయంగా అభివృద్ధి చేసిన సొంత ఆపరేటింగ్ సిస్టమ్‌లు మరియు క్లౌడ్ ప్లాట్‌ఫామ్‌లను ప్రోత్సహించాలి. ముఖ్యంగా, పౌరుల వ్యక్తిగత మరియు గోప్యమైన డేటా దేశ సరిహద్దులను దాటకుండా, కఠినమైన డేటా లోకలైజేషన్ చట్టాలను అమలు చేయాలి. అదే సమయంలో, 5జీ వంటి సున్నితమైన టెలికాం నెట్‌వర్క్ హార్డ్‌వేర్‌ను విదేశీ కంపెనీల నుండి కాకుండా, దేశీయ కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు మరియు ప్రభుత్వ కాంట్రాక్టులు ఇవ్వడం ద్వారా, ఈ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలి. ఆర్థిక వ్యవస్థ మరియు సమగ్ర అభివృద్ధి విషయంలో ఆత్మనిర్భరత అనేది ఒక సమ గ్ర విధానం. ఇది కేవలం కొన్ని రంగాలకు పరిమితం కాకుండా, మనం దిగుమతి చేసుకునే ప్రతి చిన్న వస్తువునూ – అది బొమ్మల నుండి భారీ పారిశ్రామిక యంత్రాల వరకు – దేశంలోనే తయారు చేసే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. దీని కోసం, తయారీ రంగానికి నిబంధనలను మరింత సరళీకృతం చేయాలి మరి యు మౌలిక వసతులను వేగంగా ఏర్పాటు చేయాలి. దిగుమతులపై ఆధారపడటం తగ్గితే, మన విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది, ఇది దేశ ఆర్థిక వ్యవస్థను బలపరుస్తుంది. ప్రపంచ ఆర్థిక ఒడిదుడుకుల నుండి మన దేశాన్ని కాపాడు కోవాలంటే, దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగా నిలబడటం చాలా అవసరం. ఈ విధంగా, 'ప్రతిదీ' దేశంలోనే తయారు చేయడానికి కృషి చేయడం ద్వారా, మనం నిరుద్యోగ సమస్యను పరిష్కరించి, సురక్షితమైన మరియు స్థిరమైన దేశంగా ప్రపంచంలో నిలబడగలం.
ఆత్మనిర్భర భారత్ లక్ష్యాన్ని సాధించే క్రమంలో, సాంకేతిక మరియు ఇంధన రంగాలలో భవిష్యత్తు అవసరాలను తీర్చే రెండు కీలక అంశాలపై భారతదేశం తప్పనిసరిగా దృష్టి సారించాలి: ఒకటి క్రిప్టోకరెన్సీ మరియు బ్లాక్‌చెయిన్ సాంకతికత, రెండవది అణు విద్యుత్. క్రిప్టోకరెన్సీ అనేది కేవలం ఒక పెట్టుబడి సాధనంగా మాత్రమే కాకుండా, మొత్తం ఆర్థిక లావాదేవీల వ్యవస్థను మార్చే శక్తివంతమైన బ్లాక్‌చెయిన్ టెక్నాలజీగా చూడాలి. ఈ టెక్నాలజీ ప్రభుత్వ సేవల్లో పారదర్శకతను పెంచడానికి, భూముల రికార్డులు, ఆరోగ్య సమాచారం, ఎన్నికల నిర్వహణ వంటి సున్నితమైన డేటాను సురక్షితంగా ఉంచడానికి ఉపయోగపడుతుంది. చైనా వంటి దేశాలు సొంతంగా 'సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ'ని అభివృద్ధి చేస్తున్నాయి. అదే తరహాలో, భారతదేశం కూడా రిజర్వ్ బ్యాంక్ ద్వారా డిజిటల్ రూపీని వేగంగా అమలు చేయడంతో పాటు, ఈ బ్లాక్‌చెయిన్ సాంకేతికతను ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలలో మరింత లోతుగా ఉపయోగించడానికి జాతీయ స్థాయి వ్యూహాన్ని రూపొందించాలి. దీని వలన ఆర్థిక లావాదేవీలు మరింత వేగవంతం అవ్వడమే కాక, సాంకేతిక సార్వభౌమాధికారం కూడా పటిష్టమవుతుంది. అయితే, ఈ రంగంలో నియంత్రణ, భద్రత, మరియు చట్టపరమైన అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉండటం అత్యంత ముఖ్యం.
భారతదేశం యొక్క పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థకు, పరిశ్రమలకు మరియు జనాభాకు నిరంతరాయంగా స్థిరమైన విద్యుత్ సరఫరా అవసరం. బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలు పర్యావరణ కాలుష్యాన్ని పెంచడమే కాకుండా, శిలాజ ఇంధనాలపై ఆధారపడటం వలన అంతర్జాతీయ ధరల ఒడిదొడుకులకు లోనవుతాయి. అణు విద్యుత్ అనేది కార్బన్ ఉద్గారాలు లేని, పెద్ద మొత్తంలో మరియు స్థిరంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే శుద్ధ ఇంధన వనరు. ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాలంటే, అణు విద్యుత్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉంది. దేశీయంగా తయారైన టెక్నాలజీ మరియు తోరియం ఆధారిత రియాక్టర్ల అభివృద్ధిపై మన పరిశోధనలను ముమ్మరం చేయాలి. తోరియం నిల్వలు భారతదేశంలో పుష్కలంగా ఉన్నాయి, కాబట్టి ఈ టెక్నాలజీ విజయవంతమైతే, ఇంధనం కోసం మనం పూర్తిగా విదేశాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ఇది మన 'ఇంధన భద్రత'కు తిరుగులేని బలాన్ని ఇస్తుంది. అణు విద్యుత్ కేంద్రాల స్థాపనకు ప్రజల అంగీకారం, భద్రతా ప్రమాణాలు మరియు వ్యర్థాల నిర్వహణపై మరింత పారదర్శకంగా వ్యవహరిస్తూ, ఈ రంగాన్ని వేగంగా అభివృద్ధి చేయాలి. భారతదేశం నిజంగా 'ఆత్మనిర్భర భారత్' లక్ష్యాన్ని సాధించాలంటే, అది కేవలం కొన్ని ఉత్పత్తుల తయారీతో ముగిసేది కాదుబీ అది ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత, సాంకేతికత మరియు ఇంధన రంగాలకు సంబంధించిన ఒక సమగ్ర జాతీయ విధానంగా అమలు కావాలి. అరుదైన ఖనిజాల సరఫరా కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడం, సెమీకండక్టర్లు మరియు జీపీయూల వంటి కీలక సాంకేతిక హార్డ్‌వేర్‌ను దేశంలోనే తయారు చేయడం, మరియు రక్షణ రంగంలో దిగుమతులను పూర్తిగా నిలిపివేయడం వంటి చర్యలు అత్యంత అవసరం. ముఖ్యంగా, చైనా తరహాలో బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని మరియు సొంత డిజిటల్ కరెన్సీని వేగంగా స్వీకరించడం ద్వారా సాంకేతిక సార్వభౌమాధికారాన్ని పటిష్టం చేసుకోవాలి. అంతేకాక, పెరుగుతున్న ఇంధన అవసరాల కోసం బొగ్గుపై ఆధారపడటాన్ని తగ్గించి, తోరియం ఆధారిత అణు విద్యుత్ వంటి స్థిరమైన, కాలుష్యరహిత ఇంధన వనరులను బలోపేతం చేయాలి. మొత్తంమీద, ఈ బహుముఖ వ్యూహం ద్వారా మాత్రమే, భారతదేశం అంతర్జాతీయ మార్కెట్‌లోని ఒడిదుడుకులను తట్టుకొని, భద్రత, సాంకేతికత మరియు ఆర్థిక రంగాలలో ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా, స్థిరమైన మరియు శక్తివంతమైన ప్రపంచ శక్తిగా ఉద్భవించగలదు.

# మైక్రో సాఫ్ట్, గూగుల్‌లతో 'ఢీ' కొడుతున్న జోహో!

- సిలికాన్ వ్యాలీ స్థాయి ప్రమాణాలను అందుకున్న చెన్నై సంస్థ
- సాధారణ ప్రారంభం నుండి ప్రపంచవ్యాప్త శక్తిగా ఎదిగిన భారతీయ కల
- సమస్యల పరిష్కరించడానికి ఉపయోగపడే టూల్స్ అభివృ దీని లక్ష్యం
- మార్కెట్లో వచ్చిన మార్పులు, ఇంటర్నెట్ - క్లౌడ్ టెక్నాలజీల ఆవిర్భావం
- జోహో నియామక ప్రక్రియ లో సాధారణ చదువరులే ప్రత్యేకం




**తేజస్విని**
**హైదరాబాద్**

సాఫ్ట్వేర్ ప్రపంచంలో గ్లోబల్ దిగ్గజాలను ఢీకొట్టి, విజయం సాధించిన భారతీయ కంపెనీలలో 'జోహో' పేరు ముందుంటుంది. చెన్నై కేంద్రంగా పనిచేస్తూ, సిలికాన్ వ్యాలీ స్థాయి ప్రమాణాలను అందుకున్న ఈ సంస్థ వెనుక, దూరదృష్టి గల శ్రీధర్ వేంబు గారు మరియు ఆయన బృందం యొక్క అచంచలమైన పట్టుదల దాగి ఉంది. ఈ ప్రయాణం కేవలం సాంకేతిక ఆవిష్కరణకు సంబంధించినది కాదుబీ ఇది ఒక సాధారణ ప్రారంభం నుండి ప్రపంచవ్యాప్త శక్తిగా ఎదిగిన భారతీయ కల యొక్క నిదర్శనం. జోహో కంపెనీ ప్రయాణం 1996వ సంవత్సరంలో 'అడ్వెంట్నెట్' అనే పేరుతో మొదలైంది. ప్రారంభంలో కంపెనీ ప్రధానంగా 'నెట్వర్క్ మేనేజ్మెంట్ సాఫ్ట్వేర్'పైన దృష్టి సారించింది. అంటే, పెద్ద పెద్ద కంపెనీలలోని కంప్యూటర్ నెట్వర్క్లను పర్యవేక్షించడం, నిర్వహించడం మరియు సమస్యలు వస్తే పరిష్కరించడానికి ఉపయోగపడే టూల్స్ను అభివృద్ధి చేయడం దీని ముఖ్య లక్ష్యం. ఈ ప్రయాణాన్ని మొదలుపెట్టిన ప్రధాన వ్యక్తి శ్రీధర్ వేంబు గారు, మరియు ఆయన సోదరులు(శేఖర్ వెంబు ,కుమార్ వెంబు ), టోనీ వంటి కొందరు సన్నిహిత మిత్రులు ఈ ప్రారంభ ప్రయత్నంలో కీలక భాగస్వాములుగా నిలిచారు. కంపెనీకి ఒక బలమైన పునాదిని నిర్మించడంలో, ఒకరికొకరు తోడుగా నిలబడడంలో ఈ కోర్ టీమ్ పాత్ర చాలా గొప్పది.
సాధారణంగా ఒక కంపెనీ వ్యవస్థాపకుడిని మొదట్లోనే సీఈఓ లేదా ప్రెసిడెంట్గా చూస్తాం. కానీ శ్రీధర్ వేంబు గారి కథ భిన్నంగా మొదలైంది. ఆయన ప్రారంభంలో అడ్వెంట్నెట్కు కేవలం సేల్స్ మేనేజర్గా పనిచేశారు. ఈ నిర్ణయం ద్వారా ఆయన క్షేత్ర స్థాయి అనుభవం పొందగలిగారు. స్వయంగా కస్టమర్లతో మాట్లాడటం, వారి అవసరాలను అర్థం చేసుకోవడం మరియు మార్కెట్ను తెలుసుకోవడం ద్వారా కంపెనీ ఉత్పత్తులు ఎలా ఉండాలో ఆయనకు స్పష్టత వచ్చింది. అదేవిధంగా, ఏ ఉత్పత్తిని ఎక్కడ, ఎలా అమ్మాలో నేర్చుకోవడమే కాక, పోటీ ప్రపంచంలో తమ స్థానం ఏమిటో అర్థం చేసుకునే వ్యాపార వ్యూహాన్ని కూడా ఆయన పెంపొందించుకున్నారు.
మార్కెట్లో వచ్చిన మార్పులు, ఇంటర్నెట్ మరియు క్లౌడ్ టెక్నాలజీల ( ఆవిర్భావంతో శ్రీధర్ వేంబు గారు కంపెనీ దృష్టిని మార్చాలని నిర్ణయించు కున్నారు. నెట్వర్క్ మేనేజ్మెంట్ నుండి పూర్తి స్థాయి బిజినెస్ అప్లికేషన్ సాఫ్ట్వేర్ వైపుకు మళ్లించారు. ఈ వ్యూహాత్మక మార్పు కారణంగానే అడ్వెంట్నెట్ క్రమంగా జోహోగా మారింది. ఈ మలుపు తీసుకున్న తరువాత, ఆయన కంపెనీని నడిపిం చేందుకు ముఖ్య కార్యనిర్వహణాధికారి బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుండి, ఆయన దూరదృష్టితో కంపెనీ వేలాది మందికి ఉద్యోగాలు ఇస్తూ, ప్రపంచవ్యాప్తం గా లక్షలాది మంది వినియోగదారులను సంపాదించుకుంది.
జోహో కేవలం అదృష్టం ద్వారా విజయవంతం కాలేదుబీ అది సరైన సమయంలో, సరైన నిర్ణయాలు తీసుకుని, తమదైన ప్రత్యేక మార్గాన్ని ఎంచుకుంది. వారి ప్రయాణంలో అత్యంత ముఖ్యమైన మూడు వ్యూహాలు వారి విజయాన్ని పటిష్టం చేశాయి. 1990ల చివర్లో, ఇంటర్నెట్ కంపెనీలలో భారీగా పెట్టుబడులు వచ్చి, 2000వ సంవత్సరం నాటికి పగిలిపోయిన డాట్–కామ్ బబుల్ సంక్షోభ సమయంలో కూడా జోహో బలంగా నిలబడగలిగింది. దీనికి కారణం, కంపెనీ తమ ఉత్పత్తులను మొదటి నుంచీ కేవలం పెట్టుబడులపై ఆధారపడకుండా, లాభదాయకత ఆధారంగా నిర్మించింది. అడ్వెంట్నెట్ అప్పటికే తమ నెట్వర్క్ మేనేజ్మెంట్ సాఫ్ట్వేర్ ద్వారా నిజమైన ఆదాయాన్ని సంపాదిస్తోంది. ఇతర కంపెనీలు భారీగా ఖర్చు చేసి, విస్తరించడానికి ప్రయత్నిస్తుండగా, జోహో జాగ్రత్తగా, తమ ఆదాయం పెరిగినప్పుడే ఖర్చు పెడుతూ ముందుకు సాగింది. ఈ ఆర్థిక క్రమశిక్షణ కారణంగా, బబుల్ పతనం అయినప్పుడు కూడా, కంపెనీ ఆర్థికంగా పటిష్టంగా ఉండగలిగింది, ఉద్యోగులను తీసివేయాల్సిన పరిస్థితి రాలేదు.
జోహో విజయానికి అతి ముఖ్యమైన మరొక కారణం వారి బూట్స్ట్రాపింగ్ విధానం. అంటే, కంపెనీ బయటి వెంచర్ క్యాపిటల్ లేదా పెట్టుబడిదారుల డబ్బును తీసుకోకుండా, తమ సొంత ఆదాయంతోనే ఎదగడం. ఈ విధానం వల్ల శ్రీధర్ వేంబు గారు తమ స్వాతంత్రాన్ని కాపాడుకున్నారు, తద్వారా త్వరగా ఫలితాలు చూపాలని పెట్టుబడిదారులు ఒత్తిడి చేయకుండా, తమ సొంత దూరదృష్టికి అనుగుణంగా దీర్ఘకాలిక ప్రణాళికలతో కంపెనీని నడపగలిగారు. పెట్టుబడిదారుల కోసం కాకుండా, కేవలం వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంపైనే దృష్టి పెట్టడం వలన, ఉత్పత్తి నాణ్యత మరియు విశ్వసనీయత పెరిగి, కంపెనీ స్థిరంగా వృద్ధి చెందింది.
జోహో నియామక ప్రక్రియ కూడా చాలా ప్రత్యేకంగా ఉంటుంది. వారు సాంప్రదాయ డిగ్రీలు ఉన్నవారిని మాత్రమే కాకుండా, ఇంటర్మీడియట్ (12వ తరగతి) పూర్తి చేసిన యువకులను కూడా పెద్ద ఎత్తున నియమించుకుంటారు. దీనికోసం వీరు జోహో స్కూల్ ఆఫ్ లెర్నింగ్ అనే ఒక ప్రత్యేక సంస్థను స్థాపించారు. ఈ విధానం ద్వారా శ్రీధర్ వేంబు గారు డిగ్రీల కంటే నైపుణ్యానికి, ఆలోచనా సామర్థ్యానికి ఎక్కువ విలువ ఇస్తారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులకు అవకాశం లభించింది, అలాగే జోహోకు తక్కువ ఖర్చుతో, కంపెనీ సంస్కృతికి త్వరగా అలవాటుపడే అత్యంత నిబద్ధత గల ఉద్యోగులు దొరికారు. ఈ నియామకాల ద్వారా, టెక్నాలజీ కేవలం నగరాలకే పరిమితం కాకుండా, గ్రామీణ యువతకు కూడా ఉపాధి కల్పించి, వారి జీవితాలను మార్చడానికి జోహో దోహదపడింది.
జోహో విజయానికి మూలస్తంభాలలో ఒకటి, సాంకేతిక మౌలిక సదుపాయాలపై వారికి ఉన్న అపారమైన నియంత్రణ. ఇది వారి బూట్స్ట్రాపింగ్ విధానం నుండే పుట్టింది. ఇతర పెద్ద సాఫ్ట్వేర్ కంపెనీలు తమ క్లౌడ్ సేవలను నిర్వహించడానికి అమెజాన్ క్లౌడ్ ,, మైక్రోసాఫ్ట్ అజూర్ లేదా గూగుల్ క్లౌడ్ వంటి భారీ పబ్లిక్ క్లౌడ్ దిగ్గజాలపై ఆధారపడుతుంటే, జోహో మాత్రం ఆ మార్గాన్ని ఎంచుకోలేదు. ఖర్చులను నియంత్రించడానికి మరియు తమ సాంకేతిక భవిష్యత్తుపై పూర్తి స్వయంప్రతిపత్తి సాధించడానికి, జోహో ప్రపంచవ్యాప్తంగా తమ సొంత డేటా సెంటర్లను నిర్మించింది, నిర్వహిస్తోంది. ఈ కారణంగా, కంపెనీ ఇతరుల సాంకేతిక పరిమితులు, వారి ఖర్చుల పెరుగుదల మరియు నిబంధనల నుండి విముక్తి పొందింది.
తమ సొంత మౌలిక సదుపాయాలు ఉండడం వలన, జోహో తమ వినియోగదారుల డేటా సెక్యూరిటీ విషయంలో అత్యున్నత ప్రమాణాలను పాటించగలుగుతోంది. ఎందుకంటే, హార్డ్వేర్ నుండి సర్వర్ల నిర్వహణ, సాఫ్ట్వేర్ లేయర్ వరకు మొత్తం సాంకేతిక వాతావరణంపై వారికి పూర్తి నియంత్రణ ఉంటుంది. డేటాను నిల్వ చేయడం, ప్రాసెస్ చేయడం మరియు రక్షించడం వంటి ప్రతి దశలోనూ ఇతరులపై ఆధారపడకుండా, తమ సొంత పటిష్టమైన భద్రతా ప్రోటోకాల్స్ను అమలు చేయగలరు. ఈ విధానం వారికి డేటా గోప్యత మరియు భద్రతపై అదనపు హామీని ఇస్తుంది, ఇది వినియోగదారులకు ముఖ్యంగా కార్పొరేట్ సంస్థలకు చాలా అవసరం.
ఈ విషయంలో జోహో మార్కెట్లో ఉన్న మిగతా సంస్థల కంటే స్పష్టంగా భిన్నంగా ఉంటుంది. చాలా మంది పోటీదారులు గ్లోబల్ క్లౌడ్ ప్రొవైడర్లను ఉపయోగించడం వల్ల, వినియోగదారుల డేటా ఎక్కడ నిల్వ చేయబడుతుందో మరియు ఏ చట్టాలకు లోబడి ఉంటుందో అనే విషయంలో కొంత నియంత్రణ కోల్పోతారు. కానీ, జోహో సంస్థాగత నిర్ణయంగా తమ భారతీయ వినియోగదారుల డేటా దేశ సరిహద్దుల వెలుపల ఏ మాత్రం వెళ్లకుండా ఉండాలనే కట్టుబాటుతో ఉంది. అందుకే, జోహో తమ డేటా సెంటర్లలో ప్రధాన భాగాన్ని భారతదేశంలోనే స్థాపించింది మరియు నిర్వహిస్తోంది.
తమిళనాడులోని చెన్నై, మరియు ఇతర టైర్–2, టైర్–3 నగరాలలో ఉన్న ఈ డేటా సెంటర్లు, భారతీయ కస్టమర్ డేటా పూర్తిగా భారతీయ భూభాగంలోనే నిల్వ చేయబడిందని హామీ ఇస్తున్నాయి. దీని ద్వారా, కంపెనీ స్థానిక డేటా సార్వభౌమాదికారం చట్టాలకు మరియు నిబంధనలకు కట్టుబడి ఉంటుంది. ఈ పద్ధతి, ప్రభుత్వ సంస్థలు మరియు ఆర్థిక సంస్థలు వంటి సున్నితమైన డేటాను నిర్వహించే కస్టమర్ల విశ్వాసాన్ని మరింతగా పెంచుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే, జోహో యొక్క ఈ స్వయం–నిర్మిత మౌలిక సదుపాయాల వ్యూహం, వారి బూట్స్ట్రాపింగ్ ఫిలాసఫీకి అనుగుణంగా ఉండడమే కాక, కస్టమర్ డేటా భద్రత మరియు గోప్యతపై వారికి అపూర్వమైన నియంత్రణను అందించి, వారిని ఇతర క్లౌడ్ ఆధారిత సంస్థల నుండి ప్రత్యేకంగా నిలబెట్టింది. జోహో కేవలం విజయవంతమైన సాఫ్ట్వేర్ సంస్థ మాత్రమే కాదుబీ ఇది భారతదేశంలో వ్యాపార నిర్వహణకు మరియు సాంకేతిక అభివృద్ధికి ఒక కొత్త మార్గాన్ని చూపించింది. భారతీయ కంపెనీలు అనుసరించదగిన ఆదర్శవంతమైన నమూనాగా ఇది నిలిచింది. ఇతర స్టార్టప్లు పెట్టుబడుల కోసం సిలికాన్ వ్యాలీ వైపు చూస్తుంటే, జోహో తమ సొంత శక్తిపై, అంటే బూట్స్ట్రాపింగ్ ద్వారా ఎదగడం ద్వారా, స్థిరమైన, నష్టభయం లేని వ్యాపార నమూనాను సృష్టించింది. ఇది విదేశీ మూలధనంపై ఆధారపడకుండా, స్థానిక మేధస్సు మరియు స్వయం సమృద్ధి ద్వారా ప్రపంచ స్థాయి ఉత్పత్తులను తయారు చేయవచ్చని నిరూపించింది. ఈ విధానం కారణంగానే, ఆర్థిక సంక్షోభాలు వచ్చినప్పుడు కూడా కంపెనీ స్థిరంగా నిలబడగలిగింది, ఇది భారతదేశంలో దీర్ఘకాలికంగా మనుగడ సాగించాలనుకునే సంస్థలకు ప్రధాన గుణపాఠం.
జోహో యొక్క ముఖ్య సిద్ధాంతం వారి "ట్రాన్స్నేషనల్ లోకలిజం" అనే విధానంలో స్పష్టంగా కనిపిస్తుంది. దీని అర్థం: వారి ఉత్పత్తుల నాణ్యత మరియు మార్కెటింగ్ అంతా ప్రపంచ స్థాయికి అనుగుణంగా ఉన్నప్పటికీ, కంపెనీ యొక్క మూలాలు, కార్యకలాపాలు, మరియు ఉద్యోగుల నియామకం మాత్రం స్థానికతకు ప్రాధాన్యత ఇస్తాయి. దీనిలో భాగంగానే, వారు చెన్నై, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలతో పాటు, తమ కార్యకలాపాలను తెన్కాసి వంటి టైర్–2 మరియు టైర్–3 నగరాలకు తరలించారు. ఈ తరలింపు వలన గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు లభించాయి. కేవలం నగరంలోనే కాకుండా, తమ సొంత ఊళ్లలో ఉంటూ, కుటుంబాలకు దగ్గరగా ఉంటూ, ప్రపంచ స్థాయి టెక్నాలజీపై పనిచేసే అవకాశం దొరికింది. ఈ విధంగా, జోహో భారతీయ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చింది, ఈ మోడల్ను ఇతర భారతీయ ఐటీ కంపెనీలు కూడా అనుసరించాలని శ్రీధర్ వేంబు గారు బలంగా నమ్ముతారు. ఈ కంపెనీ యొక్క మొత్తం ఫిలాసఫీని వారి ప్రసిద్ధ ట్యాగ్లైన్ల ద్వారా అర్థం చేసుకోవచ్చు. అవి కేవలం వ్యాపార నినాదాలు మాత్రమే కాదు, వారి సిద్ధాంతాలను ప్రతిబింబిస్తాయి. ముఖ్యంగా, జోహో తమను తాము "బిజినెస్ కోసం ఆపరేటింగ్ సిస్టమ్" గా అభివర్ణించుకుంటుంది. అంటే, ఒక బిజినెస్కు అవసరమైన అన్ని రకాల అప్లికేషన్లు (సేల్స్, మార్కెటింగ్, ఫైనాన్స్, హెచ్ఆర్ వంటివి) ఒకే గొడుగు కింద, ఒకే ప్లాట్ఫారమ్పై అందిస్తున్నామని దీని అర్థం. ఇతరులు ప్రతి సేవ కోసం వేర్వేరు కంపెనీల సాఫ్ట్వేర్లను వాడాల్సి వస్తే, జోహో ఒకే బృందంచే తయారు చేయబడిన, సజావుగా అనుసంధానమయ్యే పరిష్కారాలను అందిస్తుంది. ఈ సమగ్రమైన ప్యాకేజీ మరియు భారతదేశంలో పాతుకుపోయిన స్వయం–నిర్వహణ వ్యూహాలు, ప్రపంచ టెక్ రంగంలో జోహోను ఒక ప్రత్యేకమైన మరియు భారతీయ–కేంద్రీకృత విజేతగా నిలబెట్టాయి.
వ్యాపార సాఫ్ట్వేర్ మార్కెట్లో జోహో, మైక్రోసాఫ్ట్ మరియు గూగుల్ మూడు ప్రధాన శక్తులుగా ఉన్నప్పటికీ, వాటి వ్యాపార నమూనాలు మరియు వ్యూహాత్మక దృష్టిలో స్పష్టమైన తేడాలు ఉన్నాయి. మైక్రోసాఫ్ట్ మరియు గూగుల్ ప్రపంచంలోని అతిపెద్ద, అత్యంత ధనవంతమైన టెక్ దిగ్గజాలు. అవి వేల కోట్ల డాలర్ల పెట్టుబడులు, వాటాదారుల అంచనాలు మరియు విస్తృతమైన పబ్లిక్ క్లౌడ్ మౌలిక సదుపాయాలపై ఆధారపడతాయి. అయితే, జోహో పూర్తిగా భిన్నమైన మార్గాన్ని ఎంచుకుంది. జోహో తమ సొంత ఆదాయంతోనే ఎదిగే బూట్స్ట్రాపింగ్ విధానాన్ని నమ్ముతుంది, దీనివల్ల పెట్టుబడిదారుల ఒత్తిడి లేకుండా, స్థిరమైన లాభదాయకత మరియు తమ దూరదృష్టిపై పూర్తిగా దృష్టి పెట్టగలిగింది. ఈ ఆర్థిక స్వాతంత్ర్యం కారణంగా, జోహో దీర్ఘకాలిక వినియోగదారుల అవసరాలను తీర్చడానికి తగిన సమయం తీసుకోగలుగుతుంది, కేవలం త్రైమాసిక నివేదికల కోసం కాకుండా.
ఉత్పత్తుల రూపకల్పన పరంగా చూస్తే, జోహో తమను తాము 'బిజినెస్ కోసం ఆపరేటింగ్ సిస్టం'గా అభివర్ణించుకుంటుంది. అంటే, సేల్స్, ఫైనాన్స్, మార్కెటింగ్, హెచ్ఆర్ వంటి వ్యాపారానికి అవసరమైన అన్ని యాప్లను ఒకే కోర్ టెక్నాలజీ ప్లాట్ఫారమ్పై, ఒకే బృందం ద్వారా తయారు చేస్తుంది. దీనివల్ల ఆ యాప్లన్నీ ఒకదానితో ఒకటి సజావుగా అనుసంధానం అయ్యి పనిచేస్తాయి. దీనికి భిన్నంగా, మైక్రోసాఫ్ట్ మరియు గూగుల్ అందిస్తున్న ఉత్పత్తులు గొప్పవే అయినప్పటికీ, అవి తరచుగా వేర్వేరు బృందాలచే లేదా కొనుగోలు చేసిన కంపెనీలచే తయారు చేయబడిన ప్రత్యేక యాప్ల సమూహంగా కనిపిస్తాయి. దీనివల్ల వాటి మధ్య అనుసంధానం కోసం కొన్నిసార్లు అదనపు ప్రయత్నాలు లేదా మూడవ పక్షం సాఫ్ట్వేర్ అవసరం కావచ్చు.
ముఖ్యంగా, డేటా భద్రత మరియు క్లౌడ్ స్వాతంత్ర్యం విషయంలో జోహో ప్రత్యేకంగా నిలుస్తుంది. మైక్రోసాఫ్ట్ మరియు గూగుల్ ప్రపంచంలోనే అతిపెద్ద పబ్లిక్ క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లు. వారి వినియోగదారులు ఆ పబ్లిక్ క్లౌడ్పైనే ఆధారపడతారు. కానీ జోహో, తమ సొంత డేటా సెంటర్లను ప్రపంచవ్యాప్తంగా నిర్మించి, నిర్వహిస్తుంది. ఈ వ్యూహం ద్వారా, జోహో వినియోగదారుల డేటాపై పూర్తి నియంత్రణ కలిగి ఉంటుంది. ముఖ్యంగా, భారతీయ వినియోగదారుల డేటా భారతదేశ సరిహద్దులు దాటకుండా తమ స్థానిక డేటా సెంటర్లలోనే నిల్వ చేయబడుతుందని హామీ ఇస్తుంది. ఈ డేటా సార్వభౌమాధికారంవిధానం, వారి పోటీదారులైన మైక్రోసాఫ్ట్ మరియు గూగుల్ అందించే గ్లోబల్, పబ్లిక్ క్లౌడ్ మోడల్ కంటే భిన్నంగా, కస్టమర్లకు అధిక విశ్వాసాన్ని మరియు భద్రతను అందిస్తుంది. చివరగా, నియామకం మరియు స్థానికత విషయంలో కూడా తేడా ఉంది. మైక్రోసాఫ్ట్ మరియు గూగుల్ ప్రధానంగా సాంప్రదాయ హై–టెక్ హబ్లలో, అగ్రశ్రేణి సంస్థల నుండి పట్టభద్రులైనవారిని నియమిస్తే, జోహో తమ "ట్రాన్స్నేషనల్ లోకలిజం" ద్వారా టైర్–2 మరియు టైర్–3 నగరాలకు విస్తరించింది. జోహో స్కూల్ ఆఫ్ లర్నింగ్వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా డిగ్రీ కంటే ప్రతిభకే ప్రాధాన్యత ఇస్తూ, స్థానిక మరియు గ్రామీణ యువతకు అవకాశాలు కల్పిస్తుంది. ఈ విధంగా, జోహో ఒక సాంకేతిక కంపెనీగా ఉన్నప్పటికీ, ఒక ప్రత్యేకమైన సామాజిక–ఆర్థిక మార్పుకు దారితీసే విధంగా తన వ్యాపారాన్ని రూపొందించుకుంది, ఇది దాని గ్లోబల్ పోటీదారుల నమూనా కంటే పూర్తిగా భిన్నమైనది.
జోహో యొక్క అద్భుతమైన విజయం కేవలం సాంకేతిక ఉత్పత్తుల ద్వారా మాత్రమే రాలేదుబీ ఇది ప్రపంచంలోని టెక్ దిగ్గజాలైన మైక్రోసాఫ్ట్ మరియు గూగుల్కు వ్యూహాత్మక సవాలు విసిరిన ప్రత్యేక విధానం ద్వారా వచ్చింది. పెట్టుబడిదారుల నుండి వేల కోట్లు తీసుకోకుండా, తమ సొంత ఆదాయంతో ఎదిగే బూట్స్ట్రాపింగ్ మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా, జోహో ఆర్థిక స్వాతంత్ర్యాన్ని నిరూపించింది. అలాగే, వినియోగదారుల డేటాను తమ సొంత డేటా సెంటర్లలో, ముఖ్యంగా భారతదేశ సరిహద్దుల్లోనే భద్రపరచడం ద్వారా, అది టెక్ దిగ్గజాల పబ్లిక్ క్లౌడ్ నమూనాకు భిన్నంగా విశ్వాసం మరియు డేటా సార్వభౌమాధికారం అనే కొత్త ప్రమాణాలను నెలకొల్పింది. ఒకే ప్లాట్ఫారమ్పై వ్యాపారానికి కావాల్సిన అన్ని యాప్లను పూర్తి అనుసంధానంతో అందించడం ద్వారా, మరియు గ్రామీణ యువతకు అవకాశాలు కల్పించే ట్రాన్స్నేషనల్ లోకలిజం విధానాన్ని అనుసరించడం ద్వారా, జోహో కేవలం ప్రపంచ స్థాయి పోటీదారుగా మాత్రమే కాక, భారతదేశంలో ఒక ఆదర్శవంతమైన, స్థిరమైన మరియు నైతిక వ్యాపార నమూనాగా నిలిచింది. ఈ ప్రత్యేకతలే జోహోను టెక్ ప్రపంచంలో ఒక ప్రత్యేక స్థానంలో నిలబెట్టాయి.

# జై జవాన్ - జై కిసాన్

వేసవికాలం ఎండల్లో సలసలమని మండుతున్న వీధులలో కాళ్లకు చెప్పులు లేకుండా మైళ్ల కొద్దీ నడిచి పాఠశాలకు వెళ్లిన బాలుడుబీ స్వాతంత్ర్య పోరాటంలో ఏడేళ్లు జైలులో గడిపిన ధైర్యశాలిబీ దేశ ప్రధానమంత్రి అయిన తర్వాత కూడా కఠినమైన నిరాడంబర జీవితాన్ని గడిపిన ఆదర్శమూర్తి ఎవరో కాదు.ఆయనే లాల్ బహదూర్ శాస్త్రి. పదహారేళ్ల వయసులోనే గాంధీ పిలుపుకు స్పందించి సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొ న్నారు. వివాహంలో కేవలం చేనేత వస్త్రం, ఒక రాట్నాన్ని మాత్రమే కానుకగా తీసుకు న్నారు. 'శాస్త్రి' అనే స్నాతకోత్సవ పట్టానే తన పేరులో భాగంగా చేసుకున్న ఈ ధీరుడు, భారతదేశ రెండవ ప్రధానమంత్రి పీఠాన్ని అధిరోహించారు. శాస్త్రి అక్టోబరు 2, 1904న ఉత్తరప్రదేశ్లోని వారణాసికి ఏడు మైళ్ల దూరంలో ఉన్న మొఘల్ సరాయ్ అనే చిన్న పట్టణంలో శారదా ప్రసాద్ శ్రీవాస్తవ, రామదులారీ దేవి దంపతులకు జన్మించా రు. ఏడాదిన్నర వయసు ఉన్నప్పుడే తన తండ్రిని కోల్పోయారు. పదవ తరగతి చదువు తున్న సమయంలో బెనారస్లో మహాత్మా గాంధీ, పండిట్ మదన్మోహన్ మాలవీయలు నిర్వహించిన బహిరంగ సభకు హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల నుండి విద్యార్థులు వైదొలిగి సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరాలని మహాత్ముని పిలుపుతో ప్రేరణ పొందిన శాస్త్రి, తను చదువుతున్న పాఠశాల నుండి బయటకు వచ్చి పికెటింగ్, బ్రిటిష్ వ్యతిరేక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక శాఖలో వాలం టీర్గా చేరారు.గాంధీచే బాగా ప్రభావితమై, 1920లో భారత స్వాతంత్ర్య ఉద్యమం లో చేరారు. లాలా లజపత్ రాయ్ స్థాపించిన సర్వెంట్స్ ఆఫ్ పీపుల్ సొసైటీకి అధ్యక్షుడిగా పనిచేశారు. 1928లో మహాత్మా గాంధీ పిలుపు మేరకు భారత జాతీయ కాంగ్రెస్లో చురుకైన, పరిణతి చెందిన సభ్యుడయ్యారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొ న్నారు. ఈ పోరాటంలో భాగంగా మొత్తం ఏడేళ్లపాటు జైలు జీవితాన్ని గడిపారు. ఈ పోరాటమే ఆయన వ్యక్తిత్వాన్ని రాటుదేల్చి పరిపక్వతను ఇచ్చింది.



**ప్రధానమంత్రిగా తనదైన ముద్ర:** అప్పటి ప్రధాని నెహ్రూ మరణానంతరం జూన్ 9, 1964న దేశ రెండవ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నెహ్రూ సోషలిస్టు ఆర్థిక విధానాలను కేంద్ర ప్రణాళికతో కొనసాగించారు. ఆహార కొరత, నిరుద్యోగం, పేదరికం వంటి అనేక ప్రాథమిక సమస్యలను పరిష్కరించారు.భారతదేశ ఆహారోత్పత్తిని పెంచాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ 1965లో హరిత విప్లవాన్ని ప్రోత్సహించారు. ఇది పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుదలకు దారితీసింది. ఆల్మట్టి డ్యాముకు శంఖుస్థాపన చేశారు. ఈయన హయాంలోనే వ్యవసాయ రంగానికి సంబంధించి కీలక సంస్థలు ఏర్పాటు చేయబడ్డాయి. వ్యవసాయ ధరల సంఘం ఏర్పాటు అయింది. భారత ఆహార సంస్థ ఉనికిలోకి వచ్చింది. జాతీయ విత్తనాల కార్పొరేషన్, సెంట్రల్ వేర్హౌసింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయబడింది. పాల ఉత్పత్తిని పెంచే దిశగా శ్వేత విప్లవాన్ని ప్రోత్సహించి, జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థను, అముల్ సహకార సొసైటీ ఏర్పాటుకు ఎనలేని కృషి చేశారు. డాక్టర్ హోమీ జహంగీర్ భాభా అణు పేలుడు పదార్థాలను అభివృద్ధి చేయాలని సూచించగా, దీనిని శాస్త్రి ఆమోదించారు. దేశంలో ప్లూటోనియం రీప్రాసె సింగ్ ప్లాంట్ను కూడా ప్రారంభించారు. చైనా దేశంతో తలెత్తిన రక్షణ సమస్యలను శాంతియుతంగా, సమయస్ఫూర్తితో పరిష్కరించారు. ప్రధానిగా ఉన్న కొద్ది కాలం లోనే భారతదేశాన్ని అనేక క్లిష్ట పరిస్థితుల నుండి గట్టెక్కించ గలి గారు. శాస్త్రి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే భారత్ – పాకిస్తాన్ యుద్ధం జరిగింది. యుద్ధ సమయంలో దెబ్బతిన్న దేశ ఆర్థిక, రక్షణ వ్యవస్థలను సమర్థవంతంగా ఎదుర్కొనేం దుకు "జై జవాన్ – జై కిసాన్" అనే పిలుపునిచ్చారు. ఈ నినాదం బాగా ప్రాచుర్యం పొంది ఇప్పటికీ ప్రతిధ్వనిస్తుంది. ఈ యుద్ధం అధికారికంగా జనవరి 10, 1966న తాష్కెంట్ ఒప్పందంతో ముగిసింది.
**మరణం:** ఈ ఒప్పందం జరిగిన మరుసటి రోజు జనవరి 11, 1966న తాష్కెంట్లో శాస్త్రి గారు అకస్మాత్తుగా మరణించారు. ఆయన మరణానికి గల కారణాలు ఇప్పటికీ అనుమానాస్పదంగానే ఉన్నాయి. తాష్కెంట్లో విష ప్రయోగం జరిగిందనే బలమైన వాదన కూడా ఉంది. ఏదేమైనప్పటికీ, భారతదేశం ఒక ఆదర్శమూర్తిని, మహానేతను, గొప్ప దేశభక్తుడిని శాశ్వతంగా కోల్పోయింది.
**యువతకు స్ఫూర్తిదాయకం:** భారత ప్రభుత్వం 1966లో లాల్ బహదూర్ శాస్త్రికి మరణానంతరం భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన "భారతరత్న"తో సత్కరించింది. మరణానంతరం ఈ పురస్కారం పొందిన మొదటి వ్యక్తి ఆయనే. ఆయన గౌరవార్థం ఢిల్లీలో 'విజయ్ ఘాట్' పేరుతో స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేశారు. ప్రజా జీవితానికి లాల్ బహదూర్ శాస్త్రి చేసిన కృషి అపూర్వం. మూడు దశాబ్దాలకుపైగా దేశానికి సేవలందించారు. ఈ వ్యవధిలో నీతి, నిజాయితీ, సామర్థ్యానికి ప్రతీకగా నిలిచారు. వినయం, సహనం, దృఢచిత్తం, అద్భుతమైన అంతఃశక్తితో కూడిన ఆయన ప్రజల మనసును అర్థం చేసుకున్న నాయకుడిగా ఎదిగారు. అంతేకాదు, గొప్ప దూరదృష్టితో దేశాన్ని ప్రగతి బాటలో ముందుకు తీసుకెళ్లారు. దేశ ప్రధానమంత్రిగా పదవి నుంచి దిగిపోయాక కూడా, మరణించే సమయానికి ఒక ఇల్లు కూడా లేని శాస్త్రి గారి నిరంతర సేవామయ జీవితం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం.

**నేడు లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా...**

**జనక మోహన రావు దుంగ – 8247045230**

## గాంధీ ఆశ్చర్యపోయేలా ఈ జయంతి

*తన 157వ జయంతికి మహాత్మాగాంధీ మళ్లీ వస్తే, పేపర్ తిరగేస్తే మొదటి పేజీ చూసి ఆశ్చర్య పోతాడు. అందులో పెద్దగా ప్రభుత్వ ప్రకటన. జీఎస్టీ పన్నులు తగ్గించాం..పండుగ చేసుకోండి అంటూ. పన్నులు తగ్గించడం అభినందనీయమే కానీఅది ఇలా ప్రకటించుకొనే అంశమా అని సంశ యం. తగ్గిన పన్ను, చివరి ఖాతాదారు జేబు చిల్లుని ఎంత వరకూ మూసిం ది, అసలు ధర ఎందాక తగ్గింది చూశాక స్పష్టత వస్తుంది కదా! తర్వాత పేజీలో తొక్కిసలాటలో మరణాలు. తను దేశ నలుమూలలకు వెళ్లినప్పుడు చూసేం దుకు ప్రజలు విరగబడే వారు. ఇప్పుడంతటి సాంకేతి కత కూడా లేదు. అయినా ఎప్పుడూ తొక్కిసలాటలో ప్రాణాలు పోవడం జరగలేదు. ఇప్పుడు ఆధునిక సాంకేతికత, మానవ వనరులు అన్నీ ఉన్నా రక్షణ కు హామీ లేదు. పదిమంది గుమిగూడితే చాలు, ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే.*
*తర్వాత పేజీలో ట్రంప్ హుంకరింపులు..మరో దేశపు బెదిరింపులు. మన దేశమే పెద్ద మార్కెట్. మన స్నేహం కోసం వాళ్లే పాకులాడాలి. మన స్వదేశీ ఉత్పత్తుల వినియోగం సంపూర్ణ స్థాయిలో ఉంటే ఎంత ఆర్థిక బలం పెరుగుతుంది? వందేళ్లుగా చెవి లో పోరుతున్న స్వావలంబన, స్థిరత్వం ఇంకా రాలేదా అని ఆశ్చర్యం. తర్వాత పేజీలో సంపన్నుల ఆడంబరాలు, శ్రామికుల పనిగంటల పెంపు. ఇంకో పేజీలో చెరువుల ఆక్రమణలతో తీవ్ర రూపం దాల్చిన ముంపు, నగరాల్లో వరదలు. అసలు సమస్యలు వదిలి, కొసరు పట్టుకు వేలాడే రాజకీయ వాదాలు. పేపరు అంతా తిరగేసినా సానుకూల దృక్పథం నింపే వార్త మచ్చుకైనా లేదు. తను చెప్పిన ఏడు పాపాలు( నియమం లేని రాజకీయాలు, పని కి సంబంధం లేని సం పద, నీతి లేని వాణిజ్యం, గుణం లేని జ్ఞానం, మానవత లేని విజ్ఞానం, త్యాగం లేని ఆరాధన, మనస్సాక్షిని పట్టించుకోని ఆనందం) సమాజం లో చక్కగా పెరిగాయి. మరిన్ని కొత్త పాపాలు కూడా వచ్చి చేరాయి. దాంతో వ్యక్తి, వ్యవస్థ పతనం వైపే నడుస్తున్నాయి. కాబట్టి 'మళ్లీ మొదలెడదామా!' అం టూ నైతికత, స్వీయ గౌరవం, స్వావలంబన పెంచేలా పాఠశాలల్ని తయారు చేయాలని చెప్తాడు. పర్యావరణాన్ని కాపాడాలని, అంతా ఒక్కటే నన్న భావ విప్లవం రావాలని, అందుకు ముందుండి నడిపిస్తానని నడుం కడతాడు. అయితే ఎంతమంది ఆయన వెనక నడుస్తారన్నది ఓ పెద్ద ప్రశ్నార్థకం.*

*డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ.*
*9440836931.*

## హిండ్‌వేర్‌కి నూతన దిశగా 'సుఖూన్' ప్రచారం




హిండ్‌వేర్ తన తాజా బ్రాండ్ పదవిని "డిజైన్డ్ ఫర్ సుఖూన్" అనే కాన్సెప్ట్‌తో ప్రకటించింది. ఈ బ్రాండ్ ప్రచారం ఇంటిని కేవలం వాడుక కోసం కాదు, సుఖం, ప్రేమ, శాంతి మరియు సంరక్షణతో నిండి ఉండే స్థలంగా పునఃఆవిష్కరిస్తుంది. మల్లెన్‌లో లింటాస్ గ్రూప్ రూపొందించిన ఈ ప్రచారం వినియోగదారుల్లో భావోద్వేగాలను ఉత్తేజితం చేస్తూ, అన్ని వయసుల వారికి కనెక్ట్ అయ్యేలా ఉంది. స్మార్ట్ వాష్‌రూమ్ సదుపాయాలు, రంగురంగుల వాష్‌బేసిన్లు, శబ్దరహిత చిమ్నీలు, డిజైన్‌తో కూడిన టైల్స్ వంటి సాంకేతికతకు మానవ స్పర్శను జోడించిన ఉత్పత్తుల ద్వారా ఈ కాన్సెప్ట్‌ను జీవంగా చూపించారు.
హిండ్‌వేర్ వ్యూహాల శిరోమణి శశ్వత్ సోమానీ మాట్లాడుతూ, సంస్థ గత ఆరు దశాబ్దాలుగా వినూత్నత, నాణ్యత, నమ్మకానికి మారుపేరు అయిందని, ఇప్పుడు ఈ నూతన ప్రచారంతో బాత్‌వేర్, టైల్స్ మరియు కిచెన్ అప్లయన్స్‌లు అన్నింటినీ ఒకే తాటిపైకి తీసుకువచ్చామని తెలిపారు. ఇది వినియోగదారులకు మానసిక ప్రశాంతతను అందించే అనుభూతిని కలిగించడమే లక్ష్యంగా తీసుకున్న అడుగుగా పేర్కొన్నారు. సిఇఒ నిరుపమ్ సాహాయ్ మాట్లాడుతూ, హిండ్‌వేర్ ఉత్పత్తులు కేవలం పనికి మేలు కాకుండా, రోజువారీ జీవితాన్ని సుఖంగా మార్చేలా రూపొందించబడ్డాయని చెప్పారు.
మార్కెటింగ్ హెడ్ అరుణిమా యాదవ్ తెలిపిన ప్రకారం, ఈ ప్రచారం బ్రాండ్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూనే, ఆధునిక వినియోగదారులకు భావోద్వేగ కథ చెప్పడం ద్వారా అనుసంధానమవుతుంది. రామ్ కోబైన్ (సిసిఒ %-% మల్లెన్ లింటాస్) ప్రకారం, సుఖూన్ అనేది కేవలం పదం కాదు, ఇది ఒక అనుభూతి %-% ప్రతి హిండ్‌వేర్ ఉత్పత్తిలో ఉంచిన భావన. ఈ ప్రచారం టెలివిజన్, డిజిటల్, సోషల్ మీడియా, సినిమా హాళ్లు, ప్రింట్ మరియు విమానాశ్రయ ప్రకటనల ద్వారా విస్తృతంగా నిర్వహించబడుతోంది. ఇది బాత్‌వేర్, టైల్స్, కిచెన్ ఉత్పత్తుల్లో సాంకేతికతతో పాటు సౌకర్యాన్ని, శాంతిని కలిగించేలా రూపొందించబడింది. ఈ ప్రచారం వినియోగదారుల హృదయాలను తాకే భావోద్వేగ కథనంతో ఇంటిని సుఖంగా మార్చే అనుభూతిని అందిస్తుంది.

### టాటా మోటార్స్ ఎఫ్‌వై26 రెండో త్రైమాసికంలో విస్తృత వృద్ధి నమోదు

ఎఫ్‌వై26 రెండో త్రైమాసికంలో టాటా మోటార్స్ వాణిజ్య వాహనాలు మరియు ప్రయాణికుల వాహనాల విభాగాల్లో రెండిటిలోనూ గణనీయ-ంమైన వృద్ధిని నమోదు చేసింది. వాణిజ్య వాహన విక్రయాలు 12% పెరిగి 94,681 యూనిట్లకు చేరగా, ప్రయాణికుల వాహనాలు 10% పెరిగి 1,44,397 యూనిట్లను విక్రయించాయి. జీఎస్టీ 2.0 ప్రభావంతో సెప్టెంబర్‌లో డిమాండ్ పెరగడం, కొత్త ఉత్పత్తుల విడుదల, ఫెస్టివల్ సీజన్ మొదలవడం వల్ల ఈ వృద్ధి సాధ్యపడింది. ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు 59% పెరిగి 24,855 యూనిట్లు కాగా, ఎస్‌సీవీ, పికప్ వాహనాల్లో 30% వృద్ధి జరిగింది. టాటా నెక్సాన్, పంచ్, హారియర్, సఫారీ వంటి మోడళ్లకు మంచి స్పందన లభించింది. అంతర్జాతీయ విక్రయాలు కూడా గణనీయంగా పెరిగాయి. టాటా మోటార్స్ పటిష్టమైన ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోతో రెండో సగభాగంలో మరింత వృద్ధిని ఆశిస్తోంది.

### ఫ్రాంచైజీ తో పి ఎన్ రావు అరంగేట్రం



హైదరాబాద్ : ఫ్రాంచైజింగ్ ద్వారా వ్యూహాత్మక విస్తరణలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తూ, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో తన మొదటి ఫ్రాంచైజీ స్టోర్‌ను ప్రారంభించినట్లు పి ఎన్ రావు గర్వంగా ప్రకటించారు. శ్రీ. రాజ్యసభ ఎంపీ కె లక్ష్మణ్ ఈ స్టోర్‌ను ప్రారంభించారు. దాదాపు ఒక సంవత్సరం క్రితం, ఫ్రాంచైజ్ మార్గం ద్వారా అభివృద్ధి చెందాలనే తన ప్రణాళికలను కంపెనీ పంచుకుంది మరియు ఈ కొత్త స్టోర్ ఆ దార్శనికతను ప్రతిబింబిస్తుంది. నాణ్యమైన టైలరింగ్ మరియు రెడీ-టు-వేర్ ఉత్పత్తులను కస్టమర్లకు దగ్గరగా తీసుకురావడం దీని లక్ష్యం. ఈ కొత్త ఫ్రాంచైజ్ స్టోర్‌తో, పి ఎన్ రావు చేతిపనులు మరియు నాణ్యత పట్ల తన నిబద్ధతను కొనసాగిస్తూ, వారి పరిసరాల్లో అసాధారణమైన ఉత్పత్తులు మరియు సేవలను పొందేలా చూసుకుంటూ ఎక్కువ ప్రాప్యత మరియు సౌలభ్యాన్ని అందించాలని ఆశిస్తున్నారు.

### స్మార్ట్ ఏఐతో లెనోవో ఇండియా వాణిజ్యం ఎనేబుల్



హైదరాబాద్: అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజం లెనోవో హైదరాబాద్ లో తన ఫుల్ స్టాక్ ఎంటర్ప్రైజ్ పోర్ట్ఫోలియోను ప్రదర్శించింది. అందరికీ స్మార్టర్ ఏ ఐఅందించాలన్న నిబద్ధత తో లెనోవో అందిస్తున్నఆఫర్లన్నీవివిధ సంస్థలు తమ కార్యకలాపాలను ఆధునికం చేసుకోవడానికి ఐటీని ఆప్టిమైజ్ చేయడానికి, ఏఐని ఉపయోగపడుతుంది. ఐటీ, బయోటెక్, ఏరోస్పేస్, ఫార్మాస్యూటికల్స్ లాంటి రంగాల్లో దేశంలోనే టెక్నాలజీ పవర్ హౌస్ గా హైదరాబాద్ తన స్థానాన్ని బలోపేతం చేసుకుంటున్న ఈ తరుణంలో లెనోవో తన ఉనికిని చాటుకుంటోంది. భారత దేశ డిజిటల్ఆ ర్థికవ్యవస్థకుకేంద్రాల తో తెలంగాణ ఏఐమిషన్ (టీ-ఎఐ-ఎమ్), టి-హబ్ చొరవలతో ఏఐ ఇన్నోవేషన్ కూడావృద్ధిచెందుతోంది. జీసీసీ లకు నగరం ప్రధానకేంద్రంగా మారుతోంది. దీనిపై లెనోవో ఇండియా ఎంటర్ప్రైజ్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రోహిత్ మా దామాట్లాడుతూ, "భారతదేశంలోని సీఐఓలలో 51% ఇప్పటికే ఏఐని వాడుతుండగా, వ్యాపార సంస్థలు మాత్రందీన్నిసమర్థంగా అమలుచేయడంలో సమస్యలుఎదుర్కొంటున్నాయి. అందుకే లెనోవో తన సమగ్ర ఏఐపోర్ట్ఫోలియో ద్వారా అత్యంత సురక్షితంగా, పెంచగలిగేలా, సులభంగా అమలు చేయగలిగేలా చేస్తూ ఈఅంతరాలను పూడుస్తోం దని అన్నారు.

### రాపిడో వారసత్వ కెప్టెన్లతో తెలంగాణ సంస్కృతి పరిచయం




హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ టూరిజం కాన్‌క్లేవ్ 2025 సందర్భంగా, రాపిడో సంస్థ మరియు తెలంగాణ ప్రభుత్వ యవత, పర్యాటక, సాంస్కృతిక శాఖ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా "రాపిడో హెరిటేజ్ కెప్టెన్స్" అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో ఎంపికైన రాపిడో డ్రైవర్స్‌కు తెలంగాణ సంప్రదాయాలు, చారిత్రక స్థలాలు, సంస్కృతిపై శిక్షణ ఇచ్చి వారిని "నాలెడ్జ్ అంబాసిడర్స్"గా తీర్చిదిద్దుతారు. ప్రాథమికంగా హైదరాబాద్‌లో ప్రారంభమయ్యే ఈ పథకం తర్వాత రాష్ట్రంలోని ఇతర వారసత్వ నగరాలకు విస్తరించనుంది. రాపిడో యాప్‌లో ప్రత్యేక బ్యాడ్జ్ మరియు హెరిటేజ్ మార్గాలను సూచించే ఫీచర్లు కూడా అందుబాటులోకి వస్తాయి. ఈ కార్యక్రమం పర్యాటక అనుభవాన్ని మెరుగుపరచడమే కాకుండా, డ్రైవర్లకు నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది. రాపిడో సహ-సంస్థాపకుడు పవన్ గుంటుపల్లి మరియు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఈ భాగస్వామ్యాన్ని ప్రజెంట్ చేస్తూ, తెలంగాణ వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో ఇది కీలకమ్మెన అడుగు అని తెలిపారు.

### ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐపీవో అక్టోబర్ 7న ప్రారంభం




ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ అక్టోబర్ 7, 2025న ప్రారంభమయ్యే ప్రారంభ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ద్వారా మార్కెట్‌లో అడుగుపెట్టుతోంది. షేర్ ధర శ్రేణి ₹1,080 నుంచి ₹1,140గా నిర్ణయించబడింది. కంపెనీ ప్రమోటర్ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇన్‌క్ 10.18 కోట్ల షేర్లను విక్రయించనుంది. ఉద్యోగుల కోసం ₹108 రాయితీ కూడా అందుబాటులో ఉంది. యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ అక్టోబర్ 6న జరుగుతుంది. ఐపీవోను ఎన్‌ఎస్‌ఇ, బిఎస్‌ఇపై లిస్ట్ చేయనున్నారు. మొత్తం షేర్లలో 35% రిటైల్ ఇన్వెస్టర్లకు, 15% నాన్-ఇన్స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు, మిగిలినవి క్యూఐబిలకు కేటాయిస్తారు. దరఖాస్తులు తప్పనిసరిగా ఎఎస్బిఎ విధానం ద్వారా మాత్రమే సమర్పించాలి.

### ఇన్‌ఫ్రా మార్కెట్ రహస్యంగా డిఆర్‌హెచ్‌పి ఫైల్ చేసింది




అక్సెల్ మరియు టైగర్ గ్లోబల్ మద్దతుతో అభివృద్ధి చెందిన నిర్మాణ సామాగ్రి ప్లాట్‌ఫామ్ ఇన్‌ఫ్రా.మార్కెట్, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా వద్ద తన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌ను గోప్యంగా దాఖలు చేసింది. సుమారు ₹4,500-5,000 కోట్ల వరకు నిధులను తాజా షేర్ల జారీ మరియు ప్రస్తుత పెట్టుబడిదారుల ఆఫ్స్ ద్వారా సమీకరించేందుకు సంస్థ యోచిస్తోంది. కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, హెచ్‌ఎస్బీసీ, గోల్డ్‌మాన్ సాక్స్ సంస్థకు మర్చెంట్ బ్యాంకర్లుగా నియమితులయ్యారు. ఇటీవలే సిరీస్ + రౌండ్‌లో ₹730 కోట్లు సమీకరించిన ఇన్‌ఫ్రా.మార్కెట్, ₹24,600 కోట్ల విలువతో ఐపీఓకు సిద్ధమవుతోంది. 2016లో స్థాపితమైన ఈ సంస్థ దేశవ్యాప్తంగా 10,000ం రిటైల్ టచ్‌పాయింట్లు, 250+ తయారీ యూనిట్లతో కలిసి 15కిపైగా ఉత్పత్తుల విభాగాలను అందిస్తోంది.

### గ్లేనీగుల్స్ హాస్పిటల్ హృదయ దినోత్సవ అవగాహన కార్యక్రమం



ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా, గ్లీనీగుల్స్ అవేర్ హాస్పిటల్, ఎల్.బి. నగర్, బైరమల్గూడలో "డోంట్ మిస్ ఎ బీట్ - కీప్ యూర్ హార్ట్ ఇన్ రిథమ్" థీమ్‌తో హృదయ ఆరోగ్యం పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై, యువతలో హృదయ రోగాల నివారణకు అవగాహన అవసరాన్ని ప్రముఖ హృదయ నిపుణులు ఈ సందర్భంగా హృదయ రిథమ్ లోపాల పట్ల చైతన్యాన్ని కలిగిస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలి, ముందస్తు నిర్ధారణ మరియు ఆధునిక చికిత్సా పద్ధతుల ప్రాముఖ్యతను వివరించారు. హృదయ సంబంధిత సమస్యలు యువతలోనూ వేగంగా పెరుగుతున్నాయని వారు పేర్కొన్నారు.

## అమెజాన్ ఫ్రెష్ 270 నగరాలకు విస్తరణ



అమెజాన్ ఫ్రెష్ భారత్‌లో తన సేవలను 270కు పైగా నగరాలకు విస్తరించింది. గత రెండేళ్లలో 4.5 రెట్లు విస్తరిచి, 10 రెట్లు ఉత్పత్తుల ఎంపికను పెంచింది. తాజా పండ్లు, కూరగాయలు, నిత్యావసర వస్తువులు, ప్రాంతీయ ప్రీతిపాత్రమైన వస్తువులు సహా మొత్తం 40,000కిపైగా ఉత్పత్తులను 2 గంటల స్లాట్‌లలో డెలివరీ చేస్తోంది. ఉత్తర భారతంలోని గోరఖ్‌పూర్, డెహ్రాడూన్, జలంధర్ నుంచి దక్షిణ భారతంలోని తిరుపతి, కడుగు, హాసన్, నల్లూరు వరకు అనేక నగరాల్లో సేవలు ప్రారంభమయ్యాయి. ఈ విస్తరణ ద్వారా రైతుల నుంచి నేరుగా సరఫరా చేసే వ్యవస్థను ఏర్పాటు చేసి, దేశవ్యాప్తంగా 13,000కిపైగా రైతులతో భాగస్వామ్యం చేసారు. అమెజాన్ ఫ్రెష్ విక్రేతలు కఠినమైన నాణ్యతా ప్రమాణాల ప్రకారం ఉత్పత్తులను పరిశీలించి, శీతలీకృత నిల్వల ద్వారా వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సందర్భంగా రూ.1 నుండి డీల్స్, ₹400 వరకు క్యాష్‌బ్యాక్, దీపావళి అలంకరణ వస్తువులు మరియు ప్రతి వారం 'సూపర్ వాల్యూ డేస్' లో అదనపు డిస్కౌంట్లు అందుబాటులో ఉన్నాయి.

## హెచ్‌అండ్‌ఎం బ్యూటీ ఇండియాలో గ్రాండ్ లాంచ్



హెచ్‌అండ్‌ఎం బ్యూటీ కన్సెప్ట్ భారత్‌లో తొలిసారి ప్రారంభమైంది. మేకప్, ఫ్రాగ్రెన్స్‌లు, బ్యూటీ టూల్స్ లాంటి 200కిపైగా ఉత్పత్తులతో కూడిన ఈ కలెక్షన్ హైదరాబాద్‌లో ఇర్రుమ్ మంజిల్ మాల్‌లో లభ్యం కానుంది.
ట్రెండ్ ఆధారిత, నాణ్యమైన, అందరికీ అందుబాటులో ఉండే ఈ ఉత్పత్తులు స్వీయ-అభివ్యక్తికి ప్రోత్సాహం ఇవ్వడమే లక్ష్యంగా రూపొందించబడ్డాయి.
స్టేట్‌మెంట్ లిప్‌స్టిక్స్, మాడ్ ఫర్ మ్యాట్ లిక్విడ్ లిప్‌స్టిక్, నెవర్ ఎండింగ్ లాష్ మస్కారా, దూ-ఇట్-ఆల్ స్టిక్ బ్లష్ వంటి ఉత్పత్తులు ముఖ్య ఆకర్షణగా నిలిచాయి. వేగన్ మరియు క్రూరత్వరహిత సూత్రాలతో రూపొందిన ఈ ఉత్పత్తులు రూ. 799 లోపు మేకప్,రూ.1299 ప్రారంభ ధరతో పర్ఫ్యూమ్‌లు అందించడమ ద్వారా అందరికీ అందుబాటులో ఉంటాయని హెచ్‌అండ్‌ఎం తెలిపింది.
ఇది హెచ్‌అండ్‌ఎం ఇండియా 10వ వార్షికోత్సవాన్ని మరింత ప్రత్యేకంగా చేసిందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని హెచ్‌అండ్‌ఎం స్టోర్లు మరియు hm.com ద్వారా ఈ బ్యూటీ ఉత్పత్తులు అక్టోబర్ 2 నుంచి వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి.

## దసరాకు ఏపీ, తెలంగాణలో బస్సు బుకింగ్స్ పెరుగుదల

దసరా పండుగకు ముందుగా ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో బస్సు ప్రయాణాలపై గణనీయమైన ఆసక్తి కనిపించింది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది బస్సు బుకింగ్స్‌లో 36% పెరుగుదల నమోదైంది. రెడ్‌బస్ డేటా ప్రకారం, సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకూ ప్రయాణాలపై ప్రజల్లో ఆసక్తి పెరిగింది. హైదరాబాద్%-%బెంగళూరు, విజయవాడ %-% హైదరాబాద్, విశాఖపట్నం%-%విజయవాడ వంటి మార్గాలు అత్యధిక బుకింగ్స్ నమోదైన ట్రాఫిక్ రూట్లుగా ఉన్నాయి.అదే సమయంలో, ప్రజల్లో ప్రయాణానికి సౌకర్యాన్ని ప్రాధాన్యత ఇస్తున్నట్టు సమాచారం. బుకింగ్స్‌లో 63% మంది ఎయిర్ కండిషన్డ్ (ఏసీ) బస్సులను ఎంపిక చేసారు, 60% మంది స్లీపర్ బస్సులను కోరగా, మహిళలు 35% బుకింగ్స్ చేశారని తెలిసింది. ముఖ్యమైన బోర్డింగ్ పాయింట్లలో మియాపూర్, కూకట్‌పల్లి, గచ్చిబౌలి వంటి ప్రాంతాలు ఉన్నాయి. ఇది దసరా వేళలో రోడ్డు మార్గం ద్వారా పండుగను జరుపుకునేందుకు ప్రజలు ఎంత ఉత్సాహంగా ఉన్నారనేది తెలియజేస్తోంది.

## కలిఫోర్నియా బాదం తో హృదయ ఆరోగ్య దినోత్సవం ప్రారంభించండి



ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా "ఒక్క తాకిడి కూడా మిస్ అవకూడదు" అనే థీమ్ తో ప్రజలలో హృదయ ఆరోగ్యంపై అవగాహన పెంచే ప్రయత్నం కొనసాగుతోంది. భారతదేశంలో కార్డియోవాస్కులర్ వ్యాధులు (సివిడిలు) యువతలోనే ఎక్కువగా కనిపించడమే కాకుండా, మహిళల్లో మొదటి హృదయ ఆఘాతాలు తీవ్రంగా ఉండే ప్రమాదం ఎక్కువగా ఉంటుందనే హెచ్చరికలు వెల్లడి అయ్యాయి. ఈ నేపథ్యంలో, ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా రోజువారీ ఆహారంలో కలిఫోర్నియా బాదంపప్పును చేర్చడం ఒక సరళమైన కానీ సమర్థవంతమైన మార్గంగా నిపుణులు సూచిస్తున్నారు. బాదంపప్పు 15 ముఖ్య పోషకాలు కలిగి ఉండే ఆరోగ్య రత్నంగా ప్రసిద్ధి పొందింది. ఇవి హృదయానికి మంచిన మోనోఅన్‌సాచురేటెడ్ కొవ్వులు, విటమిన్-ఈ, మగ్నీషియం, పొటాషియం మరియు ఫైబర్‌ను సమృద్ధిగా అందిస్తాయి. ప్రతి రోజు బాదంపప్పును తీసుకోవడం ద్వారా హానికరమైన కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గడం, శరీరంలోని ఇన్ఫ్లమేషన్‌ను నియంత్రించడం వంటి హృదయ ఆరోగ్యానికి మేలు చేసే ప్రయోజనాలు ఉన్నాయి. సెలబ్రిటీలు, పోషకాహార నిపుణులు కూడా రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు బాదంపప్పును ఉదయాన్నే తీసుకోవాలని ప్రోత్సహిస్తున్నారు. ఈ ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా, ఆరోగ్యాన్ని మొదటిపెట్టే అలవాటుగా బాదంపప్పును ప్రతి రోజు ప్రారంభంలో తీసుకోవడం మంచి మార్గమని నిపుణులు చెబుతున్నారు.

## ఏబీడీ రంగాపూర్‌లో పీఈటీ యూనిట్ ప్రారంభం




భారతదేశంలో అతి పెద్ద దేశీయ మద్యం కంపెనీ అయిన అలాయిడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిలర్స్ (ఏబీడీ) రంగాపూర్, తెలంగాణలో తన సమగ్ర తయారీ కేంద్రంలో పీఈటీ బాటిల్ తయారీ యూనిట్‌ను ప్రారంభించింది. ఈ యూనిట్ వార్షికంగా 600 మిలియన్ బాటిళ్లు తయారు చేసే సామర్థ్యం కలిగి ఉంది. ₹115 కోట్ల పెట్టుబడితో నిర్మితమైన ఈ యంత్రాంగం ద్వారా సంస్థ తన ప్యాకేజింగ్ అవసరాలను స్వయంగా తీర్చుకోగలదు, బాహ్య సరఫరాదారులపై ఆధారాన్ని తగ్గించడమే కాక, రవాణా ఖర్చులను తగ్గించేందుకు తోడ్పడుతుంది. ఆధునిక రోబోటిక్స్ ప్యాకేజింగ్ వ్యవస్థలు, జపనీస్ ఎనర్జీ సేవింగ్ పరికరాలు మరియు పునర్వినియోగ సాంకేతికతలతో ఈ యూనిట్ అత్యాధునికంగా రూపొందించబడింది. ఈ యూనిట్ ప్రారంభం ద్వారా సంస్థ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా, ప్యాకేజింగ్ పై నియంత్రణ పెరుగుతుంది. ఇది ఏబీడీ చేపట్టిన ₹525 కోట్ల వెనుకటి సమీకరణ ప్రణాళికలో భాగం, ఇందులో భారత్‌లో తొలి సింగిల్ మాల్ట్ డిస్టిలరీ, మహారాష్ట్రలోని ఈఎన్‌ఏ డిస్టిలరీ విస్తరణ కూడా ఉన్నాయి. ఈ ప్రణాళికల ద్వారా సంస్థ 2028 ఆర్థిక సంవత్సరానికి లోపల గ్రాస్ మార్జిన్లను 300 బేసిస్ పాయింట్లు వరకు మెరుగుపరచనున్నట్లు అంచనా.

## ఏఐతో మారుతున్న ఉద్యోగాలు, భారత యువత సిద్ధం




లింక్డ్ఇన్ తాజా నివేదిక ప్రకారం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పునరావృత పనులను చేపట్టిన నేపథ్యంలో, భారతీయ వృత్తిపరులు మానవ తీర్పు, సృజనాత్మకత, పరస్పర చర్యపై ఆధారపడే ఉద్యోగాలవైపు వెళ్తున్నారు. హెచ్‌ఆర్ నిపుణులు కస్టమర్ సపోర్ట్ మరియు అడ్మినిస్ట్రేషన్ వైపు, ఫైనాన్స్ నిపుణులు అకౌంటింగ్ వైపు, ఇంజినీర్లు విద్యారంగానికి మారుతున్నారు. ఇదే సమయంలో, ఎక్కువ మంది ఉద్యోగులు కన్సల్టింగ్, రియల్ ఎస్టేట్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ వంటి వ్యూహాత్మక రంగాల్లోకి ప్రవేశిస్తున్నారు. లింక్డ్ఇన్ సర్వే ప్రకారం, 62% మంది భారతీ-యులు ఏఐ తమ పనితీరును మెరుగుపరుస్తుందని నమ్ముతున్నారు. ఈ మారుతున్న సందర్భంలో, లింక్డ్ఇన్ ఏఐ ఆధారిత ఉద్యోగాల శోధన వ్యవస్థను ప్రవేశపెట్టింది. అభ్యర్థులు తాము కోరుకునే ఉద్యోగాన్ని సాధారణ పదాల్లో వివరించడం ద్వారా తమ ఆసక్తులకు తగ్గ అవకాశాలను పొందగలుగుతారు. లింక్డ్ఇన్ టిప్స్ ప్రకారం, ఉద్యోగ శోధనలో నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి, ప్రతి దరఖాస్తును అనుకూలీకరించాలి, మరియు కొత్త అవకాశాలకు మనసు తెరవాలి. ఏఐ ఆధారిత మార్పుల మధ్య, మానవ నైపుణ్యం మరియు సాంకేతిక సాధనాల సమ్మేళనం ద్వారా భారతీయ వృత్తిపరులు తమ కెరీర్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లగలుగుతారు.

## వ్రతంలో పాడుతూనే పోషణ ఇచ్చే పెరుగు ప్రాముఖ్యత




వ్రతకాలంలో శక్తిని నిలుపుకోవడం కోసం సరైన ఆహారాన్ని ఎంచుకోవడం చాలా ముఖ్యం. పోషకమైనదైన పెరుగు (దయ్యి) మీ వ్రత భోజనంలో భాగం అయితే శరీరానికి శక్తినిచ్చే, జీర్ణాన్ని మెరుగుపరచే, మరియు మానసిక స్పష్టతను కలిగించే ఉత్తమ ఆహారంగా పనిచేస్తుంది. పెరుగు లో ఉండే ప్రొటీన్లు మరియు ప్రొబయోటిక్స్ శరీరానికి అవసరమైన శక్తిని సమకూర్చుతాయి. ఇది క్రమంగా జీర్ణమై ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. పెరుగు ప్రొబయోటిక్స్ మంచి బాక్టీరియాను పెంపొందించి జీర్ణ వ్యవస్థను మెరుగుపరచడమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. పెరుగు లో ఉండే తక్కువ పీహెచ్ స్థాయి ఎక్కువ మరిగిన ఆమ్లాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. శరీరంలో నీరు మరియు ఎలక్ట్రోలైట్ నష్టాన్ని పూడ్చేందుకు ఇందులో ఉండే నీటి శాతం, కాల్షియం, పొటాషియం వంటి ఖనిజాలు ఉపయోగపడతాయి. గోద్రెజ్ జెర్సీ పెరుగు వంటి ఘనమైన పెరుగు శరీరానికి తృప్తినివ్వడమే కాకుండా దీర్ఘకాలం తృప్తిగా ఉంచుతుంది. పెరుగు స్వభావంగా సాత్వికంగా ఉండటంతో శరీరం, మనస్సుకు సమతుల్యతను అందిస్తుంది. తద్వారా ఇది వ్రతకాలంలో ఆధ్యాత్మిక శాంతిని పొందడానికీ తోడ్పడుతుంది.




## అభిబస్ ఏఐ ఉత్సవ ప్రచారం, ప్రత్యేక డీల్స్

అభిబస్ సంస్థ దసరా మరియు దీపావళి సందర్భంగా "గ్రాండ్ ఫెస్టివ్ బస్ సేల్"ను ప్రారంభించింది. ఈ ప్రచారం ప్రత్యేకత ఏమిటంటే ం ఇది పూర్తిగా ఏఐ సాయంతో నిర్మించబడిన ప్రకటన కావడం. విజువల్స్ నుండి సంగీతం వరకు అన్నీ ఏఐ ద్వారా రూపొందించబడ్డాయి. కొత్త వినియోగదారులు పండుగ కోడ్ ఉపయోగించి మొదటి బుకింగ్‌పై 50% డిస్కౌంట్ (గరిష్ఠం ₹300) మరియు 50% క్యాష్‌బ్యాక్ (గరిష్ఠం ₹200) పొందగలుగుతారు. ఇప్పటికే ఉన్న వినియోగదారులకు కూడా 50% డిస్కౌంట్ (గరిష్ఠం ₹100) మరియు క్యాష్‌బ్యాక్ వర్తిస్తుంది. ఈ ఆఫర్ ప్రైవేట్ బస్సులపై మాత్రమే వర్తించు, ప్రతి రోజు మధ్యాహ్నం 12-2గం మరియు సాయంత్రం 6-8గం మధ్య వినియోగించవచ్చు. ప్రయాణ తేదీలు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 28 వరకు వర్తిస్తాయి.సంస్థ సిఓఓ రోహిత్ శర్మ ప్రకారం, అభిబస్ ఇప్పటికే మానవ శ్రమను తగ్గిస్తూ, మార్కెటింగ్ లో సమర్థత పెంచేలా ఏఐ టూల్స్ ను సమగ్రంగా ఉపయోగిస్తోంది. తాజా ఉత్సవ ప్రచారంతో పాటు గతంలో కూడ ఏఐ ఆధారిత స్వాతంత్ర్య దినోత్సవ వీడియోలు, ఓనమ్ బస్ సేల్ వంటి ప్రత్యేక ప్రచారాలు నిర్వహించి వినియోగదారులకు ప్రేరణనిచ్చింది. ఏఐ టెక్నాలజీతో కూడిన ఈ ప్రచారాలు అధిక ప్రభావం కలిగించడమే కాకుండా, దేశీయ ప్రయాణాన్ని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.
ఈ ప్రచారంలో వినియోగదారులకు అందిస్తున్న ఆఫర్లు మాత్రమే కాకుండా, అభిబస్ వినూత్న మారు మార్గాలను అన్వేషించడంలో ముందున్నారు అనే విషయం స్పష్టమవుతుంది. సంప్రదాయ ప్రకటనలకు భిన్నంగా, ఏఐ ఆధారిత ప్రచారంతో సమయాన్ని, ఖర్చును పొదుపుచేసి వేగంగా మార్కెట్‌లో ప్రవేశించడం సంస్థకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఈ విధానంతో అభిబస్ తక్కువ వ్యయంతో అధిక ప్రభావాన్ని సాధించడమే కాకుండా, యువ ప్రయాణికులను ఆకర్షించడంలోను విజయవంతమవుతోంది.

### ఫోన్‌పే, మాస్టర్‌కార్డ్ భాగస్వామ్యంతో ట్యాప్ - పే ప్రారంభం

భారతదేశంలో డిజిటల్ లావాదేవీల పెరుగుతున్న వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని, ఫోన్‌పే మరియు మాస్టర్‌కార్డ్ సంయుక్తంగా "ట్యాప్ - పే" సదుపాయాన్ని ప్రారంభించాయి. ఈ కొత్త ఫీచర్‌తో, మాస్టర్‌కార్డ్ కార్డ్‌దారులు తమ ఎన్‌ఎఫ్‌సీ సదుపాయం ఉన్న ఆండ్రాయిడ్ ఫోన్‌లను పాయింట్ ఆఫ్ సేల్ టెర్మినల్స్ వద్ద ట్యాప్ చేయడం ద్వారా కాంటాక్ట్‌లెస్ చెల్లింపులు చేయగలుగుతారు. వినియోగదారులు ఫోన్‌పే యాప్‌లో తమ క్రెడిట్, డెబిట్, ప్రీపెయిడ్ కార్డులను ఒకసారి సేవ్ చేస్తే, భద్రమైన టోకనైజేషన్ టెక్నాలజీ ద్వారా లావాదేవీలు సులభంగా జరుగుతాయి. ఈ భాగస్వామ్యం భారతదేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా మాస్టర్‌కార్డ్ వినియోగదారులకు ట్యాప్ - పే సదుపాయాన్ని విస్తరించడంలో మైలురాయిగా నిలుస్తుంది. ఫోన్‌పేకు 618 మిలియన్ల వినియోగదారుల బలం ఉండగా, మాస్టర్‌కార్డ్ టోకనైజేషన్ నిపుణతతో ఈ సేవ మరింత సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉంటుంది. ఈ ఫీచర్‌ను దశలవారీగా అందుబాటులోకి తీసుకురానున్నారు.

### అప్నా.కో కొత్త 'సేఫ్టీ' ఫీచర్‌తో జాబ్ మోసాలకు చెక్




దసరా-దీపావళి హైరింగ్ సీజన్ నేపథ్యంలో, దేశంలో నకిలీ ఉద్యోగ ప్రకటనలు పెరుగుతున్న తరుణంలో, అప్నా.కో "అప్నా భద్రత" అనే ఏఐ ఆధారిత భద్రతా ఫీచర్‌ను ప్రారంభించింది. 2024లో ఒంటరిగా జాబ్ స్కామ్స్ వల్ల భారత్‌కు రూ.5,100 కోట్ల నష్టం వాటిల్లిందని ఐ4సీ పేర్కొంది. ఈ నేపథ్యంలో, అప్నా సేఫ్టీ 1.46 లక్షల మందికి పైగా రిక్రూటర్లను వెరిఫై చేయడం ద్వారా 45% మోసాలను అడ్డుకుంది. జీఎస్టీ, పాన్, సీఐఎన్, ఆధార్ ఆధారంగా కంపెనీలను పరిశీలించి, ఫోన్ నంబర్ ద్వారా రిక్రూటర్ వాస్తవతను నిర్ధారించే అవకాశం అప్నా యాప్ లేదా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది. అక్రమ రిక్రూటర్లను ఆటోమేటెడ్ స్కోరింగ్ ద్వారా బ్లాక్ చేయడం జరుగుతోంది. మోసపూరిత ఉద్యోగ ప్రకటనల్లో సాధారణంగా కనిపించే రెడ్‌ఫ్లాగ్‌లపై అప్నా యాప్ వెంటనే హెచ్చరిస్తుంది. ఇది ముఖ్యంగా ఫ్రెషర్స్‌కి ఎంతో ఉపయోగకరంగా మారింది. సిఇఒ నిర్మిత్ పారిఖ్ ప్రకారం, అప్నా యొక్క లక్ష్యం ం ప్రతి వ్యక్తికి భద్రతతో కూడిన, నమ్మదగిన ఉద్యోగ అవకాశాన్ని అందించడమే.

### సెల్లెకోర్, పూర్వికా భాగస్వామ్యంతో దక్షిణంలో భారీ విస్తరణ




భారతీయ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సెల్లెకోర్ గ్యాడ్జెట్లు, దక్షిణ భారతదేశపు అగ్రగామి ఎలక్ట్రానిక్స్ రిటైల్ సంస్థ పూర్వికా మొబైల్స్‌తో భాగస్వామ్యం ఏర్పరచుకుంది. తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో 470కి పైగా స్టోర్లు కలిగిన పూర్వికా, 2023-24లో ₹3,600 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. ఈ భాగస్వామ్యం ద్వారా సెల్లెకోర్ కు వార్షికంగా ₹150 కోట్ల ఆదాయం లాభపడనుండగా, మొత్తం దక్షిణ భారతదేశం నుంచి వచ్చే ఆదాయం ₹750 కోట్లకు చేరనుంది. స్మార్ట్ టీవీలు, వేర్‌బుల్స్, హోమ్ అప్లయన్సెస్, ఆడియో ఉత్పత్తులపై దృష్టి పెట్టిన సెల్లెకోర్, మేక్ ఇన్ ఇండియా లక్ష్యాన్ని అనుసరిస్తూ, దేశవ్యాప్తంగా తమ ఉత్పత్తులను విస్తరిస్తోంది. స్థోమత, ప్రాప్యత మరియు ప్రామాణికతను సమకాలీనంగా అందించాలన్నదే కంపెనీ దృష్టి అని ఎండీ రవి అగర్వాల్ తెలిపారు.

### ఉల్ట్రావియోలెట్ తిరుపతిలో కొత్త ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించింది



ప్రముఖ ఈవీ బ్రాండ్ ఉల్ట్రావియోలెట్, తిరుపతిలో తమ కొత్త ఎక్స్‌పీరియన్స్ సెంటర్ 'యూవీ స్పేస్ స్టేషన్'ను ప్రారంభించింది. ఎస్ఎన్ ఆటో భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం, ఎక్స్-47, ఎఫ్77 మాచ్ 2, ఎఫ్77 సూపర్ స్ట్రీట్ వంటి ప్రీమియం ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లను విక్రయించనుంది. ఇది టెస్ట్ రైడ్స్, సర్వీస్, నిజమైన స్పేర్ భాగాలు, ఆక్సెసరీస్ వంటి సేవలను ఒకే చోట అందిస్తుంది.ఎక్స్-47 మోడల్ ప్రపంచంలోనే తొలిసారి కెమెరా, రాడార్ ఫీచర్లతో కూడిన మల్టీ-టెరైన్ ఈవీ బైక్ కాగా, 323 కిమీ రేంజ్, 10.3కిలోవాట్ బ్యాటరీ, డ్యూయల్ ఛానల్ ఎబిఎస్, టైప్-సి మొబైల్ ఛార్జింగ్ వంటి అధునాతన ఫీచర్లను కలిగి ఉంది.ఉల్ట్రావియోలెట్ సిఇఒ నారాయణ సుబ్రమణ్యం మాట్లాడుతూ, "స్మార్ట్ సిటీగా తిరుపతి ఈవీ విప్లవానికి కీలక కేంద్రంగా మారుతోంది" అని అన్నారు. కంపెనీ ఇప్పటికే 26 నగరాల్లో తన ప్రాతినిధ్యం విస్తరించగా, త్వరలో విశాఖపట్నంలోనూ ఈవీ సెంటర్ ప్రారంభం కానుంది.ఎఫ్77, టెస్సెరాక్ట్, షాక్‌వేవ్ వంటి కొత్త ఉత్పత్తులతో ఉల్ట్రావియోలెట్, భారత్‌లో ప్రీమియం ఎలక్ట్రిక్ మోటార్‌సైకిళ్ల మార్కెట్‌ను మలుపు తిప్పే దిశగా సాగుతోంది.

### స్ప్రిపుల్ సీఈఓ డా. బూర వెంకటేశ్వర్లు కు జీ5 అచీవర్స్ అవార్డు




హైదరాబాద్: స్ప్రిపుల్ సాఫ్ట్‌వేర్ సీఈఓ డా. బూర వెంకటేశ్వర్లు గారు, చిన్న మరియు మధ్యస్థ ఉద్యోగరంగాల్లో చేసిన అసాధారణ కృషికి గుర్తింపుగా ప్రతిష్టాత్మక "జీ5 అచీవర్స్ అవార్డు 2025"ను అందుకున్నారు.ఈ అవార్డును భారత మాజీ రాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు చేతులమీదుగా అందుకోగా, డా. నాగేశ్వర రెడ్డి, శ్రీ కేటీఆర్, శ్రీ ఈటల రాజేందర్, శ్రీ తానికెళ్ల భరణి వంటి ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.25 సంవత్సరాల అంతర్జాతీయ ఐటీ అనుభవం కలిగిన డా. బూర, ఫార్చ్యూన్ 500 కంపెనీలకు (జ్యూరిచ్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, ఎరిక్సన్) ప్రాజెక్టులు విజయవంతంగా అందించారు. ప్రపంచ వేదికలైన లీపు (సౌదీ) మరియు గిటెక్స్ (యూరప్, దుబాయ్) లో భారత్‌ను ప్రతినిధిగా ప్రాతినిధ్యం వహించారు.స్ప్రిపుల్ హెచ్‌ఆర్‌ఎంఎస్ అనే ఆధునిక హెచ్‌ఆర్ - పేరోల్ ప్లాట్‌ఫామ్ ద్వారా రెస్టారెంట్లు, విద్యాసంస్థలు, హాస్పిటల్స్, ఆటోమె-ంబైల్ ఫ్యాక్టరీస్, కార్పొరేట్ సంస్థలకు సేవలు అందిస్తున్నారు.ఈ పురస్కారం తన వ్యక్తిగత ప్రయాణానికే కాక, ఎస్ఎంఈ రంగాన్ని టెక్నాలజీ ద్వారా ముందుకు నడిపించే స్ప్రిపుల్ లక్ష్యానికి సాక్ష్యమని డా. బూర అన్నారు.

### హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో బీమా క్విజ్‌లో దేశవ్యాప్త విజయం




భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ బీమా సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో నిర్వహించిన పదవ బీమా క్విజ్ జూనియర్ దేశవ్యాప్తంగా ది3,600 పాఠశాలల విద్యార్థులను చేరుకుని బీమా అవగాహనను విస్తృత స్థాయిలో వ్యాపించింది. ది7200 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ క్విజ్‌లో 45 శాతం మంది బాలికలు ఉండడం విశేషం. చిన్న పట్టణాలు, స్థానిక మాధ్యమ మరియు ప్రభుత్వ పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొనడం ద్వారా ఇది సమగ్ర కార్యక్రమంగా నిలిచింది. చివరకు ఆరు జట్లు గ్రాండ్ ఫినాలేకు అర్హత సాధించగా, వారణాసికి చెందిన సన్‌బీమ్ లహర్తారా విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలకు రూ.2.25 లక్షలు, రన్నరప్‌లకు నగదు బహుమతులు లభించాయి. అన్ని ఫైనలిస్టులకు రాష్ట్రపతి భవన్‌లో విహారయాత్ర ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు మరపురాని అనుభవం కలిగింది. బీమా క్విజ్ జూనియర్ ప్రస్తుతం ఒక ఉద్యమంగా మారి దేశ వ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడంలో ముందంజలో ఉంది.ఉత్సాహాన్ని మరింత పెంచుతూ, అన్ని ఫైనలిస్టులను రాష్ట్రపతి భవన్‌కు ఒక రోజు విహారయాత్రకు తీసుకెళ్లారు. భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ ల్యాండ్‌మార్క్‌లలో ఒకదానిలో వారికి మరపురాని అనుభవాన్ని అందించారు.

### సామ్‌సంగ్ గెలాక్సీ వేర్‌బుల్స్‌పై ప్రత్యేక తక్కువ ధరలు




సామ్‌సంగ్ కంపెనీ భారతదేశంలో పండుగల సందర్భంగా గెలాక్సీ వాచ్8 సిరీస్, గెలాక్సీ బడ్స్3 ఎఫ్ఈ, వాచ్ అల్ట్రా, గెలాక్సీ రింగ్ వంటి వేర్‌బుల్స్‌పై ప్రత్యేక తగ్గింపులను ప్రకటించింది. గెలాక్సీ వాచ్8పై రూ.15,000, బడ్స్3 ఎఫ్ఈపై రూ.4,000, వాచ్ అల్ట్రాపై రూ.18,000, గెలాక్సీ రింగ్‌పై రూ.15,000 వరకు తగ్గింపు లభిస్తుంది. ఈ ఆఫర్లు తక్షణ క్యాష్‌బ్యాక్ లేదా అప్‌గ్రేడ్ బోనస్ రూపంలో పరిమిత కాలానికి అందుబాటులో ఉంటాయి. అలాగే, వినియోగదారులకు 18 నెలల వరకు నో-కాస్ట్ ఈఎంఐ ఎంపిక కూడా ఉంది. శక్తివంతమైన ఆరోగ్య ఫీచర్లు, గూగుల్ జెమినీ, ఏఐ ఆధారిత శరీర సంబంధిత సూచనలు, నిద్ర విశ్లేషణ వంటి ఆధునిక సాంకేతికతలతో ఈ వేర్‌బుల్స్ అందుబాటులోకి వచ్చాయి. తాజా ధరలు: గెలాక్సీ బడ్స్3 ఎఫ్ఈ - రూ.8999, గెలాక్సీ రింగ్ - రూ.23999, గెలాక్సీ వాచ్ అల్ట్రా - రూ.41999, వాచ్8 సిరీస్ - రూ.22999 నుండి ప్రారంభం.గెలాక్సీ రింగ్ వర్కౌట్‌లను (నడక మరియు పరుగు) స్వయంచాలకంగా గుర్తించగలదు అలాగే వినియోగదారులకు వారి లక్ష్యాలను సాధించడానికి వారిని ప్రేరేపించడంలో నిష్క్రియ హెచ్చరికలను అందిస్తుంది.



"ఆయన జీవితం నాకు స్ఫూర్తినిచ్చింది - విశ్వాసం, ధైర్యం మరియు కార్యాచరణ కలిగిన వినయపూర్వకమైన వ్యక్తి."
- బరాక్ ఒబామా



"శాంతియుత పద్ధతుల ద్వారా గొప్ప విజయాలు సాధించవచ్చని గాంధీ ప్రపంచానికి నిరూపించాడు."
- దలైలామా



"గాంధీ లాంటి వ్యక్తికి జన్మనిచ్చిన భారతదేశం అదృష్టవంతురాలు, ఆయన జీవితం మరియు కృషి ఇప్పటికీ ప్రపంచానికి ఒక దీపస్తంభంగా ప్రకాశిస్తున్నాయి."
- జాన్ ఎఫ్. కెన్నెడీ

# దేశ నిర్మాణమే సంఘ్ ప్రధాన లక్ష్యం



- భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ ఆత్మ
- అలుపెరగని సేవలందిస్తున్న ఆర్ఎస్ఎస్
- పేదల జీవితాల్లో మార్పులకు ఆర్ఎస్ఎస్ కృషి చేస్తోంది
- ఆర్ఎస్ఎస్ శత వార్షికోత్సవాల్లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) మొదటి నుంచి దేశ నిర్మాణమనే ప్రధాన లక్ష్యంతోనే పనిచేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు. తన లక్ష్యాన్ని సాధించే దిశగా ఆర్ఎస్ఎస్ దీర్ఘకాలంగా నిబద్ధతతో ముందుకు సాగుతుండటం చాలా గొప్ప విషయమన్నారు. గత శతాబ్ద కాలంలో లెక్కలేనంత మంది జీవితాలకు దశను, దిశను చూపించి, వారిని బలోపేతం చేసిన ఘనత ఆర్ఎస్ఎస్‌దే అని ప్రధాని పేర్కొన్నారు. నదీతీరాల్లో మానవ నాగరికతలు విలసిల్లిన విధంగానే, ఆర్ఎస్ఎస్‌లో సంగమించి, దాని ప్రవాహ స్రవంతిలో మమేకమై ఎంతో మంది వికసించారని తెలిపారు. దేశ రాజధాని దిల్లీలో నిర్వహించిన ఆర్ఎస్ఎస్ శత వార్షికోత్సవాల్లో మోదీ ప్రసంగించారు. పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు ఆర్ఎస్ఎస్ కృషి చేస్తోందన్నారు. అసత్యంపై సత్యం, అన్యాయంపై న్యాయం, అధర్మంపై ధర్మం గెలుస్తుందన్నారు. 'నది తన ప్రవాహంతో అనేక భూముల్లో పచ్చదనం పెంచుతుంది. నదీ ప్రవాహంలా ఆర్ఎస్ఎస్ కూడా ప్రజలకు సేవ చేస్తోంది. విద్య, వైద్యం, రైతులకు అనేకవిధాలుగా సంఘ్ సేవలు అందిస్తోంది. మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తోంది. ఆర్ఎస్ఎస్ చేసే ప్రతి పనిలో నేషన్ ఫస్ట్ అనేది కన్పిస్తోంది. గతంలో సంస్థ స్ఫూర్తిని అణచివేసేందుకు తప్పుడు కేసులు బనాయించడం, నిషేధించడం వంటి అనేక ప్రయత్నాలు జరిగాయి. అయినా ఆర్ఎస్ఎస్ అన్నింటినీ తట్టుకొని నిలబడింది' అని మోదీ పేర్కొన్నారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన ఒక పోస్టల్ స్టాంపును, రూ.100 నాణేన్ని విడుదల చేశారు. 1963లో రిపబ్లిక్ డే పరేడ్‌లో ఆర్ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహించిన మార్చ్ ఫొటోతో ఆర్ఎస్ఎస్ శత వార్షికోత్సవ స్మారక స్టాంపును రూపొందించడం ఆనందకర అంశమని ప్రధాని తెలిపారు. భారతమాత ఫొటోతో తొలిసారిగా ఒక నాణేన్ని విడుదల చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. వరద్ ముద్రలో సింహంపై కూర్చున్న భారతమాతకు స్వయం సేవకులు శిరస్సు వంచి నమస్సులు చేస్తుండటం రూ.100 కాయిన్‌పై ప్రింట్ చేశారని మోదీ పేర్కొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ ఆత్మ

భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ ఆత్మ అని, ఒకవేళ ఈ మూల సూత్రమే దెబ్బతింటే భారత్ బలహీనపడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఆర్ఎస్ఎస్ బలంగా నిలబడిందని, అలుపెరగకుండా దేశానికి సేవలు అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. దేశ సేవ, సామాజిక సాధికారత కోసం ఆర్ఎస్ఎస్ వాలంటీర్లు ఎనలేని త్యాగాలు చేశారని చెప్పారు. సమాజంలోని విభిన్న వర్గాల అభ్యున్నతి కోసం ఆర్ఎస్ఎస్ పనిచేస్తోందని, దేశ నిర్మాణం అనే ప్రధాన లక్ష్యంతో పనిచేస్తున్నందు వల్లే ఈ దిశగా పనిచేసే క్రమంలో ఎలాంటి వైరుధ్యాలూ రావడం లేదని ప్రధాని చెప్పారు. ఆర్ఎస్ఎస్ పరిధిలో ఎన్నో అనుబంధ సంస్థలు, సంఘాలు ఉన్నాయని, కేవలం 'నేషన్ ఫస్ట్' లక్ష్యం కోసమే అవన్నీ ఏకమై పనిచేస్తున్నాయని తెలిపారు. 'ఒక భారత్, గొప్ప భారత్' అనే అంశాన్ని ఆర్ఎస్ఎస్ నమ్ముతుందని, అయినప్పటికీ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాతి కాలంలో ఈ సంస్థను జాతీయ స్థాయిలో కనిపించకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేశారని తెలిపారు.





కేబీ హెడ్గేవార్ పాద పద్మాలకు నా నివాళులు

"సరిగ్గా 100 ఏళ్ల క్రితం విజయదశమి పండుగ రోజునే ఆర్ఎస్ఎస్ ఏర్పాటైంది. రేపు మనమంతా విజయదశమిని జరుపుకోబోతున్నాం. చెడుపై మంచి గెలుపునకు, అన్యాయంపై న్యాయం విజయానికి, చీకట్లను చీల్చే వెలుగు తేజానికి ప్రతీక ఈ పండుగ. ఇలాంటి గొప్ప, సమున్నత లక్ష్యాలతోనే ఆర్ఎస్ఎస్ ఆనాడు ఆవిర్భవించింది. శతాబ్దాల తరబడి బ్రిటీష్ వారి బానిస సంకెళ్లలో దేశం బందీగా ఉన్నందువల్ల భారతీయుల ఆత్మ గౌరవం, ఆత్మ విశ్వాసం తగ్గిపోయాయి. దేశ ప్రజల్లో వీటిని మళ్లీ పెంచేందుకు ఆర్ఎస్ఎస్ చాలా పని చేసింది. భారతీయుల ఆలోచనల నుంచి ఆత్మన్యూనతా భావాన్ని పారదోలేందుకు ఈ సంస్థ ఎంతో కృషి చేసింది. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు కేబీ హెడ్గేవార్ పాద పద్మాలకు వినమ్రమైన మనస్సుతో నివాళులు అర్పిస్తున్నాను. ఆయనే మాకు రోల్ మోడల్. స్ఫూర్తి ప్రదాత. కేబీ హెడ్గేవార్ ఆరాధనీయుడు. ఆర్ఎస్ఎస్ 100 ఏళ్ల వేడుకల్లో భాగమయ్యే అవకాశం దక్కడం మా తరం ఆర్ఎస్ఎస్ వాలంటీర్ల అదృష్టం. ఈ సందర్భంగా దేశ సేవకు అంకితమైన లక్షలాది ఆర్ఎస్ఎస్ వలంటీర్లకు నా అభినందనలు" అని ప్రధాని మోదీ తెలిపారు.

# మల్లికార్జున ఖర్గేకు అస్వస్థత

- గుండెకు పేస్‌మేకర్
- బెంగళూరులోని ఎంఎస్ రామయ్య ఆస్పత్రిలో చేర్పించిన కాంగ్రెస్ వర్గాలు
- ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు ప్రకటించిన వైద్యులు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జు ఖర్గే అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర జ్వరం, స్వల్ప శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్న ఖర్గేను బెంగళూరులోని ఎంఎస్ రామయ్య ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం వైద్యులు ఆయనకు చికిత్సను అందిస్తున్నారని, ఆందోళన చేందాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నేత తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు చెప్పారు. శ్వాస సంబంధ సమస్యలు, జ్వరం కారణంగా ఆయనకు గుండె వేగం తగ్గకుండా ఉండేందుకు పేస్‌మేకర్‌ను అమర్చాలని వైద్యులు సూచించినట్లు ఆయన కుమారుడు ప్రియాంక్ ఖర్గే వెల్లడించారు. అందుకోసమే ఆస్పత్రిలో చేర్పించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని పేర్కొన్నారు. గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం జనరల్ వార్డులో విశ్రాంతి తీసుకుంటున్న ఖర్గేను సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు పరామర్శించారు.

వరద బాధితలకు పరిహారంపై ఆందోళన

మంగళవారం పార్టీ కార్యకలాపాల్లో మల్లికార్జున ఖర్గే చరుకుగా పాల్గొన్నారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నష్టంపై సమీక్ష నిర్వహించారు. వరద బాధితులకు పరిహారం కోసం ప్రధానికి లేఖ రాస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఆయనను ఆస్పత్రికి తరలించారు.

ఇక అక్టోబర్ 7న మల్లికార్జున ఖర్గే నాగాలాండ్లో పర్యటించాల్సి ఉంది. సోలిడారిటీ పార్క్‌లో జరిగే ర్యాలీలో పాల్గొననున్నారు. ఈ ర్యాలీకి కనీసం 10,000 మంది ప్రజలు హాజరవుతారని కాంగ్రెస్ భావిస్తోంది. అలాగే రాష్ట్రంలోని వివిధ స్థాయిల నేతలతో కీలక భేటీలు కూడా ఉన్నాయి. ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో కాంగ్రెస్ కార్యకలాపాలకు ఖర్గే కీలకంగా వ్యవహరిస్తున్నారు. బిహార్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయన అనారోగ్యం ఆందోళన కలిగిస్తోంది. గత కొన్ని రోజులుగా పార్టీ కార్యక్రమాలు, సమావేశాలతో బిజీగా ఉన్న ఆయనకు విశ్రాంతి దొరకకపోవడంతోనే ఈ అస్వస్థత కలిగిందని వైద్యులు భావిస్తున్నారు.

ప్రస్తుతం బిహార్ ఎన్నికల ప్రచారాల్లో చరుకుగా పాల్గొంటున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఎన్డీఏ ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. బిహార్ ఎన్నికల్లోనూ ఓట్ల చోరీ ద్వారా గెలవాలని చూస్తున్నట్లు ఆరోపించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ ఓటు హక్కులను కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటీవల మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన పట్నాలోని సదాకత్ ఆశ్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఆ భేటీకి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్య నేతలు హాజరయ్యారు. స్వాతంత్ర్యం తర్వాత బిహార్‌లో సిడబ్యలూసి సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారి.

అయితే మన ఓటరు జాబితాను అధికారికంగా ట్యాంపర్ చేస్తున్న వేళ మన రాజ్యాంగాన్ని, ప్రజస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిజ్ఞ చేయాలని ఖర్గే సూచించారు. ఇలాంటి సమయంలో బిహార్‌లో సిబ్ల్యూసి సమావేశాన్ని నిర్వహించడం చాలా అవసరమని తెలిపారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ను బీజేపీ నాయకత్వం మానసికంగా పదవీ విరమణ చేసిందని ఖర్గే ఆరోపించారు. అది బాధ్యతగా భావిస్తుందని వ్యాఖ్యానించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు కేంద్రంలో మోదీ ప్రభుత్వ అవినీతి పాలన ముగింపునకు నాంది పలుకుతాయని పేర్కొన్నారు. ఇటీవల పట్నాలో జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రారంభోపన్యాసంలో పలు వ్యాఖ్యలు చేశారు.

# 20ఏళ్లుగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయని సీఎం

- బిహార్ సిఎం నీతీశ్‌కు భయమంటున్న విపక్షాలు
- తొలిసారి పోటీలో ఓటమే కారణమంటున్న సన్నిహితులు
- ఈ సారి కూడా నీతీశ్ పోటీ చేసే అవకాశం లేదన్న జేడీయూ వర్గాలు
- ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యే నే సిఎం కావాలంటున్న రాజకీయ నిపుణులు



పట్నా : బిహార్ సీఎంగా 2005 నుంచి జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ కొనసాగుతున్నారు. 2014-15 మధ్య కొన్ని నెలలు మినహా మిగతా 20 ఏళ్లు బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై ఆయనే కూర్చున్నారు. కానీ ఆయన రెండు దశాబ్దాల కాలంలో ఒక్క ఎన్నికలోనూ పోటీ చేయలేదు. ఎమ్మెల్సీగా ఎన్నికై సీఎం పీఠాన్ని అధిరోహిస్తున్నారు. మరికొద్ది నెలల్లో బిహార్లో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ సారి కూడా నీతీశ్ పోటీ చేసే అవకాశం లేదు. దీంతో సీఎం నీతీశ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి భయపడుతున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అలాగే ముఖ్యమంత్రి పదవి చేపట్టబోయే వ్యక్తిని ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో నీతీశ్ అసెంబ్లీ ఎన్నికల బరిలో ఎందుకు దిగడం లేదు? తన రాజకీయ జీవితంలో ఎప్పుడైనా ఎమ్మెల్యేగా గెలిచారా? విపక్షాలు ఆరోపిస్తున్నట్లు ఎలక్షన్లో పోటీకి భయపడుతున్నారా?

తొలిసారే ఎదురుదెబ్బ

లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ చేపట్టిన ఉద్యమం ద్వారా విద్యార్థి రాజకీయాల్లోకి ప్రవేశించారు నీతీశ్ కుమార్. పట్నా ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఇంజినీరింగ్ డిగ్రీని పొందారు. ఆ తర్వాత విద్యుత్ శాఖలో కొంతకాలం పనిచేశారు. ఆపై ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన మొదట 1977లో జనతా పార్టీ టికెట్పై హర్నాట్ నియోజకవర్గం నుంచి పోటీ చేయగా ఓడిపోయారు. 1980లో అదే స్థానంలో పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 1985లో లోక్దళ్ టికెట్పై పోటీ చేసి తొలిసారి జయకేతనం ఎగురవేశారు. 1985 తర్వాత ఆయన ఎప్పుడూ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. అయితే, లోక్సభ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రి కూడా అయ్యారు.

లోక్సభ ఎన్నికల్లో జయకేతనం

నీతీశ్ కుమార్ తొలిసారి 1989 సార్వత్రిక ఎన్నికల్లో బార్లోక్ సభ స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. ఆ తరువాత 1991, 1996, 1998, 1999లో అదే స్థానం నుంచి జయకేతనం ఎగురవేశారు. 2004లో ఆయన బార్, నలంద అనే రెండు లోక్ సభ స్థానాల్లో పోటీ చేశారు. బార్లో ఓడిపోగా, నలందలో గెలిచారు. 2004 తర్వాత నీతీశ్ లోక్సభ లేదా అసెంబ్లీ ఎన్నికల్లోనూ పోటీ చేయలేదు. మొత్తం తొమ్మిది ఎన్నికల్లో పోటీ చేసిన నీతీశ్ ఆరింట్లో గెలిచి, మూడింట్లో ఓటమి చవిచూశారు. మూడుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఒకసారి విజయం సాధించారు. ఆరు లోక్సభ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిసారి గెలిచారు. 2004లో రెండు సీట్లలో పోటీ ఒక చోట ఓడిపోయారు.

'సీఎం ప్రజల నుంచి ఎన్నికైతే మంచిది'

ప్రజాస్వామ్యంలో పార్లమెంటు ఉభయ సభలు ముఖ్యమైనవని రాజకీయ నిపుణుడు అరుణ్ పాండే తెలిపారు. ముఖ్యమంత్రి ప్రజల నుంచి ఎన్నికైతే మంచిదని అభిప్రాయపడ్డారు. కానీ ఇప్పుడు ఒక సంప్రదాయం స్థిరపడిపోయిందన్నారు. బీజేపీ నేత సుశీల్ కుమార్ మోదీ చాలా కాలం బిహార్ ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారని, కానీ ఆయన ఎప్పుడూ శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయలేదన్నారు. శాసనమండలి సభ్యుడిగా ఉండి డిప్యూటీ సీఎంగా కొనసాగారని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ పదేళ్లు ప్రధానమంత్రిగా పనిచేశారని, ఆయన కూడా నేరుగా ఎన్నికల్లో పోటీ చేయకుండా రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారని గుర్తు చేశారు.

'ఆయన పేరు మీదే అనేక మంది అభ్యర్థులు గెలుపు, కానీ'

"ప్రస్తుతం, నీతీశ్ కుమార్తో పాటు బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి కూడా శాసన మండలి సభ్యుడు. అనేక మంది ప్రముఖ నాయకులు ఎన్నికలలో పోటీకి దూరంగా ఉన్నారు. ఎందుకంటే వారి ఎన్నిక చాలా కష్టమవుతోంది. నీతీశ్ కుమార్ దీనిని అర్థం చేసుకుని ఎమ్మెల్సీగా ఎన్నికై సీఎం అవుతున్నారు. అనేక అసెంబ్లీ నియోజకవర్గాలలో జేడీయూ అభ్యర్థులు నీతీశ్ కుమార్ పేరు మీదనే ఎన్నికలలో గెలుస్తారు." అని రాజకీయ నిపుణుడు అరుణ్ పాండే తెలిపారు.

ముఖ్యమంత్రి ప్రజల ప్రతినిధిగా ఉండాలని, కానీ నీతీశ్ కుమార్ శాసన మండలి ద్వారా సీఎం అవుతున్నారని రాజకీయ నిపుణుడు ప్రవీణ్ బాగి తెలిపారు. నీతీశ్ కుమార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతానని భయపడుతున్నారని ప్రవీణ్ బాగి ఆరోపించారు. 1977లో జనతా పార్టీ వేవ్ ఉన్న సమయంలో కూడా నీతీశ్ తన సొంత జిల్లాలో ఓడిపోయారని గుర్తు చేశారు. 1980 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా నీతీశ్ ఓటమిపాలయ్యారని చెప్పారు. 1985లో ఆయన గెలిచినా, మొదటి రెండు ఎన్నికల్లో ఓడిపోవడం వల్ల ఆ భయం ఇంకా నీతీశ్ లో కొనసాగుతోందన్నారు.

" చాలా మంది ముఖ్యమంత్రులు ఎన్నికలలో పోటీ చేసి గెలిచి సీఎం పీఠాన్ని అధిరోహిస్తారు. కొంతమంది ముఖ్యమంత్రులు మాత్రమే ఎమ్మెల్సీ అయ్యి సీఎం అవుతారు. ఇది రాజ్యాంగం ప్రకారం సబబే. కానీ ప్రజాస్వామ్య దృక్పథంలో ఇది సరైనదిగా ఉండదు. ప్రజలచే ఎన్నికైన తర్వాతే ముఖ్యమంత్రి కావాలనేది ఆరోగ్యకరమైన సంప్రదాయం. ఈ సంప్రదాయం చాలా చోట్ల ఉల్లంఘనకు గురవుతోంది. ప్రజలు ఎన్నుకోకుండా సీఎం అయ్యివారిలో నీతీశ్ కుమార్ ఒకరు. ఈసారి జరగబోయే ఎన్నికల్లో కూడా నీతీశ్ కుమార్ పోటీ చేయకపోవడం ఖాయంగా కన్పిస్తోంది. " అని ప్రవీణ్ బాగి పేర్కొన్నారు.

జేడీయూ వివరణ

నీతీశ్ కుమార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకపోవడంపై జేడీయూ పార్టీ నాయకులు పదేపదే వివరణలు ఇచ్చారు. అయినా ఆయన ఎన్నికల్లో పోటీ చేయకపోడం విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఇదే విషయంపై జేడీయూ అధికార ప్రతినిధి నిహోరా యాదవ్ స్పందించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయడం లేదని తాము ఒకసారి నీతీశ్ కుమార్ను అడిగామని యాదవ్ తెలిపారు. తాను ఎన్నికల బరిలోకి దిగితే ఇతర నియోజకవర్గాలపై దృష్టిపెట్టలేనని నీతీశ్ చెప్పారన్నారు. "1985లో నీతీశ్ హర్నాట్ స్థానం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు, నామినేషన్ వేసిన తర్వాత ఆయన తన నియోజకవర్గంలో ప్రచారం కూడా చేయలేదు. ఆ తర్వాత ప్రజలు ఆయనను ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని ప్రతిపక్షాలు గుర్తుంచుకోవాలి." అని నిహోరా యాదవ్ పేర్కొన్నారు.

నీతీశ్ బిహార్కు తొలిసారి సీఎం ఎప్పుడు అయ్యారు?

నీతీశ్ కుమార్ 2000లో తొలిసారిగా బిహార్ ముఖ్యమంత్రి అయ్యారు. కానీ మెజారిటీ లేకపోవడంతో ఏడు రోజుల్లోనే సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆయన 2005 నవంబర్లో రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2010లో మూడోసారి సీఎం పీఠాన్ని అధిరోహించారు. 2014 లోక్సభ ఎన్నికల్లో జేడీయూ ఘోర ప్రభావానికి బాధ్యత వహిస్తూ ఆయన సీఎం పదవి నుంచి దిగిపోయారు. జితన్ రామ్ మాంఝీని ముఖ్యమంత్రిని చేశారు. కానీ 2015లో మాంఝీని సీఎం పీఠంపై నుంచి దించి నాలుగో సారి ముఖ్యమంత్రిగా నీతీశ్ బాధ్యతలు చేపట్టారు.

## పరిశోధనలను విస్మరించలేం

- రక్షణరంగంలోఅభివృద్ధి బలోపేతం
- త్వరలో వినూత్న పర్యావరణ వ్యవస్థ ఆవిష్కరణ
- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ : భారతదేశ రక్షణరంగంలో పరిశోధన, అభివృద్ధిని బలోపేతం చేయడానికి ఒక వినూత్న పర్యావరణ వ్యవస్థను పెంపొందించనున్నట్లు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. డిఫెన్స్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ 278వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత యుద్ధాల్లో ఆధునిక సాంకేతికత బాగా పెరిగిందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ఇది మనకు ఆందోళన కలిగించే విషయమన్నారు. కొత్తగా వస్తున్న సాంకేతికతలు ఏళ్లతరబడి పరిశోధన, అభివృద్ధి ఆధారంగా రూపొందించినవన్నారు. దీన్ని మనం కూడా అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన చుట్టూ ఉన్న పరిస్థితులు మారిపోతున్నాయని, భద్రతా అవసరాలు పెరిగిపోయాయని వ్యాఖ్యానించారు. అందుకే రక్షణ బడ్జెట్ కూడా ఏటా పెరుగుతుందని తెలిపారు. బడ్జెట్ పెరుగుదలతో దాన్ని తెలివిగా ఉపయోగించాల్సిన బాధ్యత రెట్టింపు అయ్యిందన్నారు. ఈ సందర్భంగా సాంకేతిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మన సాంకేతికత వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు నిధులు పెంచుతున్నట్లు తెలిపారు.

# మలేషియాలో మోడీ, ట్రంప్ భేటీ?



న్యూఢిల్లీ : అమెరికా, భారత్ మధ్య సుంకాల యుద్ధం నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య సమావేశం జరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల చివర్లో మలేషియా కౌలాలంపూర్‌లో జరగనున్న ఆసియాన్ శిఖరాగ్ర సమావేశంలో ఇరువురు నేతలు కలిసే అవకాశం ఉంది. అక్టోబర్ 26-27 తేదీల్లో 47వ ఆసియాన్ సదస్సు కోసం మోడీ మలేషియా వెళ్లనున్నారు. ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా ట్రంప్‌కు ఆహ్వానం పంపింది. ట్రంప్ ఈ ఆహ్వానాన్ని ఒప్పుకుంటే, అమెరికా భారత్‌పై 50 శాతం సుంకాలను విధించిన తర్వాత ఇద్దరు నేతల మధ్య ఇదే తొలి భేటీ అవుతుంది. ట్రంప్ సుంకాల కారణంగా భారత్ అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందనే కారణంగా, ఈ డబ్బును రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో వినియోగిస్తుందని ఆరోపిస్తూ భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాలు విధించింది. ఇందులో 25 శాతం పరస్పర సుంకాలు కాగా, మరో 25 శాతం శిక్షార్హమైన సుంకంగా అమెరికా అభివర్ణించింది.

# పుతిన్ భారత పర్యటన ఖరారు..?

డిసెంబర్ 5-6 తేదీల్లో పర్యటించే అవకాశం..



న్యూఢిల్లీ : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన ఖరారు అయినట్లు తెలుస్తోంది. డిసెంబర్ 5-6 తేదీల్లో ఆయన భారత్‌లో పర్యటించే అవకాశం ఉంది. రష్యా చమురు కొనుగోలుపై అమెరికా భారత్‌పై సుంకాలు విధించిన తర్వాత, రష్యా-భారత్ సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయి. ఈ నేపథ్యంతో పుతిన్ పర్యటనలో ఇరు దేశాల మధ్య మరిన్ని ఒప్పందాలు జరిగే అవకాశం కనిపిస్తోంది. ఆగస్టుల నెలలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మాస్కో పర్యటన సందర్భంగా, మొదటి సారిగా పుతిన్ పర్యటన గురించి ప్రకటించారు. అయితే, ఆ సమయంలో పర్యటన తేదీలు ఖరారు కాలేదు. ఇటీవల చైనా వేదికగా జరిగిన షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోడీ, పుతిన్ ఇద్దరు గంటకు పైగా సంభాషించారు. ప్రస్తుతం, వాణిజ్య యుద్ధంలో భాగంగా, రష్యన్ చమురు కొనుగోలు చేస్తున్నామనే ఆరోపణలతో అమెరికా భారత్‌పై ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 50 శాతం సుంకాలను విధించారు. ఈ నేపథ్యంలో పుతిన్ పర్యటన ఆసక్తికరంగా మారింది. ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ చర్య సహకరిస్తుందని అమెరికా ఆరోపిస్తోంది. అయితే, తమ పౌరుల ఇంధన భద్రతకు కట్టుబడి ఉన్నామని, రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటామని ఇండియా స్పష్టం చేసింది.

# టివికే చీఫ్ విజయ్ రాష్ట్ర పర్యటన వాయిదా

- కరూర్ తొక్కిసలాట ఘటన నేపథ్యంలో కీలక నిర్ణయం
- పబ్లిక్ మీటింగ్‌లు రెండు వారాల పాటు వాయిదా



చెన్నై: తమిళ నటుడు, టీవీకే అధినేత విజయ్ తన రాష్ట్రవ్యాప్త పర్యటనను వాయిదా చేసుకున్నారు. కరూర్ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది దుర్మరణం పాలై తమిళనాడులో విషాద చాయలు అలుముకున్న వేళ విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నారని పార్టీ ప్రధాన కార్యాలయం తెలిపింది. చాలామంది తమ ఆత్మీయులను కోల్పోయి దుఃఖంలో ఉన్న ఈ పరిస్థితుల్లో పార్టీ అధినేత విజయ్ రాష్ట్రవ్యాప్తంగా పబ్లిక్ మీటింగ్లను రెండు వారాల పాటు వాయిదా వేసుకున్నట్లు ఎక్స్లో పోస్టుచేసింది. పార్టీ నాయకుడు అంగీకరించిన తర్వాత పబ్లిక్ మీటింగ్లకు సంబంధించిన వివరాలను ప్రకటిస్తామని టీవీకే ప్రధాన కార్యాలయం సచివాలయం తెలిపింది.

నన్ను ఏమైనా చేసుకోండి!

కరూర్‌లో తొక్కిసలాట నేపథ్యంలో మంగళవారం టీవీకే అధినేత విజయ్ ఓ వీడియో విడుదల చేసిన విషయం తెలిసిందే. అందులో తొక్కిసలాట ఘటనతో తన హృదయం పూర్తిగా బాధతో నిండిపోయిందని అన్నారు. తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోలేదన్నారు. అంతేకాదు ఈ ఘటనలో తమ తప్పిదమేమీ లేకపోయినా డీఎంకే సర్కార్ తమపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని ఆయన విమర్శించారు. స్టాలిన్ ప్రభుత్వానికి ప్రతీకార వాంఛ ఉంటే తనను ఏమైనా చేసుకోవచ్చన్నారు. తమ పార్టీ నేతలను టార్గెట్ చేయొద్దని ప్రభుత్వాన్ని కోరారు. కరూర్ జిల్లాకు చెందిన టీవీకే నేతలపై పోలీసులు కేసులు పెట్టిన నేపథ్యంలో విజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "కరూర్ ఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. నాపై అమిత ప్రేమతో ప్రజలు ర్యాలీకి వచ్చారు. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. త్వరలోనే కరూర్ వెళ్లి బాధితులను పరామర్శిస్తాను. వాస్తవానికి మేము ఏ తప్పు చేయకపోయినా, మాపై కేసులు పెట్టారు. నిజం త్వరలోనే బయటపడుతుంది. వాస్తవానికి ఏం జరిగిందనేది ప్రజలకు తెలుసు. కరూర్ ప్రజలు నిజం చెప్పినప్పుడు, దేవుడే వచ్చి నిజం చెప్పినట్లుగా ఉంది. వాస్తవానికి నేను ఇలాంటి పరిస్థితులను ఎప్పుడూ ఎదుర్కోలేదు. నా హృదయం ఆవేదనతో నిండిపోయింది." అన్నారు విజయ్

"సీఎం స్టాలిన్ మాపై ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్నారా? కావాలంటే నాపై ప్రతీకారం తీర్చుకోవచ్చు. నాపై కోపం, మా నాయకులపై చూపించవద్దు. మా నాయకులపై కేసులు పెడుతున్నారు. ఇది సరైంది కాదు. నేను ఇప్పటికే 5 జిల్లాల్లో ప్రచారం చేశాను. కానీ కరూర్లోనే ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది? నేను ర్యాలీ కోసం అన్ని జాగ్రత్తలు తీసుకున్నా, కానీ ఊహించని ఘటన జరిగింది. నేను ఎప్పుడూ ఎవరికీ అపకారం తలపెట్టలేదు. ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. ఇకపై మరింత బలంగా ప్రజల్లోకి వెళ్తాం." అని టీవీకే అధినేత విజయ్ అన్నారు.

రాజకీయ బలప్రదర్శన వల్లే తొక్కిసలాట! : మరోవైపు విజయ్ ఉద్దేశపూర్వక రాజకీయ బలప్రదర్శన వల్లే ఈ ఘటన జరిగిందని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. 'ర్యాలీ సెప్టెంబర్ 27 ఉదయం 9 గంటలకే ప్రారంభం కావాల్సి ఉంది. కానీ ఆలస్యమైంది. ఉదయం 11 గంటలకే భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చారు. మధ్యాహ్నం విజయ్ రావాల్సి ఉంది కానీ ఆయన సాయంత్రం ఏడు గంటలకు వచ్చారు. భారీ జనసందోహాన్ని చూపించేందుకే ఉద్దేశపూర్వకంగా ఆయన ఆలస్యంగా వచ్చారు. దానివల్ల ప్రజలు అలా ఎండలో నిల్చొని అలసిపోయారు. వారికి ఆహారం, నీళ్లు అందలేదు.

సూర్య
features@suryaa.com
కలర్స్ LIFE IS A RAINBOW
సూర్య
హైదరాబాద్
గురువారం
2 అక్టోబర్ 2025




# దసరా వచ్చిందయ్యా
# సరదా తెచ్చిందయ్యా



**తెలుగు వారు దసరాని పది రోజులు జరుపుకుంటారు. ముందు నవరాత్రులు దుర్గ పూజ ఉంటుంది. తెలంగాణాలోరాష్ట్ర పండుగ ఐన ఈ తొమ్మిది రోజులు అమావాస్య నుంచి నవమి వరకు బతుకమ్మ ఆడుతారు.బొమ్మల కొలువులు, బతుకమ్మ పాటలు, ప్రకృతి లో ఆటలు, అయ్యవార్లకిచ్చే అయిదు వరహాలు, పిల్లలకు పంచే పప్పు బెల్లాలు, పాలపిట్టను చూసేందుకు ఊరిబైటకి వెళ్ళటం, శమీచెట్టు దర్శనాలు, పరస్పర ఆలింగనలతో పంచుకునే 'బంగారాలు' అనే జమ్మి ఆకులూ, గంగిరెద్దులు, పులివేషాలు, డప్పులమోతలు, సాముగరిడీలు....దసరా చిహ్నాలు.**

**:రాజరాజేశ్వరీ దేవి ప్రార్థనా శ్లోకం:**
**"అంబారౌద్రిణి భద్రకాళి బగళా**
**జ్వాలాముఖీవైష్ణవీ బ్రహ్మణీత్రిపురాంతకీ**
**సురనుతాదేదీప్యమానోజ్జ్వలాచాముండాశ్రిత**
**రక్షపోషజననీ దాక్షాయణీ పల్లవి చిద్రూపి**
**పరదేవతా భగవతీ శ్రీరాజరాజేశ్వరీ"**

### సవాళ్లను అధిగమిస్తూ కొత్త విజయాలు సాధించడమే....
### దసరా పండుగ అంతరార్థం

దసరా హిందువుల ముఖ్యమైన పండుగ. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు పదవ రోజు విజయ దశమి కలసి దసరా అంటారు. ఇది ముఖ్యముగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. ఈ పండుగను నవరాత్రి, శరన్నవరాత్రి అనీ అంటారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కనుక ఈ పేరు వచ్చింది. కొందరు ఈ పండుగకు మొదటి మూడు రోజులు పార్వతిదేవికి తరువాతి మూడు రోజుల లక్ష్మీ దేవికి తరువాతి మూడురోజులు సరస్వతి దేవికి పూజలు నిర్వహిస్తారు. ముఖ్యముగా శాక్తేయులు దీనిని ఆచరిస్తారు. బొమ్మల కొలువు పెట్టడం ఒక ఆనవాయితీ. ఆలయాలలో అమ్మవారికి ఒక్కోరోజు ఒక్కో అలంకారంచేస్తారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయాలకు క్యూ కట్టిన భక్తులు.. చల్లని చూపుల తల్లి కరుణ కోసం పూజలు చేస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఇక భవాని దీక్షాపరులు దుర్గ నవరాత్రుల్లో భాగంగా చివరి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు



విజయదశమి రోజున చరిత్ర ప్రకారం రాముడు రావణుని పై గెలిచిన సందర్భమే కాక పాండవులు వనవాసం వెళ్తూ జమ్మి చెట్టు పై తమ ఆయుధాలను తిరిగి తీసిన రోజు. ఈ సందర్భమున రావణ వధ, జమ్మి ఆకుల పూజా చేయటం కూడ ఆనవాయితీ .

**పురాణ నేపథ్యం:** దుర్గాదేవి మహిషాసురుడితో తొమ్మిది రాత్రులు యుద్ధం చేసి అతడిని వధించింది. ఈ సందర్భంగా ప్రజలంతా సంతోషంతో పండగ జరుపుకున్నారు. అదే విజయదశమి. దేవీ పూజ ప్రాధాన్యత ఈశాన్య భారతదేశంలో అధికంగా ఉంటుంది దేశంలోని తూర్పు, ఈశాన్య ప్రాంతాలైన బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో దసరా వేడుకల్ని పార్వతీదేవి పుట్టింటికి రావడంగా జరుపుతారు. తమ ఇంటికి వచ్చిన ఆడపడుచును సప్తమి, అష్టమి, నవమి రోజుల్లోఅర్చించిదశమినాడుసాగనంపుతారు . ఆ సందర్భంగా స్త్రీలు పాడే పాటల్ని 'ఆగమ గీతికలు' అంటారు. గుజరాతులో దసరాకు దాండియా నృత్యం చేయడం సంప్రదాయం. విజయదశమి రోజున పాలపిట్ట కనిపిస్తే అదో శుభశకునం, ఇక భవిష్యత్తులో అంతా శుభమే జరుగుతుందని చాలా మంది బలంగా నమ్ముతారు. రాముడు విజయదశమి నాడే అపరాజితా దేవిని పూజించి, రావణుని సహరించాడు. తెలంగాణలో శమీపూజ అనంతరం 'పాలపిట్ట'ను చూసే సంప్రదాయం ఉంది. విజయదశమి రోజు సాయంత్రం నక్షత్ర దర్శనం అనంతరం శమీవృక్షం వద్ద అపరాజితాదేవిని పూజించి 'శమీ శమయతే పాపం శమీశత్రు నివారిణీ, అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శినీ' అనే ఈ శ్లోకం స్మరిస్తూ చెట్టుకు ప్రదక్షిణలు చేస్తారు..శమి అంటే పాపాల్ని, శత్రువుల్ని నశింపజేసేది.



ఈ శ్లోకం రాసుకున్న చీటీలు ఆ చెట్టు కొమ్మలకు తగిలిస్తారు. ఇలా చేయడం వల్ల అమ్మవారి కృప, శనిదోష నివారణ జరుగుతుందని ప్రతీతి. హిందూ పురాణాల ప్రకారం రావణాసురుడిని చంపేందుకు వెళ్లిన శ్రీరాముడికి విజయదశమి నాడు పాలపిట్ట ఎదు-రవుతుంది, ఆనాడు రాముడు దానిని శుభశకునంగా భావించాడని చెపుతారు, దసరా అంటేనే చెడుపై విజయానికి గుర్తు. ఇదే దసరా రోజున రావణాసు-రుణ్ని అంతమొందించి శ్రీరాముడు ఘన విజయం సాధించాడు. అలాగే రాక్షసుల రాజు మహిషాసురిడిని నేల కూల్చి%ొ% కాళికా మాత ఘన విజయం సాధించింది. ఇలాంటి విజయాలకు ప్రతీకగా పాలపిట్టను సూచిస్తారు. ఆ పిట్ట కనిపిస్తే విజయం దక్కినట్లే. అందుకే%ొ% పండుగ నాడు పాలపిట్టను చూడాలి. అదృష్టంగా భావించాలని చెబుతరు.. అందుకే ఈ రోజు ఏదైనా కొత్త విద్యలు నేర్చుకోవాలనుకొనేవారు ఈ రోజు ప్రారంభిస్తే విశేషంగా లాభిస్తుంది. శమీ చెట్టు యొక్క పూజ ఈ రోజు విశేషంగా లాభిస్తుంది. జమ్మి చెట్టును పూజించడం లక్ష్మీప్రదమని పురాణాలు చెబుతున్నాయి. శమీ వృక్షం సువర్ణ వర్షం కురిపిస్తుందని శాస్త్రాల్లో ఉంది. విజయదశమి రోజున పూజలు అందుకొన్న జమ్మి చెట్టు ఆకులను ఇంట్లోని పూజాస్థలంలో, ధన స్థానంలో నగదు పెట్టెల్లో ఉంచుతారు. దీనివల్ల ధనవృద్ధి జరుగుతుంది. పంచ పాండవులు అజ్ఞాత వాసానికి వెళ్ళే ముందు తమ ఆయుధాలని శమీ చెట్టుపై పెట్టడం జరిగింది.

ఈ రోజులలో వివిధ దేవుళ్ళ వేషధారణ చేసి ఇంటింటికి తిరిగి గృహస్తులు ఇచ్చినది పుచ్చుకోవడం కొందరు వృత్తిగా ఆచరిస్తారు. వీటికి దసరా వేషాలు లేదా పగటి వేషాలు అంటారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను వెంట పెట్టుకొని విద్యార్థుల అందరి ఇళ్ళకు వెళ్ళి మామూలు పుచ్చుకోవడం మామూలే. ఈ సమయంలో వెదురు కర్రతో చేసి రంగు కాగితాలతో అలంకరించిన బాణాలు విద్యార్థులు పట్టుకుని అయ్యవారి వెంట వస్తారు. విద్యార్థులు ఏదయా మీ దయా మామీద లేదు, ఇంత సేపుంచుటా ఇది మీకు తగునా ... అయ్యవారికి చాలు అయుదు వరహాలు, పిల్ల వాళ్ళకు చాలు పప్పు బెల్లాలు అంటూ రాగయుక్తంగా పాడుకుంటూ అయ్యవారి వెంట వస్తారు. గృహస్తులు అయ్యవారికి ధనరూపంలోనూ, పిల్ల వాళ్ళకు పప్పు బెల్లం రూపంలోనూ కానుకలు ఇస్తారు. సంవత్సర కాలంలో సేవలందిచిన వారు గృహస్తును మామూళ్ళు అడగటం వారు కొంత ఇచ్చుకోవడమూ అలవాటే. దీనిని దసరా మామూలు అంటారు. కొత్తగా వివాహం జరిగిన ఆడపడచుని భర్తతో సహా ఇంటికి ఆహ్వానించి అల్లుడికీ కూతురికీ తలంటి తలకు పోసి నూతనవస్త్రాలు కానుకలు ఇచ్చి సత్కరించడం కూడా అలవాటే.ప్రజల జీవన ఐకమత్యాన్ని అనురాగాన్ని చాటి చెబుతుంది. అందుకే దసరా పండుగ మానవ సంబంధాల మనుగడకు ప్రతీకగా అద్దంపట్టి నిలుస్తోంది అనుటలో అతిశయోక్తిలేదు.

దసరా ఉత్సవాలను దేశమంతా వివిధ రూపాలలో జరపుకుంటారు. మైసూరు, కలకత్తా, ఒడిషా, తెలంగాణా, విజయవాడ, ఖానాపూర్లలో ఒక్కో చోట ఒక్కో విధంగా జరుపుకుంటారు. ఇవే కాక ఊరి ఊరికీ కొన్ని ప్రత్యేక ఉత్సవాలు జరుపుకుంటారు. ఖానాపూర్, ఒంగోలులో కళారాలు రూపంలో అమ్మవారిని ఆరాధించి చివరి రోజున ఉత్సవంగా అమ్మవారు వెళ్ళి రాక్షససంహారం చేసే ఘట్టాన్ని ప్రదర్శిస్తారు.దసరానాడు ఆయుధాల్నీ, వాహనాల్నీ, వృత్తికి సంబంధించిన పరికరాల్నీ పూజించడం సంప్రదాయం. దీని వెనుక కూడా పౌరాణికకథ ఉంది. దుష్ట సంహారం కోసం వ్రతం చేసిన ఆదిశక్తి- సకల దేవతలు తనకు సమర్పించిన ఆయుధాల్ని పూజించి అఖండమైన శక్తిని సంతరించుకున్నదట. ఇదే ప్రేరణతో రాముడు ఆయుధాల్ని అర్చించి రావణుణ్ని సంహరించాడనీ, పాండవులు జమ్మిచెట్టునీ, శస్త్ర అ స్త్రాల్నీ పూజించి దాయాదుల్ని ఓడించారనీ పురాణాల్లో చెబుతారు. ఆ తర్వాతి తర్వాత యుగాల్లోనూ చక్రవర్తుల రాజులు ఈ సంప్రదాయాన్ని కొనసాగించడం మన ఘన చరిత్రలో కనిపిస్తుంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో నేటికీ వీటిని అలాగే పాటిస్తారు.

**రాజరాజేశ్వరీ దేవత స్తుతి**
**% యాదేవీ సర్వభూతేషు**
**రాజరాజేశ్వరీ రూపేణ సంస్థితా**
**నమస్తస్యైనమస్తస్యై నమస్తస్యై నమోనమః**



**డా. ఈడ్పుగంటి పద్మజారాణి**
**జ్యోతిష్యము & వాస్తు నిపుణురాలు**

### అమ్మవారి నైవేద్యం



రాజరాజేశ్వరీ దేవికి చింతపండు పులిహోర, రవ్వ కేసరి, పరమాన్నం, లడ్డూలు నైవేద్యంగా సమర్పించాలి

### "శ్రీ రాజరాజేశ్వరి దేవి" గా కనకదుర్గమ్మ



శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి విజయవాడ ఆంధ్ర ప్రదేశ్ దసరా శరన్నవరాత్రుల సందర్భంగా సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు దసరా మహోత్సవములలో అమ్మవారి దివ్య అలంకారములు కనకదుర్గమ్మ కి 11 రోజులు 11 అలంకారములు చేస్తారు. అందులో భాగంగా సె అక్టోబర్ 2 గురు వారం ఆశ్వీజ శుద్ధ దశమి విజయదశమి "శ్రీ రాజరాజేశ్వరి దేవి" గా అలంకారము చేస్తారు.

**అమ్మవారికి నైవేద్యము: పులిహోర, గారెలు**
**అమ్మవారి చీర అలంకారం: ఆకుపచ్చ రంగు చీర**

## జ్ఞానాక్షి రాజరాజేశ్వరి దేవాలయం- బెంగుళూరు

రాజరాజేశ్వరి ఆలయ ప్రాంతం కర్ణాటక రాష్ట్రంలో బెంగళూరులోని ఆర్‌ఆర్ నగర్లో రాజరాజేశ్వరి ఆలయంగా ఉంది. దీనిని కళ్యాణనగరి అని కూడా పిలుస్తారు. దీనిని గతంలో కాంచనహళ్లి అని, చంపకవన అని కూడా పిలిచేవారు. ఈ ప్రదేశానికి రాజరాజేశ్వరి దేవి పేరు పెట్టారు. ఈ ఆలయం బెంగళూరులోని పురాతనతంత్ర చూడామణి'లో ఈ ప్రదేశం భారతదేశంలోని అనేక శక్తిపీఠాల 'కర్ణభాగ' లేదా 'చెవి'గా ఏర్పడుతుందని చెప్పబడింది. ఈ పీఠాన్ని జయ పీఠం అని పిలుస్తారు మరియు అధిష్టాన భైరవుడు అబీరు భైరవుడు. ఆలయాలలో ఒకటి, ఇది పార్వతి దేవి అవతారమైన రాజరాజేశ్వరి దేవి విగ్రహం.

పురాతన కాలంలో దేవ ఋషి నారదుడు వంటి అనేక మంది దేవతలు, ఋషులు, మునిలు, సిద్ధులు ఈ ప్రదేశంలోనే శ్రీ రాజరాజేశ్వరిని ప్రతిష్ఠించి సిద్ధి పొందారని చెబుతారు. అద్భుతమైన ఆలయ ప్రాంగణంలో జయ పీఠం అని పిలువబడే ఈ శక్తి పీఠంపై అధిష్టాన దేవత 'శ్రీ రాజరాజేశ్వరి' కూర్చుని ఉంది. అత్రేయ మహర్షి మరియు అతని భక్తురాలు అనుసూయ ఇక్కడ నివసించారని నమ్ముతారు.

ఇక్కడి ప్రధాన ఆకర్షణ ఆలయ గోపురం లేదా గోపురం, ఇది ఈ ఆలయ ప్రధాన ద్వారం దగ్గర దాదాపు 108 అడుగుల ఎత్తులో ఉంది. చాలా మంది ప్రజలు ఆధ్యాత్మిక భావన అనుభవిస్తారు మరియు వారి సమస్యలు మరియు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దేవత యొక్క ఆధ్యాత్మిక శక్తుల ద్వారా అదిగమించ గలమని భావిస్తారు. మార్చి చివరి వారంలో సూర్యకిరణాలు నేరుగా దేవి నుదిటిపై పడి ఆమె పాదాల వరకు ప్రయాణిస్తాయి. తరచుగా శ్వేత క్షేత్రంగా పిలువబడే ఈ ఆలయం బెంగళూరులోని ముఖ్య ప్రదేశాలలో ఒకటి, ఇది ప్రపంచవ్యాప్తంగా చాలా మంది భక్తులను ఆకర్షిస్తుంది

**శ్రీ రాజరాజేశ్వరి ఆలయ పురాణ గాథ:** ఈ ఆలయం చాలా ప్రాముఖ్యతను కలిగి ఉంది మరియు దీనికి అనేక ఇతిహాసాలు అనుసంధానించబడి ఉన్నాయి. పవిత్ర దేవతను ప్రార్థించడం ద్వారా చాలా మంది సాధువులు మోక్షాన్ని పొందిన ప్రదేశం ఇది. అక్కడి ప్రజలు ప్రస్తుత మందిరం ఉన్న ఈ ప్రదేశంలో అత్రేయ మహర్షి మరియు అతని భార్య అనుసుయ నివసించారని కూడా చెప్తారు ఈ ఆలయాన్ని 1960 సంవత్సరంలో శ్రీ తిరుచి మహాస్వామిగళ్ అనే ఋషి నిర్మించారు. ఆయనకు ఒక కల వచ్చింది, అక్కడ ఆయన ముగ్గురు దేవతలను చూశారు, మరియు ఒక స్వరం దక్షిణ భారతదేశానికి వెళ్లి ఒక పెద్ద ఆలయాన్ని నిర్మించమని సూచించింది.



**కాళికా దుర్గా పరమేశ్వరి ఆలయ నిర్మాణం:** ఆలయం ద్రావిడ శైలి నిర్మాణ శైలిలో నిర్మించబడింది. దీనికి ఐదు రాజగోపురాలు లేదా ఆలయ గోపురాలు ఉన్నాయి. శ్రీ రాజరాజేశ్వరి దేవి విగ్రహం దాదాపు ఆరు అడుగుల పొడవు ఉండి అత్యంత ప్రతిమాత్మకంగా ఉంటుంది, దీనిని శ్రీ జ్ఞానాక్షి దేవతగా కూడా పూజిస్తారు. ఇది స్వచ్ఛమైన గ్రానైట్ రాళ్లతో నిర్మించబడింది. ఈ ఆలయంలో మంచి గర్భగుడి, ఎత్తైన మందిరాలు మరియు ప్రాంగణం ఉన్నాయి, ఇది చాలా కళాత్మకమైనది. ఆలయానికి మూడు ద్వారాలు ఉన్నాయి. ఈ ఆలయం ఒక పెద్ద సముదాయంలో నిర్మించబడింది మరియు గణేశుడు మరియు ఇతర దేవతలకు ప్రత్యేక మందిరాలు ఉన్నాయి. ఆలయంపై ఉన్న క్లిష్టమైన శిల్పాలు చాలా విశేషంగా మనని ఆకట్టుకుంటాయి.

**శ్రీ రాజరాజేశ్వరి ఆలయ ఉత్సవాలు:** ఇక్కడ అనేక పండుగలు జరుపుకుంటారు. బెంగళూరు వాసుల ప్రధాన కేంద్రాలలో ఇది ఒకటి, ఇక్కడ అన్ని మతపరమైన కార్యకలాపాలు ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి, ఇక్కడ ఆలయం నృత్యం, సంగీతం మరియు బజనాలు వంటి సాంస్కృతిక ఉత్సవాలను క్రమం తప్పకుండా ఏర్పాటు చేస్తుంది. శుక్రవారాలు ఇక్కడ ప్రత్యేకమైనవి, ఇక్కడ భక్తులు తమ ప్రార్థనలు సమర్పించడానికి తరలివస్తారు. పార్వతి దేవిని "తర్కారి అలంగర" అని పిలిచే కూరగాయలతో అలంకరిస్తారు. దుర్గాష్టమి మరియు నవరాత్రిలను వైభవంగా మరియు ధైర్యంగా జరుపుకుంటారు. ఈ ఆలయంలోని ఇతర పండుగలు దీపావళి మరియు ఉగాది, ఇది కర్ణాటక నూతన సంవత్సరం.

**శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో పూజ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు:** బెంగళూరు వాసులకు ప్రసిద్ధి చెందిన ఈ ఆలయాలలో ఒకటి, ప్రపంచంలోని అన్ని ప్రాంతాల నుండి ప్రజలను కూడా ఆకర్షిస్తుంది. శుక్రవారాలు మరియు మంగళవారాలు చాలా ప్రత్యేకమైనవి, మరియు వీటిపై దేవతను పూజించడం వల్ల ఆధ్యాత్మిక శక్తులు పెరుగుతాయి. చండీ హెూమం ఎంతో భక్తితో నిర్వహిస్తారు. బ్రహ్మరథోత్సవంమరియు నవరాత్రి పండుగ వంటి పండుగలు ఇక్కడ చాలా ప్రసిద్ధి చెందాయి. ఏటా రథోత్సవాలు జరుపుకుంటారు. తొమ్మిది రోజుల నవరాత్రి చాలా ప్రసిద్ధి చెందింది.ఆలయానికి మూడు ద్వారాలు ఉన్నాయి. గర్భగృహంలో రాజరాజేశ్వరి తల్లి అందమైన విగ్రహం ఉంటుంది. వసంత నవరాత్రి లేదా చైత్ర నవరాత్రి సమయంలో, ఆలయం బ్రహ్మోత్సవాలను జరుపుకుంటుంది. బ్రహ్మోత్సవాల సమయంలో దేవత శక్తి యొక్క వివిధరూపాల్లో అలంకరించబడుతుంది. రాజరాజేశ్వరి ఆలయంలో ప్రత్యేక డ్రెస్ కోడ్ ఉంది, పురుషులు ధోతీ లేదా ప్యాంటు ధరిస్తారు, మహిళలు చీర లేదా చుడీదార్లు ధరిస్తారు.

# కష్టపడ్డవారికే కాంగ్రెస్ జడ్పీటీసీ టికెట్లు






**● సీఎం రేవంత్ కీలక ప్రకటన! ● స్థానిక ఎన్నికల్లో ఎలాగైన విజయం కోసం పావులు కదుపుతోంది ● జిల్లా పరిషత్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక దృష్టి ● ఒక్కో స్థానానికి ముగ్గురితో ప్రాథమిక జాబితాను సిద్ధం చేయాలని నిర్ణయం**

హైదరాబాద్ : రాష్ట్రంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఎలాగైన విజయం సాధించాలని అడుగులు కదుపుతోంది.అందులో భాగంగా జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక కోసం ప్రత్యేక దృష్టి పెట్టింది. జడ్పీటీసీలుగా పోటీ చేసేందుకు పెద్ద సంఖ్యలో ఆశావహులు ముందుకు వస్తున్న నేపథ్యంలో... ఒక్కో స్థానానికి ముగ్గురితో ప్రాథమికంగా ఒక జాబితాను సిద్ధం చేయాలని నిర్ణయించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు తయారు చేసే జాబితాను టీపీసీసీకి పంపనున్నారు. అలా వచ్చిన జాబితాలను పరిశీలించి జడ్పీటీసీ అభ్యర్థిని టీపీసీసీ ఫైనల్ చేయనుంది.

ఒకవైపు స్థానిక ఎన్నికలు, మరోవైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. జిల్లా పరిషత్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేసే పార్టీ అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టాలని ఇన్‌చార్జి మంత్రులకు రేవంత్ రెడ్డి సూచించారు. జడ్పీటీసీ ఎంపిక విషయంలో జిల్లా మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ముఖ్య నాయకుల అభిప్రాయాలు తీసుకోవాలని, ఈ నెల ఐదో తేదీ కల్లా ఆశావహుల జాబితాను సిద్ధం చేయాలని రేవంత్ రెడ్డి సంబంధిత మంత్రులకు సూచించారు. ఒక్కో స్థానానికి ముగ్గురు ఆశావహులతో కూడిన జాబితాను రూపొందించి టీపీసీసీ అధ్యక్షునికి పంపాలని కోరారు. టీపీసీసీకి వచ్చిన జాబితాలపై చర్చించిన తర్వాత టీపీసీసీనే అభ్యర్థిని నిర్ణయిస్తుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపికలో వారి గుణగణాలు, అభ్యర్థులకు ప్రజల్లో ఉన్న పరపతి, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మంచి అభ్యర్థిని ఎంపిక చేస్తే ఎన్నిక సాఫీగా జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అన్ని రకాలుగా అర్హులైన అభ్యర్థులనే పీసీసీ ఎంపిక చేస్తుందని, రాష్ట్రంలో ఎక్కువ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని మంత్రులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. కాగా, ఎంపీటీసీ అభ్యర్థులను స్థానికంగా డీసీసీ స్థాయిలోనే ఎంపిక చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఒకవేళ ఏకగ్రీవం కాకపోతే అభ్యర్థుల జాబితాను పీసీసీకి పంపించాలని తద్వారా పీసీసీ ఫైనల్ చేస్తుందని తెలిపినట్లు సమాచారం.

## రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : దసరా పండుగ(విజయదశమి) సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దసరా పండుగను విజయదశమి పేరుతో దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నారని అన్నారు. తెలంగాణ సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలాయ్ బలాయ్ తీసుకోవడం.. పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం.. శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం తెలంగాణకు ప్రత్యేకమని సీఎం గుర్తు చేశారు. తెలంగాణ అప్రతిహత విజయాలతో అభివృద్ధి సాధించాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలతో ఈ పండుగ జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆ దుర్గామాతను ప్రార్థించారు.

## సికింద్రాబాద్ నుంచి 1450 దసరా స్పెషల్ రైళ్లు!

హైదరాబాద్, అక్టోబర్ 1: పండుగ సీజన్ రద్దీ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే స్పెషల్ విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. సుమారు 1,450 ప్రత్యేక రైళ్లను నడపడంతోపాటు మరో 500 పాసింగ్-త్రూ స్పెషల్ సర్వీసులను అందిస్తుంది. అలాగే పలు మార్గాల్లో నడిచే సుమారు 350 సాధారణ రైళ్లకు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేస్తుంది. ఈ స్పెషల్ సర్వీసులన్నీ ఈ ఏడాది నవంబర్ చివరి వరకు కొనసాగుతాయని స్పష్టం చేసింది.దసరా పండుగ నెల పొడవునా పండుగ సీజన్ రద్దీని దృష్టిలో ఉంచుకుని, భారత ప్రభుత్వం రైలు సేవలను పెంచడం ద్వారా ఈ రద్దీని నిర్వహించడానికి ఈ చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా దక్షిణ మధ్య రైల్వేలు ఈ పండుగ సీజన్ కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేయడం ద్వారా పండుగ సీజన్ రద్దీని నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రయాణీకుల హోల్డింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేస్తున్నారు. రోజుకు 1.3 లక్షల మంది రాకపోకలు సాగించే అవకాశం ఉన్నందున నవంబర్ చివరి వరకు ఈ ప్రత్యేక ఏర్పాట్లు అమలులో ఉంటాయని వెల్లడించింది.










suryachitramagazine@gmail.com

# సూర్య సినిమా

## 'రిపబ్లిక్'కు నాలుగేళ్లు పూర్తి



నాలుగు సంవత్సరాల క్రితం 'రిపబ్లిక్' మూవీ వచ్చి అందరిలోనూ ఎన్నో ఆలోచనల్ని రేకెత్తించింది. దేవా కట్టా దర్శకత్వంలో సాయి దుర్గ తేజ్ హీరోగా నటించిన ఈ మూవీని రాజకీయాలు, అవినీతి, సమాజనంలోని అసమానతల నేపథ్యంలో తెరకెక్కించారు. ఇది కేవలం ఒక చిత్రం మాత్రమే కాదు.. సమాజాన్ని ప్రతిబింబించే భావోద్వేగ చిత్రం. నటుడిగా సాయి దుర్గ తేజ్ స్థానాన్ని సుస్థిరం చేసిన చిత్రంగా 'రిపబ్లిక్' నిలుస్తుంది. వ్యవస్థాగతంగా కుళ్ళిపోయిన సమాజంలో విధి నిర్వహణలో ఉన్న ఐఎఎస్ అధికారిగా సాయి దుర్గ తేజ్ అసమానమైన నటనను కనబర్చారు.

'రిపబ్లిక్' మూవీ వచ్చి నాలుగేళ్లు అవుతోంది. 'రిపబ్లిక్' విడుదలకు కొన్ని వారాల ముందు, సాయి దుర్గ తేజ్ ప్రమాదానికి గురి అవ్వడం, ప్రమోషన్స్‌కి అందుబాటులో లేకపోవడం, క్లిష్టకాలంలో విడుదలైన ఈ చిత్రం అందరి ప్రశంసల్ని అందుకుంది. ఏప్రిల్ 2023న విడుదలైన విరూపాక్ష అతని కెరీర్‌లో భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది.ఆ మూవీ 100 కోట్లకు పైగా వసూలు చేసి ఓ చరిత్రగా సాయి దుర్గ తేజ్ కెరీర్‌లో నిల్చింది. '%దీ=వా%' మూవీతో తన గురువు, ఆరాధ్యుడైన పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్‌తో స్క్రీన్ స్పేస్‌ను పంచుకుని సాయి దుర్గ తేజ్ కెరీర్‌లో మరో మైలురాయిని అందుకున్నారు. ఈ సినిమాలు సాయి దుర్గ తేజ్ స్పార్క్ తగ్గలేదని నిరూపించాయి. ప్రతి సినిమా ఒక మైలు రాయిలా మారాయి. రెండున్నర సంవత్సరాల అవిశ్రాంత కృషి తర్వాత సాయి దుర్ఘ తేజ్ 'సంబరాల ఏటి గట్టు'తో తనని తాను మరింత కొత్తగా ఆవిష్కరించుకునేందుకు సిద్దమవుతున్నారు. ఈ పాన్-ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా కోసం సాయి దుర్గ తేజ్ తన శరీరాకృతిని మార్చుకున్నారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ మీద రోహిత్ కెపి దర్శకత్వంలో రానున్న ఈ మూవీని 125 కోట్ల బడ్జెట్‌తో భారీ ఎత్తున తెరకెక్కిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళంలో విడుదలవుతోంది.

## మటన్ సూప్ టీజర్ బాగుంది.. బిగ్ సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను.- అనిల్ రావిపూడి

క్రేజీ టైటిల్, డిఫరెంట్ స్టోరీతో రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు (BVC) బ్యానర్లపై రమణ్, వర్షా విశ్వనాథ్ హీరో హీరోయిన్లుగా రామచంద్ర వట్టికూటి తెరకెక్కించిన చిత్రం 'మటన్ సూప్'. 'విట్‌నెస్ ది రియల్ క్రైమ్' ట్యాగ్ లైన్. మల్లిఖార్జున ఎలికా (గోపాల్), రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి నిర్మాతలుగా రానున్న ఈ నూతన చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్, మోషన్ పోస్టర్, పాటలు ఇప్పటికే సోషల్ మీడియాలో అందరినీ



ఆకట్టుకున్నాయి. దసరా సందర్భంగా అక్టోబర్ 1 నాడు 'మటన్ సూప్' టీజర్‌ను సెన్సేషనల్ డైరెక్టర్, హిట్ మెషీన్ అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. ఈ టీజర్‌ను లాంఛ్ చేసిన అనంతరం... అనిల్ రావిపూడి మాట్లాడుతూ .. "మటన్ సూప్' టైటిల్ చాలా బాగుంది. టీజర్ బాగుంది. టీం కూడా చాలా కొత్తగా ఉంది. దర్శకుడు రామచంద్రకు, హీరో రమణ్‌కు, సినిమా టీంకు ఆల్ ది బెస్ట్. అక్టోబర్ 10న చిత్రం రాబోతోంది. అందరూ చూసి పెద్ద సక్సెస్ చేయాలి' అని అన్నారు. నిర్మాత మల్లిఖార్జున ఎలికా (గోపాల్) మాట్లాడుతూ .. 'గ్రేట్ డైరెక్టర్ అనిల్ రావిపూడి గారు మా టీజర్‌ను లాంఛ్ చేయడం ఆనందంగా ఉంది. మంచి స్క్రీన్ ప్లేతో మా చిత్రం రాబోతోంది. అక్టోబర్ 10న మా సినిమా రాబోతోంది. అందరూ వీక్షించి సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను' అని అన్నారు.

## 'బా బా బ్లాక్ షీప్' మోషన్ పోస్టర్

గన్స్, గోల్డ్ చుట్టూ జరిగే వేట.. ముగ్గురి తెలివి తేటలు.. ఒక రోజులో జరిగే ఘటనలు.. ఓ ఆరుగురి ప్రయాణంతో న్యూ ఏజ్ క్రైమ్ కామెడీగా 'బా బా బ్లాక్ షీప్' అనే చిత్రం రాబోతోంది. దోణెపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోణెపూడి నిర్మిస్తున్న ఈ మూవీకి గుణి మంచికంటి దర్శకత్వం వహిస్తున్నారు. టినులు ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ లగుసాని , విష్ణు, కార్తికేయ,



విస్మయశ్రీ, మాళవి తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. దసరా సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన కథ, కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ మేకర్స్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ చేతుల మీదుగా 'బా బా బ్లాక్ షీప్' మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేయించారు. ఈ మోషన్ పోస్టర్‌ను చూస్తుంటే.. గన్స్, గోల్డ్ చుట్టూ జరిగే ఓ న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ అని అర్థం అవుతోంది. ఓ ముగ్గురు చుట్టూ తిరిగే కథ అంతా కూడా ఒకే రోజులో జరుగుతుందని తెలుస్తోంది. ఈ ప్రయాణంలో వారికి ఎదురైన పరిస్థితులు, ఆ పరిస్థితుల్లోంచి పుట్టే కామెడీ, ఈ జర్నీలో జరిగే క్రైమ్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌కి కొత్త అనుభూతిని ఇచ్చేలా కనిపిస్తోంది. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్‌ను త్వరలోనే ప్రారంభించనున్నారు. మిగతా వివరాల్ని మేకర్లు త్వరలోనే ప్రకటించనున్నారు.

## 'మన శంకరవరప్రసాద్' గారు నుంచి శశిరేఖగా నయనతార



మెగాస్టార్ చిరంజీవి, హిట్ మెషిన్ అనిల్ రావిపూడి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకరవరప్రసాద్ గారు'లో నయనతార హీరోయిన్ గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. శశిరేఖగా ది మాగ్నిఫిసెంట్ నయనతారను పరిచయం చేస్తూ, మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పసుపు రంగు చీరలో మెరిసిపోతూ కనిపించిన ఆమె లుక్ అదిరిపోయింది. ముత్యాల హారం, సంప్రదాయ గాజులతో, చేతిలో నలుపు రంగు హ్యాండిల్‌తో ఉన్న గొడుగును పట్టుకొని, ఫెస్టివల్ వైబ్ కనిపించిన ఈ లుక్ శశిరేఖ పాత్రకు గొప్ప సొగసుని తీసుకొచ్చింది. నయనతార పాత్ర కథలో చాలా కీలకంగా ఉండబోతోంది. ఆసక్తికరమైన విషయం ఏంటంటే, సాధారణంగా సినిమా ప్రమోషన్లకు దూరంగా ఉండే నయన్, ఈ చిత్ర ప్రచార కార్యక్రమాల్లో మొదటి నుంచే చురుకుగా పాల్గొంటున్నారు. రేపు విజయదశమి శుభ సందర్భంగా ఒక ప్రత్యేక సర్‌ప్రైజ్‌ను అనౌన్స్ చేస్తున్నట్లు మేకర్స్ తెలియజేశారు. ఇంతకుముందు చిరంజీవి ఫస్ట్ లుక్‌ను విడుదల చేస్తూ, ఆయనను స్టైలిష్ అవతార్‌లో చూపించడం అందరినీ ఆకట్టుకుంది. టాప్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా సమీర్ రెడ్డి, ఎడిటర్‌గా తమ్మిరాజు, ఆర్ట్ డైరెక్టర్‌గా ఏఎస్ ప్రకాష్ పనిచేస్తున్నారు. ఎస్. కృష్ణ, జి. ఆది నారాయణ సహ రచయితలు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేస్తున్నారు. వ్యవహరిస్తున్నారు.మన శంకరవరప్రసాద్ గారు' 2026 సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## అక్టోబర్ 31న 'మాస్ జాతర'



మాస్ మహారాజా రవితేజ అభిమానులతో పాటు, తెలుగు సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మాస్ జతర' చిత్రం అక్టోబర్ 31, 2025న విడుదల కానుంది. ఈ మేరకు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. వింటేజ్ వైబ్స్, పక్కా కమర్షియల్ అంశాలతో ఈ చిత్రం థియేటర్లలో అసలుసిసలైన మాస్ పండుగను తీసుకురాబోతుంది. ఇప్పటివరకు ఈ సినిమా నుండి విడుదలైన ప్రతి కంటెంట్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకొని, వినోదాల విందుకి హామీ ఇచ్చింది. కొత్త విడుదల తేదీ ప్రకటన సందర్భంగా రవితేజ, హైపర్ ఆదిలపై చిత్రీకరించిన ఒక సరదా వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. ఆ వీడియోలో హైపర్ ఆది 2025 సంక్రాంతి, వేసవి సెలవులు, వినాయక చవితి అంటూ పలుసార్లు సినిమా వాయిదా పడటాన్ని సరదాగా ఎగతాళి చేయగా.. ఆలస్యానికి గల కారణాలపై రవితేజ అంతే చమత్కారంగా స్పందించారు. మాస్ మహారాజా రవితేజ అంటేనే సందడి. ఒకప్పటి మాస్ మహారాజాను గుర్తుచేస్తూ.. సినిమా యొక్క ఆహ్లాదకరమైన మరియు వినోదాత్మక శైలిని చూపిస్తూ ఈ వీడియో ఎంతో ఉత్సాహభరితంగా సాగింది. ఇప్పటికే విడుదలైన 'మాస్ జతర' టీజర్‌కి అన్ని వర్గాల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ముఖ్యంగా మాస్ రాజా అభిమానులను, మాస్ ప్రేక్షకులను కట్టిపడేసింది. అలాగే, రెండు పాటలు విడుదలై శ్రోతల నుంచి భారీ ప్రశంసలు అందుకున్నాయి. అందరూ కాలు కదిపేలా ఎంతో ఉత్సాహభరితంగా స్వరపరిచిన ఈ పాటలు సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారాయి. ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ-శ్రీలీల జోడి అంటే, ప్రేక్షకులలో ప్రత్యేకమైన అంచనాలు ఉంటాయి. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఈ జోడి మరోసారి బాక్సాఫీస్ వద్ద మెరుపులు మెరిపించడానికి సిద్ధమవుతోంది.

## 'జటాధర' నుంచి ధన పిశాచి సాంగ్

నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచరల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ అందించే ఈ పాన్-ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. హై-ఆక్టేన్ విజువల్స్, పౌరాణిక ఇతివృత్తాలతో ఈ చిత్రం గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతుంది. ఇటివల రిలీజ్ అయిన టీజర్ నేషనల్ వైడ్ గా వైరల్ అయ్యింది. ఫస్ట్ ట్రాక్ 'సోల్ ఆఫ్ జటాధార' కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. విజయదశమి కానుకగా ఈ సినిమా నుంచి ధన పిశాచి సాంగ్ రిలీజ్ చేశారు. సమీరా కొప్పికర్ పవర్ ఫుల్ ట్రాక్ కంపోజ్ చేశారు. శ్రీ హర్ష ఈమని రాసిన లిరిక్స్ టెర్రిఫిక్ గా వున్నాయి. సాహితీ చాగంటి ఇంటెన్స్ వోకల్స్ తో ఆకట్టుకున్నారు. ఈ సాంగ్ లో సోనాక్షి సిన్హా పెర్ఫార్మెన్స్ అదిరిపోయింది. ఈ సాంగ్‌ని ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. జటాధరలో సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా, దివ్య ఖోస్లా, శిల్పా శిరోధ్కర్, ఇంద్రకృష్ణ, రవి ప్రకాష్, నవీన్ నేని, రోహిత్ పాఠక్, ఝాన్సీ, రాజీవ్ కనకాల, సుభలేఖ సుధాకర్‌తో పాటు ప్రముఖ నటులు కనిపించనున్నారు. మంచికి చెడుకి, వెలుగుకి చీకటికి, మానవ సంకల్పానికి విధికి మధ్య జరిగే అద్భుతమైన పోరాటాన్ని ఈ చిత్రం చూపించబోతోంది.

జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరు?ణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హల్, నిఖిల్ నందా నిర్మించారు.



## అఫీషియల్‌గా 'పరాక్' లాంచ్

శ్రీమురళి చిత్రం 'పరాక్' శ్రీ బండే మహాకాళి ఆశీస్సులతో ప్రారంభ మైంది. యంగ్ ఫిల్మ్ మేకర్ హలేష్ కోగుండి శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' కు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీమురళి తొలిసారి దర్శకుడు హలేష్ కోగుండితో 'పరాక్' కోసం జతకట్టారు. బగీరా విజయం తర్వాత, రోరింగ్ స్టార్ శ్రీమురళి 'పరాక్' కు సైన్ అప్ చేశారు. ఈ చిత్రం ముహూర్త వేడుక బెంగళూరులోని బండి మహాకాళి ఆలయంలో జరిగింది, చన్నగిరి ఎమ్మెల్యే శివగంగ బసవరాజు ప్రారంభోత్సవం సందర్భంగా క్లాప్ కొట్టి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలి



పారు. శ్రీమురళి విలేకరులతో మాట్లాడుతూ.."పరాక్ ఒక వింటేజ్ స్టైల్ సినిమా. నా నెక్స్ట్ ప్రాజెక్ట్ కథ ఎంచుకోవడానికి దాదాపు 200 స్క్రిప్ట్‌లను విన్నాను. నేను గత రెండు సంవత్సరాలుగా 'పరాక్' టీంతో ప్రయాణించాను. ఈ నెల నుండి షూటింగ్ ప్రారంభమవుతుంది. చరణ్ రాజ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తారు. 'పరాక్' చిత్రానికి హలేష్ కోగుండి దర్శకత్వం వహిస్తారు. కొన్ని షార్ట్ ఫిలిమ్స్ కి పనిచేసిన తర్వాత 'పరాక్' అతని తొలి ఫీచర్ ఫిల్మ్. ఈ చిత్రాన్ని బ్రాండ్ స్టూడియోస్ నిర్మిస్తోంది. చరణ్ రాజ్ సంగీతం అందిస్తారు, సందీప్ వల్లూరి సినిమాటోగ్రఫర్, ఉల్లాస్ హైదూర్ ఆర్ట్ డైరెక్టర్. ఇంచార సురేష్ కాస్ట్యూమ్స్ డిజైనర్. త్వరలోనే మరిన్ని వివరాలు తెలియజేస్తారు మేకర్స్.

## 'ఆర్యన్' టీజర్

శుభ్ర & ఆర్యన్ రమేష్‌తో కలిసి విష్ణు విశాల్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రానికి ప్రవీణ్ కె దర్శకత్వం వహించారు. అక్టోబర్ 31న ప్రపంచవ్యాప్తంగా తమిళం, తెలుగు భాషలలో విడుదల కానున్న ఈ చిత్రం టీజర్ విడుదలైంది. ఒక థ్రిల్లింగ్ హత్య దర్యాప్తు, విష్ణు విశాల్ పాత్రను ఆసక్తికరంగా పరిచయం చేస్తూ ఈ టీజర్ ప్రేక్షకులను డార్క్ అండ్ ఇంటెన్స్ వరల్డ్ ని తీసుకెళుతుంది. తనదైన శైలిలో విభిన్నమైన పాత్రతో, విష్ణు విశాల్ ఆకట్టుకున్నారు. 34 నెలల విరామం తర్వాత, విష్ణు విశాల్ ఈ శక్తివంతమైన టీజర్ తో సోలో లీడ్ గా కం బ్యాక్ ఇచ్చారు. 'రాట్ససన్' విజయం తర్వాత, విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్' లో పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రంలో సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటించగా, సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి, అవినాష్ అభిషేక్ జోసెఫ్ జార్జ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఒక యూనిక్ ఇన్వెస్టిగేటివ్ యాక్షన్



థ్రిల్లర్‌గా రూపొందించబడిన ఈ చిత్రానికి దర్శకుడు ప్రవీణ్ కె దర్శకత్వం వహించారు. విష్ణు విశాల్ నటించిన FIR చిత్రానికి దర్శకత్వం వహించిన మను ఆనంద్ ఈ చిత్రానికి సహ రచయిత. ఆర్యన్ అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ట్రైలర్ మ్యూజిక్ లాంచ్ అప్‌డేట్‌లు త్వరలో తెలియజేస్తారు. ఈ చిత్రం అక్టోబర్ 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## అక్టోబర్ 10న 'ఆన్ ది రోడ్'

తెలుగు తెరపై తొలిసారి రోడ్-ట్రిప్ థ్రిల్లర్ రూపంలో ఓ వినూత్న కథ రాబోతోంది. 'ఆన్ ది రోడ్' టైటిల్ తో రూపొందిన ఈ చిత్రం, పూర్తిగా లడఖ్ లోయల్లో, ప్రకృతి అందాల మధ్య చిత్రీకరించబడింది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన సూర్య లక్కోజు, గతంలో ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మతో అనేక ప్రాజెక్టుల్లో పనిచేశారు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం, ఆర్‌జీవీ స్వయంగా ఈచిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఇప్పటికే ఈ సినిమాపై మంచి ఆసక్తి పెరిగింది. "ఓ యువకుడు, అనుకోకుండా లడఖ్ రోడ్ ట్రిప్ లో తన మాజీ ప్రియురాలిని కలుస్తాడు. అయితే ఆమె తన భర్తతో తన మ్యారేజ్ యానివర్సరీ సందర్భంగా వెకేషన్‌కి వస్తుంది. అదేమీ పట్టించుకోకుండా గతాన్ని గుర్తు చేస్తూ అతను... ఆమెను తనతో వచ్చేయమని సీరియస్ గా ప్రపోజ్ చేస్తాడు. ఈలోగా ఈ విషయం ఆమె భర్తకు కూడా తెలియటంతో వాళ్ల ముగ్గురి మధ్య ఎటువంటి ఘర్షణాత్మక సన్నివేశాలు జరిగియనేదే ఈ చిత్ర కథాంశం. సస్పెన్స్, డ్రామా ప్రధానంగా సాగే ఈ సినిమాలో ప్రధాన పాత్రల మధ్య భావోద్వేగాలతో కూడిన ఈ రోడ్ ప్రయాణం, లడఖ్ అందాలు, ప్రేక్షకులను ఎమోషనల్‌గా కట్టిపడేస్తుందని నమ్ముతున్నాను" అని చెప్పారు. ఎస్ పిఎల్ పిక్చర్స్ బ్యానర్‌పై సూర్య లక్కోజు మరియు రాజేష్ శర్మ నిర్మించిన ఈ చిత్రం ఇప్పుడు అక్టోబర్ 10, 2025న రెండు తెలుగు రాష్ట్రాలలో విడుదలకు సిద్ధమవుతోంది.



## 'బ్యాడ్ బాయ్ కార్తీక్' నుంచి సాంగ్ రిలీజ్

హీరో నాగశౌర్య అప్ కమింగ్ అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ బ్యాడ్ బాయ్ కార్తీక్. ఈ మూవీకి రామ్ దేశినా (రమేష్) దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో నాగశౌర్య జోడిగా విధి హీరోయిన్‌గా నటిస్తోంది. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. నాగ శౌర్య క్యారెక్టర్ ఇంటెన్స్ నేచర్ ని ప్రజెంట్ చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్ కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ నా మావ పిల్లనిత్తానన్నాడే సాంగ్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ అమెరికా నుండి వచ్చాను పాటని రిలీజ్ చేశారు. హారిస్ జయరాజ్ ఈ సాంగ్ ని ఫుట్ ట్యాపింగ్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. చంద్రబోస్ రాసిన లిరిక్స్ మాస్‌ని ఆకట్టుకోవడంతో పాటు చాలా డెప్త్ మీనింగ్ తో వున్నాయి. చందన బాల కళ్యాణ్, గోల్డ్ దేవరాజ్ వోకల్స్ సాంగ్ లో మరింత ఎనర్జీ నింపాయి. ఈ సాంగ్ కి సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంలో సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, వెన్నెల కిషోర్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్ కుమార్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ రసూల్ ఎల్లోర్ డీవోపీగా పని చేస్తున్నారు.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044


విజయ దశమి
శుభాకాంక్షలు
VR4 SAHYOG CHARITABLE TRUST
Regd. 249/IV/23
VR4 SAHYOG
CHARITABLE TRUST
WARM WELCOME
to MANIKONDA
Alai Balai
Telangana Traditional
Dasara Milan
4-10-2025
SATURDAY
4pm TO 7pm
JAYA SHANKAR PARK
NEAR MG PARK


నాగిరెడ్డిపేట్ మండల ప్రజలకు, రైతులకు, అధికారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
దేవి నవరాత్రులు, బతుకమ్మ, దసరా, దీపావళి
శుభాకాంక్షలు
నాగిరెడ్డిపేట మండల ఫోటో & వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్


బతుకమ్మ, దసరా మరియు దీపావళి
శుభాకాంక్షలు
పెద్దబచ్చగారి జ్ఞానప్రకాష్ రెడ్డి


ఉమ్మడి కోటగిరి మండల నాయకులు,
కార్యకర్తలకు, ప్రజలకు,
బతుకమ్మ, దసరా, దీపావళి
శుభాకాంక్షలు
కోనేరు శశాంక్
NRI
బాన్సువాడ నియోజకవర్గం


కరీంనగర్ ప్రజలకు,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు
దసరా మరియు దీపావళి
శుభాకాంక్షలు
Happy Diwali
చల్ల స్వరూపరాణి - హరిశంకర్


దసరా, దీపావళి శుభాకాంక్షలు
మధుర
బేకర్స్ & చాట్స్
ప్రో॥ పట్టెం సతీష్
9133766416
ఆర్.టి.సి కాంప్లెక్స్, న్యూ బస్టాండ్, ఆర్మూర్, జిల్లా: నిజామాబాద్.


దసరా, దీపావళి శుభాకాంక్షలు
M.K. OXYGEN CENTRE
Respiratory Therapy
EQUIPMENTS
YOUR HEALTH
IS OUR PRIORITY
RENT SALE
NARESH GAJULA
97004 00351


సూర్య దిన పత్రికకు
దసరా, దీపావళి
శుభాకాంక్షలు -2025


విజయ దశమి
శుభాకాంక్షలు
సత్యం బాబు


దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు
శ్రీ కూనంనేని సాంబశివరావు
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,
శాసనసభ్యులు, కొత్తగూడెం
నియోజకవర్గం
శ్రీ ఎస్ కె సాబీర్ పాషా
జాతీయ సమితి సభ్యులు,
జిల్లా సిపిఐ కార్యదర్శి,
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
CPI
1925-2025
CENTENARY OF STRUGGLES & SACRIFICES
కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు, 'సూర్య'
దినపత్రిక పాఠకులకు విజయదశమి
శుభాకాంక్షలు.


దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు
ఇల్లందు
నియోజకవర్గ
ప్రజలకు, 'సూర్య'
దినపత్రిక
పాఠకులకు
విజయదశమి
శుభాకాంక్షలు.
శ్రీ కోరం కనకయ్య
శాసనసభ్యులు, ఇల్లందు నియోజకవర్గం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా


దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు
పినపాక
నియోజకవర్గ
ప్రజలకు, 'సూర్య'
దినపత్రిక
పాఠకులకు
విజయదశమి
శుభాకాంక్షలు.
శ్రీ పాయం వెంకటేశ్వర్లు
శాసనసభ్యులు, పినపాక నియోజకవర్గం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా